


క్రిస్టీన్ కీలర్ (ప్రార
ఆంధ్రసచిత్రవార
పత్రిక
25 నయా
8-11-6



'జానకి ధరించిన దుస్తులు ....!' (ఫొటో: ప్రభాకర్)



శ్రీకృష్ణసాయిఫిలింస్ వారి
పెంచినప్రేమ
స్టూడియో
ఏవి.ఎమ్
దర్శకత్వం.. కృష్ణన్ పంజు
నిర్మాత. యర్రాఅప్పారావు



తప్పక చూడండి!
రచన
జి.కె.మూర్తి
సంగీతం
కోదండపాణి
కెమెరా
రవికాంత్
కళా డైరెక్టర్
ఎస్.డి.లాల్
విఠల్ ప్రొడక్షన్స్ వారి
గురువును మించిన శిష్యుడు
నిర్మాత: దర్శకుడు
విఠలాచార్య
Negative Rights by SREE SREE NIVASA MOVIES

శ్రీరామచరిత మానస్

"రామచరిత మానస్" రెండు సంచికల్లో చదివాను. చదువను, చదువను మళ్లీ చదువుదా మనిపిస్తుంది. భాష చాలా చక్కగా, అందరికీ అర్థమయ్యేలాగుంది. చదివేటప్పుడు అమరకోశం జ్ఞాపక మొస్తుంది. శివునకు, పార్వతికి ఉన్న పేర్లన్నియు పొందికగా అమర్చబడి యున్నవి. నేనింతవరకు రామాయణం పద్యకావ్యంలోనే చదివి యుంటిని కానీ, యిదే మొదటిసారి వచన కావ్యం చదవడం.

శ్రీ ముంగర శంకరరాజుగారికి, గ్రంథమును ప్రచురించిన మీకు నా ధన్యవాదములు.

నరేంద్రనాథ్ ఆవడి)

* * *

శ్రీ తులసీదాసు మహాకవి, లేఖిని నుండి వెలువడిన "రామచరిత మానస్" కి, శ్రీ ఎం. ఎస్. రాజు చేసిన యీ తెలుగుసేత ఆంధ్ర సచిత్ర వార పత్రి ప్రచురించడం పత్రికాభివృద్ధి పథకంలో ఒక అంశమే యీ సహాయం అని చెప్పాలి.

ఎ. వి. నరసింహం (ఆమదాలవలస)

క థ లు

"సంస్కారం" అను కథ నన్నెంతో ఆకర్షించినది. ఇక ఆదివిష్ణుగారు రచించిన "మనిషి—మిథ్య" కథ సాగరములోని, తరంగములవలే సాగునని తలంచుచున్నాను.

సి. రావచంద్రప్ప ఉరవకొండ)

* * *

హ్హ .... హ్హ .... హ్హ .... 'స్టంటు సినిమా కథ' చదివి నవ్వాపుకోలేకపోయాను. మిత్రులందర్నీ రాజారావు అమాంతంగా 'ఏప్రిల్‌ఫూల్' చేసేశాడు. ఆఖరికి రాజారావు కూడా 'ఏప్రిల్ ఫూల్' అవక తప్పలేదు. నాకు ఈ కథ చాలా బాగా నచ్చింది.

తలిసెట్టి ఆనంద్ (తిరుపతి)

సం దే హం

ఈవారం 18—10—63 తేదీ పత్రికలో శ్రీ వి. సుబ్రహ్మణ్యం కడప) గారు ('ఉత్తరాలు' శీర్షికలో) 'పునర్జన్మ' చిత్రంలో కృష్ణకుమారి 'నల్లచీర' ఏ సందర్భంలో కట్టుకుందో తెల్పమని చిన్న అనుమానం వెలిబుచ్చారు. కాని, అది కేవలం అసమంజసమయిన అనుమానమని మా అభిప్రాయం. ఆ సందేహం తీరినందున కల్గే లాభం గాని లేనందున కల్గే నష్టంగాని ఏమిటో తెలియకున్నది. పత్రికలు కేవలం 'విమర్శనాత్మక దృష్టి'తో చూడటం చాలా గర్హించదగ్గ విషయం. కాబట్టి పత్రికాముఖంగా ఇటువంటి సందేహాలకు తావివ్వరనీ, దీనికి సోదర పాఠకులు నాతో ఏకీభవిస్తారనీ ఆశిస్తున్నాను.

జి. సన్యాసిరావు (షిడోల్)

బొమ్మల కొలువు

25—10—63 తేదీ వారపత్రికలో నన్ను ఎక్కువ ఆకర్షించినది. జమున బొమ్మలకొలువు వ్యాసం. ఆ వ్యాసం చదువుతూంటే సినిమా

ఉత్తరాలు

తారలకు కూడా ఇటువంటి భక్తి గౌరవాలూ, హాబీలు ఉంటాయా అని ఆశ్చర్యపోయాను.

వి. బాలకేశవులు (కర్నూలు)

* * *

మ న శ్శాం తి


కన్నవారినీ, కట్టుకున్నవారినీ విడచి దేశ రక్షణకై కొన్ని వేలమైళ్ల దూరంలో యుంటున్ననూ మీ (మా) పత్రిక మాకు కొంత మనశ్శాంతిని చేకూర్చుచున్నదని చెప్పుటకు సందేహంలేదు.

సూర్యప్రసాద్ (1312269), వెంకటేశ్వరరావు(1309815), ఇస్మాయిల్ (1318505), గురవయ్య, చిన్నబ్బాయి. ★

ఆమె పంటినొప్పి వలన బజారుకు వెళ్లలేక పోయెను...



సారిడన్ 'రోష్'



నొప్పిని పోగొట్టును, సేదదేర్చును, నవోత్సాహమును కలిగించును

సారిడన్ నొప్పులనుండి త్వరితముగా, నిరపాయముగా, నిశ్చయముగా స్వస్థత కలిగించును. పంటినొప్పి, తలనొప్పి, ఒంటినొప్పి, జ్వర చిహ్నములు, మామూలు అస్వస్థతలకు సారిడన్ వేసుకోండి. పెద్దవారికి 1 బిళ్ళ: పిల్లలకు ¼ నుండి ½ బిళ్ళ వరకు.

ఒకే సారిడన్ బిళ్ళ చాలును
ఒక బిళ్ళ ఖరీదు 13 నయా పైసలు

'రోష్' తయారు   ఏకైక డిస్ట్రిబ్యూటర్లు: వాల్టాస్ లిమిటెడ్

JWT-VT-4797

ఆంధ్రసచిత్రవార పత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

*

శుక్రవారం : 8—11—63
శోభకృన్నామ సం॥ (అధిక) కార్తీక బహుళ అమావాస్య
సంపుటము 56 సంచిక : 10

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఒక సంవత్సరం చందా వివరాలు

ఇండియా : రూ. 13.00 ఇతర దేశాలు : ఓడమీద (Sea Mail) రు. 20.00. (విమానం ద్వార (Air Mail): బ్రిటన్, జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు— రూ. 114.00. అమెరికా రూ. 176.50. ఆస్ట్రేలియా : 135.00.)

*

విడిప్రతి : 25 న.పై.
సంవత్సర చందా : 13-0-0.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
3, తంబుచెట్టి వీథి, మద్రాసు-1



తార జానకి ప్రత్యేక చిత్రం

మనలో మాట

కొన్ని కొత్త శీర్షికలు ప్రవేశ పెట్టాలీ అంటే కొన్ని పాతశీర్షికలు తీసివేయడమో, తాత్కాలికంగా నిలపడమో జరగాలి. వాస్తవానికి యీ వారంనుంచీ వేస్తున్న 'క్రిస్టిన కీలర్' కథను యింతకు క్రితమే వేద్దామనుకున్నాము. కాని స్థలాభావంచేత యింతవరకూ ప్రారంభించలేక పోయాము. సాధారణంగా 'వంటవాడు' 'తోటమాలి' మొదలైన వారు 'యజమాను'ల గురించి చెప్పే కథలలోని యదార్థం కుతూహల జనకంగానే వుంటుంది. కీలర్‌కు 'బట్లర్' ఐన జాన్ హొగాన్ చెప్పే యీ కథలోని రెండవభాగం పాఠకులు పైవారం చదువుతారు.

* * *


పైవారం ఆంధ్రసచిత్ర వార పత్రిక దీపావళి ప్రత్యేకసంచికగా వెలువడుతుంది. ఎప్పటిలాగే యీ సంచికలో ముఖ్యమైన ఆకర్షణ మేము నిర్వహించిన కథలపోటీలో బహుమతిపొందిన కథలు. అవిగాక మరొక కొత్తరకం పోటీ ఒకటి 'సరాగమాల' శీర్షిక క్రింద పాఠకులు ఆ సంచికలో చూస్తారు. మరి కొన్ని ఆ సంచికలోని విశేషాలు యీ వారం 55 వ పేజీలోని ప్రకటనలో చూడొచ్చును. ★

లోకంపోకడ



"మనలో మనమాట. నిజంగా నన్నడిగితే ఎస్. కే. పాటిల్‌గారు అన్నీ పరమ సత్యాలే చెబుతాడు సుమా?" ★

విషయానుక్రమణిక


కేంద్రమంత్రి వర్గం
ఆంధ్ర రాజకీయాలు
సంజీవయ్యగారు
వామపక్షాల ఐక్యపక్షం
గాలి మేడలు
వెళ్లవయ్యా కాస్త గొడవచెయ్యి
కాశ్మీర్ యుద్ధ విరమణ రేఖ
సి.పి.ఐ!
తీర్మానాలు
డాంగే
లోటులను కప్పెద్దామని

భారత్—చైనా సరిహద్దు వివాదం విషయం తీసుకుంటే మళ్లీ న్యూఢిల్లీలో దేశవిభజనకు పూర్వపు వాతావరణం అలుముకుందనే చెప్పాలి. దేశ విభజనకు ముందో తమాషా జరిగింది. అప్పుడు కాంగ్రెస్‌పార్టీ భారతదేశంలో ముస్లింలీగ్ ఏకాకి అనీ, దాన్ని ఆదరించేవారే లేరనీ, ముస్లింలు అధిక సంఖ్యగా గల జమైత్—ఉల్—ఉల్లామా—ఇ—హింద్, ఆహ—ఇ—హిర్‌హార్, షియా, ఎర్ర చొక్కాలు వగైరా వగైరా పార్టీ లన్నిటికీ కూడా ముస్లింలీగ్ అన్నా, అది వాదించే దేశ విభజన అన్నా గిట్టదనీ ప్రచారం చేసేది. కాని, ఎన్నికలలో, ఉపఎన్నికలలోనూ విజయంపొందింది ముస్లింలీగే! సరిహద్దు రాష్ట్రాలలో పరిమిత జనవాక్యసేకరణ జరిగినప్పుడు రెడ్‌షర్ట్ (ఎర్ర చొక్కాల) పార్టీ తటస్థంగా ఉండిపోయింది!

అలాగే భారత చైనా వివాదాన్ని గూర్చి మన ప్రధానమంత్రి ప్రపంచంలో చైనా ఏకాకిగా ఉండిపోయిందనీ, అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు, సింహళ ప్రధానమంత్రిణి చేసిన సంయుక్త ప్రకటనమీద చైనా పెద్ద గందరగోళం లేవదీస్తోందని అంటున్నారు. 'చైనా కౌటిల్యాన్ని' బయటపెడ్తూ విజయలక్ష్మి పండిట్ ఐక్యరాజ్యసమితిలో తీవ్ర పోరాటం సాగిస్తున్నారట!

ఈ తతంగం అంతా వింటూఉంటే ఓ కథ జ్ఞాపకం వస్తోంది. నిన్ను ఫలానివాడు తిడుతున్నాడని రాజ్యాలు రావడంలేదని కెయిరో వార్త తెలుపుతున్నది. వాస్తవం ఏమిటంటే మలేసియా విషయంలో ఇండొనీసియా చైనాకు సన్నిహిత మౌతున్నది. ఇంక ఘనా ఎప్పుడూ భారతదేశం పట్ల అంత సుహృద్భావంతో లేదు. అందాకా ఎందుకు! అరబ్ సమాఖ్య అధ్యక్షుడు కూడా భారత్—చైనాల ముఖాముఖి చర్చలపట్ల వ్యతిరేకాన్ని తెల్పనేలేదు.

ఇంతకీ ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే ఎవరి మేలుకోసం, మన దేశంలో 'చైనా ఏకాకై పోతోందో' అని గోలగా ప్రచారం సాగుతున్నదనేది! విదేశీయులకోసమా అంటే, వాళ్ల కింతకన్న మంచి ప్రచారసాధనాలు, విధానాలూ ఉన్నాయి. భారత ప్రజల కోసమే అయితే ఇది ఎందుకో అర్థంకాని విషయం. ఎందుకంటే ప్రజలకు ప్రభుత్వం వూహించినదానికన్న ఎక్కువ తెలివితేటలే ఉన్నాయి. ఒకవేళ చైనా ఏకాకైనా మనకేవిటిటా నష్టం? శ్రీ చౌ ఎన్ లై తాజా ప్రకటనం చూస్తే ప్రజాభిప్రాయం అనే దానికి చైనా ఎంత విలువనిస్తోందో ఇట్టే తెలిసిపోతోంది. అసలు లెక్కకొచ్చేదల్లా దేశానికి నిజంగా ఎంత బలం ఉందీ అనే! ఆగ్నేయాసియా విషయంతో తన బలమేమిటో చైనాకు బాగానే తెలును.

మావ్—సేట్సుంగ్ ఒకప్పుడు ఇలా అన్నాడు: "పరిపూర్ణ దాస్యవిముక్తికోసం జరిగే పోరాటంలో ఉంటూ వచ్చారు. అందువల్ల వచ్చేవారంలో ఎప్పుడో ఒకప్పుడు ఆయన వెలువరించే తీర్పుమీద అప్పీలుండే వీలులేదు. మన ప్రధాని శ్రీ నెహ్రూ కేవలం ప్రధానమంత్రి మాత్రమే కాదు. బారెట్లా (న్యాయవాది) కూడా. అందువల్ల కైరాన్ వ్యవహారంలో అంత్య నిర్ణయాధికారం తమపైన వున్నప్పుడు, శ్రీ కైరాన్ జన్మదినోత్సవంలాంటి వాటిలో ఆయన (కైరాన్) సామర్థ్యాన్నిగూర్చి ప్రశంసలు ఇవ్వకుండా ఉండాల్సింది. అంటే పండిత నెహ్రూ వ్యాజ్యం పరిశీలించకముందే తీర్పు ఇచ్చేశారన్నమాట.

సర్దార్ ప్రతాప్‌సింగ్ కైరాన్ గ్రామీణ ప్రాంతంనుంచి వచ్చినందువల్ల ఇప్పటి ఈ తగాదా, గ్రామీణ పట్టణ తగాదాగా భావించవచ్చని ప్రధాని చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే శ్రీ కైరాన్ ప్రత్యర్థుల నియోజకవర్గాలలో ఎన్ని పట్నప్రాంతా లున్నాయో తెలియదుగాని, ముఖ్య ప్రత్యర్థి దర్బార్‌సింగ్ నియోజకవర్గం పట్టణ ప్రాంతం కాదనేది మాత్రం ఖాయం. మరి సుప్రీంకోర్టు ఏ నియోజకవర్గం నుంచి వచ్చిందిటా!

* * *

తనలో పక్షపాతం ఉందన్న ఆరోపణను ఖండిస్తూ ప్రధాని తమ బంధువు శ్రీ ఆర్. కె. నెహ్రూ, తాము పదవిలోకి రాకముందు నుంచి ఇండియన్ సివిల్ సర్వీస్‌లో ఉంటున్నారని అన్నారు.

పని లేకుండా పర్యటించే మంత్రివర్యులు!

శ్రీ కృష్ణ

ఎవరో ఒకాయన నెపోలియన్‌కు చెప్తే అప్పుడాయన 'నా సొంత విషయం' అని జవాబు చెప్పాడు. ఆ రెండో పెద్దమనిషి అంతటితో ఆగక 'అయ్యా! వాడు మిమ్మల్ని మహా గట్టిగా తిడుతున్నాడండీ' అంటూ పోరటం మొదలెట్టాడు. అప్పుడూ నెపోలియన్ సమాధానం 'అది నే చూసుకోవాల్సిన విషయం' అనే! అలాగే చైనా ఏకాకి ఐపోతే అది చైనా ఆలోచించుకోవాల్సిన విషయం. ఒకవేళ అలా ఏకాకైనా, ఆ కావటం, భారత దేశాంగ విధానంవల్లా, భారతదేశానికి మిత్రదేశాలు చూపిన సానుభూతివల్లా మాత్రం కాదు. రష్యా—చైనాల వివాదం సిద్ధాంత సంబంధమైంది. మన కాంగ్రెస్ ఆశయాలు, నెహ్రూ విధానాలు దాన్ని ముట్టుకునేందుకు కూడా వీల్లేదు. భారతదేశాన్ని చైనా, పాశ్చాత్యుల కౌగిళ్లలో పడేసిందని ప్రపంచం చైనాను దుయ్యబట్టటం కేవలం యాదృచ్ఛికంగా జరిగిన విషయం.

ఇదిలా ఉంచుదాం. శ్రీ నెహ్రూ అనుసరించే అతి ముఖ్య విధానం ఎంతమందిని భారతదేశానికి మిత్రుల్ని చేయగల్గిందిటా? ఆపత్తులో ఆదుకోవటాన్నిబట్టే మైత్రిని నిర్ణయించటం జరుగుతుంది. మరి చైనా ఈ దేశంమీద ఉవ్వెత్తుగా దండయాత్ర సాగిస్తే ఏ 'మిత్రుడు' ఆదుకోటాని కొచ్చాడో తెలుసా, తెల్ల కామన్వెల్తు రాజ్యాలు, అమెరికా మాత్రమే!

గౌరవనీయులైన మన—అంటే భారత ప్రధాని ఎలాగైతేనేం చివరికి 'కొలంబో రాజ్యాల' లో తమ విశ్వాసాన్ని కుదుర్చుకున్నారు. అయితే మొత్తం మీద ఈ రాజ్యకూటమిలోకి ఘనా, ఇండొనీసియా బాధితప్రజ లెప్పుడూ మొదట స్వశక్తిమీదనే ఆధారపడతారు. ఆ తర్వాతనే అంతర్జాతీయ సహాయంమీద ఆధారపడటం."

ఇలాంటి ప్రచారం భారతదేశానికి తీరని నష్టం కలుగజేస్తుంది. అసలు నాగరికత అంటూ తెలిసిన తర్వాత ప్రప్రథమంగా మనదేశంలో ఉవ్వెత్తుగా రేగిన ప్రజాచైతన్యమును ప్రభుత్వం చేతులారా పాడుచేసుకుంది. రెండునెలలు దాటేసరికల్లా ప్రజలంతా భారతదేశం స్వతంత్రంగా బతికి బట్టకట్టుకునేందుకు తాము పైబట్టతో సహా త్యాగం చేస్తుంటే ఉపమంత్రులు, పార్లమెంటరీ కార్యదర్శులు, తదితరులు దేశం ధనంతో సకుటుంబంగా యాత్రలు సాగిస్తూ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వగైరా వగైరాలలో పాల్గొని స్వప్రచారం చేసుకొంటూ డబ్బు దుబారా చేస్తున్నారని అనుకుంటున్నారు. 'చైనా ఏకాకి' ప్రచారం మనదేశ ప్రజకు చైనా దురాక్రమణ ప్రమాదాన్ని మరపు కలుగజేస్తున్నది. భారతీయు లందరికీ ఈ వూహాత్మక శక్తిలో నమ్మకం కల్గిస్తున్నది. అందుక్కారణం చైనా సైనికంగా బలహీనం కావటం కాదు. అది ఏకాకిగా ఉండిపోవటంట! అసలు అత్యధికుల్ని మూర్ఖుల్ని చేయగలవాళ్ల సంఖ్య చాలా తక్కువగానే ఉంటున్నది చరిత్రలో మొదటినుంచీ కూడా.

* * *

సర్దార్ ప్రతాప్‌సింగ్ కైరాన్ విషయం ఇంకా నలుగుతూనే ఉంది. కాంగ్రెస్‌లోపల బైటా కూడా మన ప్రధానమంత్రే పంజాబ్ ముఖ్యమంత్రికీ, ఆయన ప్రత్యర్థులకు మధ్యవర్తిగా తీర్పరిగా నిజమే. ఇప్పుడు పదవీ విరమణ చేస్తున్న కమ్యూనికేషన్ల శాఖ కార్యదర్శి శ్రీ ఎం. ఎం. ఫిలిప్ కూడా చాలాకాలం క్రిందట వచ్చినవాడే. అలాగే మూడేళ్ల క్రిందట చడీ చప్పుడూ లేకుండా పదవీ విరమణ చేసిన (ఒకప్పటి) రవాణాశాఖ కార్యదర్శి శ్రీ నీలకంఠ మహాదేవ అయ్యరు, ఈ ఏడాది మొదట్లో పదవి విరమించిన ఆరోగ్యశాఖ కార్యదర్శి శ్రీ టాండన్ కూడా చాలాకాలంనుంచి ఇండియన్ సివిల్ సర్వీస్‌లో ఉన్నవాళ్ళే.

మరిందుకు భిన్నంగా శ్రీ ఆర్. కె. నెహ్రూను వాషింగ్టన్‌లో ఛార్జి—డి—ఎఫైర్స్‌గాను, స్వీడన్ తరువాత చైనాలో రాయబారిగాను నియమించటం జరిగింది. ఆయనకు మూడుసార్లు పదవీకాలాన్ని పొడిగించడం జరిగింది. ఆఖరికి ఆయన న్యూఢిల్లీలో ఒక పెద్ద ఇల్లు (ప్రజల ధనంతో) ఏర్పరచుకోటంలో ప్రధానమంత్రికి ప్రత్యక్ష జోక్యం ఉంది. ఇది ఇంతటితో ఆగిపోలేదు. ఈ మూడవ పొడిగింపు కాలం అయింతర్వాత కామన్వెల్తు ఆర్థిక సంఘం చైర్మన్ పదవికి ఆయన్ను ప్రధానమంత్రి ఎన్నికచేశారు. మరి ఇది ఆశ్రిత పక్షపాతం కాకపోతే 'పక్షపాతం' అనే మాటకు నిఘంటువులో అర్థం మారిందనో, మనుషులకు హేతుదృష్టి లోపించిందనో అనుకోవాల్సి వస్తుంది.

* * *

"నెహ్రూ ప్రభుత్వంలో చేరి దేశాలన్నీ చూడండి!" అనేది విలాసయాత్రలు నిషా

దంగా చేస్తే ఎంతో బాగుండేట్లుంది! మన ఉపమంత్రులు సకుటుంబంగా ఎలా ప్రయాణాలు చేస్తున్నారో ఇదివరకు చాలాసార్లు చెప్పుకున్నాం. ఇదివరకు దూరప్రాచ్యంలో పర్యటించిన విదేశాంగశాఖ ఉపమంత్రి శ్రీ దినేష్‌సింగ్ ఇప్పుడు ఆఫ్రికాలో పర్యటిస్తున్నారు. ఆరోగ్యమంత్రి సుశీలానయ్యర్ ఇటీవలనే ఇండొనీషియాలో పర్యటించి అధ్యక్షుడు సుకర్నోతో చర్చలు జరిపి మన ప్రధానమంత్రి కొక ప్రత్యేక సందేశం

న్యూఢిల్లీ లేఖ

తీసుకు వచ్చారు. మన ప్రభుత్వం గుర్తించిన మలయాసియామీద చైనా మద్దతుతో కత్తి దూస్తోంది. మరి ఈ సుకర్నోయే మరి మలేసియా అంటే కస్సుమంటున్నారు! డా. సుశీలా నయ్యర్ ఇప్పుడు రష్యా వెళ్ళబోతున్నారు. ఆర్థిక శాఖలో ఉన్న ఉపమంత్రిణి శ్రీమతి తారకేశ్వరీ సిన్హా ఈమధ్యనే జపాన్ వెళ్ళివచ్చారు. ఇప్పుడు త్వరలో విదేశపర్యటనకు పథకాలు వేసుకొంటున్నారు. శ్రీమతి సిన్హా బెర్లిన్ ప్రదర్శనోత్సవాల్లో పాల్గొంటారని పత్రికలన్నీ యీమధ్య ప్రకటించాయి. ఆర్థికశాఖ ఉపమంత్రిణికీ, వాణిజ్య పరిశ్రమల శాఖ ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనానికి గల సంబంధం ఏమిటోఇంకా సరిగా తెలియటంలేదు. ఆమె బెర్లిన్‌లో ఉన్నప్పుడు తూర్పు జర్మనీప్రభుత్వం తప్పక ఆహ్వానిస్తుందనికూడా అనుకుంటున్నారు!! ★

సరాగమాల

వి ఎ కె రంగారావు

రెండు వారాల క్రిందట చెన్నపురి ఆంధ్ర మహాసభవారు "శ్రీనివాస కల్యాణం" నాటకం అన్నామలై మన్రంలో వేశారు. ఇందులో ప్రముఖ నటకులు, పాటకులు పాల్గొన్నారు. అందరిలో ఆనాటి ప్రేక్షకులను ఆనందపరచినది నారద పాత్రధారిణియైన శ్రీమతి కమలా చంద్రబాబు. "ముగ్గురు మరాఠీలు"లో "ఫిలోజి నా చిన్న బావ", "పాతాళభైరవి"లో "ఇతిహాసం విన్నారా" "మల్లీశ్వరి"లో "జాం జాం" పాటలు పాడి రసిక మనోరంజనం గావించినపుడు ఆమె కంఠం ఎంత మనోహరంగా ఉండేదో ఈనాడూ అలానే ఉంది. ఆ కంఠంలో ఇంకా ఆ మాధుర్యం తొణికిసలాడుతూనే ఉంది. నేటికీ ఆ కంఠంలో సంగీత దేవత నిత్య పూజలందుకుంటూనే ఉంది. కాని సినిమా సంగీత దర్శకులు ఈ కంఠాన్ని పెడచెవినెందుకు పెడుతున్నారో అర్థంకాదు. ఇటీవల నాగయ్యగారు "రామదాసు"లో కమలాదేవిచే రెండు పాటలు పాడించారు. కాని ఆ పాటలు ఎప్పుడు రికార్డులుగా విడుదలవుతవో, ఎప్పుడు రామదాసు స్టుడియో బందిఖానానుంచి విడుదలవుతాడో ఆ శ్రీరామచంద్రునికే తెలియాలి.

ఆ నాటకంలో నారదునిగా కమలాదేవి ఎన్నో రకాల పాటలు పాడేరు. వాటిలో అత్యంత మృదు మధురంగా ఉన్నవి రాగమాలికగా పాడిన అష్టపది 'జయ జయ దేవ హరే', 'శ్రిత కమలాకుచమండలా' తరంగం. "నీరజ దళనయన", "శ్యామసుందర" భజనలు, "మంగళాలయ" మహా మధుర తరంగం "కరుణాలోల" "భక్త అంబరీష" లోని భజన గీతం. ఈ పాటలన్నీ విని సమ్మోహితులైన ప్రేక్షకులు సారె సారెకు చప్పట్ల వర్షం కురిపించారు. ఇంత చక్కని పాటకు, అందులో నారద పాత్రధారికి, కొంత, ఒకింత నృత్యం తోడైతే ఇంకా ఎంతో రాణింపుకు వచ్చేది. ఈ నారద పాత్ర మధ్యలో ఒక గంటసేపు రంగస్థలంపై కనపడక పోవటం, అంతసేపు విసుగెత్తించినదనే చెప్పాలి. శ్రీ ఎ. చంద్రబాబు ఆధ్వర్యాన ఇటువంటి లోపం జరగటానికి కారణం దురూహ్యం.

* * *

మద్రాసులో వున్నవారికి దేశ దేశాల సంగీత, నృత్య, విన్యాసాలు చూడటానికి అవకాశాలు కలుగుతుంటాయి. ఈ కోవకు చెందిన అవకాశమే ఇటీవలి డ్యూక్ ఎల్లింగ్టన్ ఆర్కెస్ట్రా మద్రాసులో రెండు రాత్రులు కచ్చేరీలు చేయగా కలిగింది. డ్యూక్ ఎల్లింగ్టన్ అమెరికాలో, యూరప్ దేశంలో పేరు పొందిన జాజ్ కళాకారుడు. అతని వాద్య బృందానికి విశేష పేరు ప్రఖ్యాతులు ఉన్నవి. అస్వస్థత వలన డ్యూక్ మొన్నటి కచేరీకి రాలేక పోయినా, అతని లేమి వలన కలిగిన లోపాన్ని అతని అనుచరులు బాగా భర్తీ చేశారు.

జాజ్ సంగీతం గురించి ఒక నిర్వచనమంటూ అందరూ ఒప్పుకొనేదిలేదు. స్థూలంగా చెప్పుకోవాలంటే జాజ్ సంగీతంలో అమెరికన్ నీగ్రోల ప్రభావం, ఆఫ్రికన్ ఆటవిక జాతుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. సూక్ష్మంగా నిర్వచించటం ఈ పేజీలో సాధ్యంకాదు. ఈ విషయంపై "వాట్ ఈజ్ జాజ్" అనే పద్ధతిలో ఎన్నో పుస్తకాలు వ్రాయబడి ఉన్నవి. అవి చదివితే కొంతలో కొంత బోధ పడుతుంది.

ఇక మొన్నటి కచేరీల గురించి వాద్య బృందంలో మొత్తం పదహారుగురు ఉన్నారు. పియానో, డ్రమ్స్, డబుల్‌బాస్ ఒక్కొక్కటి. సాక్సోఫోనులు ఆల్టోలు మొదలైన జాజ్ వాద్య విశేషాలు మిగిలినవి.



రిపబ్లిక్ ప్రొడక్షన్సువారి "బొబ్బిలియుద్ధం"లో ఒక దృశ్యం.

మొదటిరోజు విశేషంగా ప్రజల మన్ననలందుకున్నవి "సెల్ఫ్రిలీఫ్", "పెర్డిడో", "స్విప్‌డివ్". రెండవ రోజు "టీ ఫర్ టు" "టూటీ ఫర్ క్యూటీ" సెభాసనిపించుకున్నవి. ఈ వాద్య గోష్ఠిలో ముఖ్యంగా అందరినీ ఆకర్షించినది, పాల్గొన్న ప్రతి ఒక్కరు అతి చనువుగా, సరదాగా వారి వారి వాద్యాలను వాయించటం, ప్రేక్షకులతో కబుర్లాడ్డం. దీని వలన సాధారణంగా ఇటువంటి సంగీతాన్ని మెచ్చుకోని వారు కూడ ఆనాటి గోష్ఠిని ఆనందించారు

* * *

క్రిందటి ఎనిమిదవ తేదీన శ్రీ సి. ఎస్సార్ ఆంజనేయులు మరణం సినీరంగాన్ని దుఃఖసాగరంలో ముంచి వేసినది

నా చిన్నతనంలో సినిమాలలో వీరు హాస్య పాత్రలు ధరిస్తుండేవారు అప్పట్లో నా నోటికి వచ్చే పాటలు వీరు "గృహ ప్రవేశం"లో హేమలతమ్మరావు చుట్టూ తిరుగుతూ పాడిన "టటటా జానకి నాదేనోయ్" ఒకటి, "రత్నమాల"లో తన మరదలను కొంటూ వేరే అమ్మాయి వెంటబడి పాడిన "ఆగవే మరదలా" ఈ రెండు పాటలంటే అప్పట్లో వేలమంది ప్రజలతోబాటు నాకు విపరీతమైన సరదా!

వీరి వేషాల్లో నాకు అత్యభిమాన పాత్రమయినది. "అంతేకావాలి"లో నాటకాల శివకామయ్య. అటువంటి జీవితమే తమ నిజ జీవితం కూడా అవటంవలన కాబోలు ఎంతో సహజత్వం కనిపించింది ఈ పాత్రధారణలో. ఇందులో తన సినిమా కూతురు జి. వరలక్ష్మికి సంగీతం నేర్పే దృశ్యం నా కింకా గుర్తు ఉంది. ఫక్తు హిందూస్తానీ సర్ధతిని ఆయన పాడటం వెనుక వరలక్ష్మి అందుకొనటం. ఇటీవలి "ఇరుగు పొరుగు" లో కూడ వారికి చక్కని పాత్ర లభించింది. అత్యద్భుతంగా అందులో నటించారు. నిజానికి ఆయన నటన ఆ చిత్రానికి మణిమకుటం.

60 ఏళ్ల దగ్గర పడినా క్రింద టేడు మద్రాసులో కురుక్షేత్రంలో కృష్ణుని పాత్ర ధరించారు. వృద్ధాప్యం ముఖంలో కనబడినా, పద్యాలు చదవడంలో మాత్రం నిత్యయౌవనమే గోచరించింది. ముఖ్యంగా పున్నాగవరాళిలో చదివి దుర్యోధనునో కర్ణునో మభ్యపెట్టిన వేళ. ఇటువంటి మహా కళాకారుని ఆత్మకు శాంతి కల్గుగాక.

49 వ పేజీ చూడండి

ముసురు పట్టినా కార్యక్రమాల జోరు!

ఈ ఏడు మామూలుగా వచ్చిపడే సెప్టెంబరు వర్షాలు ఎక్కువ బాధపెట్టలేదుగాని, అక్టోబరులో బాగానే పట్టింది ముసురు. ఒకటే వానలు, అడపా తడపా కురవటం కాదు. జోరున ధారే. అయితేనేం రాజధానిలో కార్యక్రమాల జోరు కూడా బాగానేవుంది. రవీంద్ర భారతిలో నృత్య ప్రదర్శనాలు, నాటకాలు నిరాఘాటంగా సాగిపోతూనే ఉన్నాయి. పెద్ద నాయకులు కొత్తఢిల్లీ నుంచి వచ్చారు. పాత తగాదాల్నే చర్చించుకుంటున్నారు. లాల్‌బహదూర్‌శాస్త్రిగారికి కేంద్రమంత్రి పదవి లేకపోయినా, ఆయనకున్న పలుకుబడి దృష్ట్యా ఆయన్ను చూస్తే అందరికీ గౌరవమే. అందరికీ హడలే. వారు నగరానికి వచ్చినప్పుడు ఈ విషయం ప్రస్ఫుటంగా తేటతెల్లమయింది వచ్చిన కాసేపటికే, ఎన్నో సలహాలు, ఎన్నో విషయాలు చెప్పారు. కేవలం కాంగ్రెసుపార్టీని గురించి చెప్పినప్పటికీ, పరిపాలనా సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకోమని ఇచ్చిన సలహా ప్రజలందరికీ సంబంధించిందే అవుతుంది. కాంగ్రెసు అధ్యక్షులవారు కూడా విచ్చేశారు. రెండు నెలల లోపున వారు ఈ పదవీ విరమణ చెయ్యబోతున్నారు కాబట్టి వచ్చినా కూడా ఏమీ వ్యాఖ్యానించటానికి ముందంజ వేయలేదు. ఆయన్ను పూర్తిగా నమ్ముకునివున్న కాంగ్రెస్ పెద్దలకు ఆయన రాక ఎంత ఉత్సాహాన్ని ఇచ్చిందో చెప్పటం కష్టం.

మనకు సాంప్రదాయ ప్రకారం పాత కాంగ్రెసు వారిని పొగడటం వారు చేసిన అపార త్యాగాన్ని శ్లాఘించటం, తర్వాత ఎవరిదోవ వారిదే లాగున ప్రవర్తించుకోవటం అలవాటు అయింది. ఈ పద్ధతి ప్రకారం స్వామి రామానందతీర్థ షష్టిపూర్తి ఉత్సవాలు వైభవంగా జరిపారు. నలుగురు కాంగ్రెసు పెద్దలు ఆయన్ను సముచితంగానే గౌరవించారు మాటలతో. నిజానికి ఆనాటి రోజుల్లో స్వామిజీ ప్రముఖపాత్ర వహించారనటంతో సందేహం లేదు. ఇతర ప్రాంతాలవారికి, హైదరాబాదు పేరు వినంగానే స్వామిజీ దృష్టిలోకి వచ్చేవారు. కనీసం ఇలాంటి సందర్భంలోనైనా పూర్వ వైభవాన్ని స్మృతిలోకి తెచ్చుకుంటున్నప్పుడైనా, అందరం ఐకమత్యం ప్రదర్శించాలనే ఆవేశంగాని, ఆవేదనగాని, పెద్దలనుకునే వాళ్లకు రాకపోవటం శోచనీయమే!

ఎవరికి వారే, మళ్లీ అంతా ఒకటే!

అన్నట్లు దేశమంతా జాతీయ సమైక్యతా దినోత్సవాలు జరుపుకునే సందర్భంలో అక్టోబరు 20వ తేదీనాడు ఇలాంటి ఉత్సవం గాంధీభవన్‌లో ఒకటి చాలా బాగా జరిగింది. ఆనాడు అందరూ కూడా ప్రతిజ్ఞ తీసుకోవాలి. క్రిందటి ఏడాది సరిగ్గా ఈ రోజున కమ్యూనిస్టు చైనా మన భారత భూభాగంమీద అక్రమంగా దురాక్రమణ జరిపింది. దీన్ని దేశ ప్రజ సహించలేక ఒక్కటయి శత్రువును తరిమికొట్టాలనే కృత నిశ్చయానికి వచ్చింది. అత్యవసర పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వంవారు ప్రకటించారు. ఆ పరిస్థితి ఈనాటివరకు కొనసాగుతూనే ఉంది. అయితే ఇలాంటి దృఢ సంకల్పం చెదిరి పోకుండా, మళ్లీ దేశ ప్రజను జ్ఞాపకం చేయటానికి ఎవరికి వారు విద్యుక్త ధర్మాన్ని గుర్తించేటట్టు చెయ్యటానికి ఈ అక్టోబరు 20వ తేదీని జాతీయ సమైక్యతా దినంగా పరిగణించాలని నిశ్చయించారు. 'ఈ యుద్ధం ఎన్నాళ్ళు కొనసాగినా, ఎలాంటి త్యాగాలు చెయ్యాలసి వచ్చినా, మన దేశ స్వాతంత్ర్యాన్ని, సమైక్యతా భావాన్ని రక్షించటానికి కృత నిశ్చయుడనై ఉన్నానని పునరుద్ఘాటిస్తున్నా. ఈ దృష్టితో దీక్షగా అహర్నిశలు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నా' అని ప్రతిభారతీయుడు ఈ ప్రతిజ్ఞ తీసుకోవాలి. తీసుకున్నాడు కూడా. అయితే ఇక ఆచరణలో పెట్టటంలో ఆలస్యం చేయకూడదు. ఈ విషయాన్నే హైదరాబాదు మేయరుగారు ఈ సందర్భంలో గుర్తుకు తెచ్చారు.

నిజంగా ఈ ఉత్సవం ఐక్యతా భావాన్ని స్ఫురించేది లాగానే జరిగింది. జాతి, మత, కుల, భాషా విభేదాలు విస్మరించి అందరూ ఒకటే ధ్యేయానికి కంకణం కట్టుకున్నట్టు తేట తెల్లమయింది. శ్రీ అక్బర్ అలీఖాన్ పార్లమెంటు సభ్యులు ఉర్దూలో అనర్గళంగా ఉపన్యసించారు. శ్రీ బనారసీలాల్ గుప్త గారు (హైదరాబాదు మేయరు) ఇంగ్లీషులో ఉద్ఘాటించారు. డాక్టరు దివాకర్ల వెంకటావధానిగారు ఈ సందర్భంలో మహిళల పాత్రను గురించి విపులీకరించారు. ప్రతిజ్ఞను మాత్రం అందరికీ ఉపయుక్తమైన ఇంగ్లీషు భాషలో అందరిచేత చేయించారు. ఇక మహిళా కళాశాల విద్యార్థినులు బృంద గానాలు, నృత్య ప్రదర్శనాలు జరిపారు. ఇవన్నీ బాగానే ఉన్నాయి. అయితే మన కాంగ్రెసు పెద్దల ధోరణిమాత్రం అప్పుడప్పుడు వింతగానే కనిపిస్తుంది. కేంద్ర మంత్రివర్గంలో జగజీవన్ రామ్ తొలగిపోయాడు కాబట్టి సంజీవయ్యగారికి స్థానం లభిస్తుందని రాష్ట్ర మంత్రివర్గంలో ప్రత్యర్థులనబడే కాంగ్రెసువారికి కూడా తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని కేంద్ర మంత్రివర్గంలో దక్షిణాదివారికి కూడా సముచితమైన స్థానం ఇవ్వాలని గుస గుసలు వినిపిస్తున్నాయి. ఆలోచనలు వేరు వేరుగానే కనిపిస్తున్నాయి. ఏమైనప్పటికి మనమందరం ప్రతిజ్ఞ తీసుకోవటమేకాకుండా ఆచరణలో ఎవరికి వారు అమలు జరుపుతూ ఉంటే మనం ఇంకొకరిని అనాలనే బాధ, బాధ్యత తప్పిపోతుంది.

వింతలో వింత

అసలు వన్య మృగాల్ని మనం అదుపులోకి తెచ్చామనుకోవటమే ఓ భ్రమ. కట్టి, కొట్టి బోనులో పెడితే, వేరే గత్యంతరంలేక అట్లాగే పడి ఉంటాయి. ఎప్పటికప్పుడు కటకటాల్లోంచి దూరి పారిపోవాలనే ప్రయత్నిస్తూ ఉంటాయి. ఇలాంటి సంఘటనే ఇక్కడొకటి జరిగింది. మీరాలం వద్ద కొత్తగా ఏర్పరచిన 'జూ' లోంచి ఏడు నెలల చిరుతపులి పిల్ల తప్పించుకుని పారిపోయింది. పైగా దాన్ని బోనులోనే ఉంచి తాళం గట్టిగా వేశామని అధికారులు చెపుతున్నారు. మరి ఎట్లా పారిపోయిందంటే సమాధానంలేదు. ఇక ఊహాగానాలు బహుశా ఏ అడవిలోకో వెళ్లిపోయి ఉంటుందని అనుకుంటున్నారు. మరి అడవికి వెళ్లక ఇళ్లలోకి వస్తుందా! వెదకటం మాత్రం తప్పలేదు. అది మాత్రం కనిపించలేదు. స్థానిక పేపర్లో ఒక ప్రకటన కూడా వచ్చింది. ఇట్లా చిరుత పులిపిల్ల తప్పించుకుని పారిపోయింది ఎవరికైనా కనిపిస్తే వెంటనే అధికారులకు తెలియపరచాలని, ఎవరో పిల్లాడు తప్పిపోతే అతని జాడ తెలియ పరచిన వారికి బహుమానం ఇస్తామన్నట్టు. ఇంతవరకు ఇలాంటి సాహసం ఎవరూ చేసినట్టు కనిపించలేదు. ఎవరైనా బయలు దేరుతారేమో చూడాలి! అయినా చిన్నపిల్లే కాబట్టి అట్టే ప్రమాదం ఉండదని అనుకుని ఉండచ్చు. అయితే ఈ విధంగా పెద్దవే తప్పించుకోవటం మొదలుపెడితే కష్టం.

—ఐ. ఎల్. ఎన్.

డా॥ గాలి బాలసుందరరావు

మనమూ-మనదేహస్థితి

స్వచ్ఛంద నరాశయము

(Autonomous Nervuous System)


శరీరంలో కండరములు ఇచ్ఛాధీనములు, అనిచ్ఛాధీనములు అని రెండురకములుగదా! జీర్ణకోశంలో ఉంటే కండరములన్నీ అనిచ్ఛాధీనములే.

సింపతెటిక్, పేరా సింపతెటిక్ అని స్వచ్ఛంద నరములు రెండు రకములు. ఇందులో పేరా సింపతెటిక్ భాగం కంటె సింపతెటిక్ భాగం పెద్దది. చాలా అవయవాలకు అది పోతుంది. దానికి సంబంధించిన నరములు చర్మంలో ఉన్న స్వేద గ్రంథులన్నింటికి పోతవి. ఒళ్ళు గగుర్పొడిచి నప్పుడు వెంట్రుకలు లేచి నిలబడితవి. కేశ మూలములలో ఉండే అనిచ్ఛాధీన కండరముల సంకోచంవల్ల ఈ పని జరుగుతున్నది. ఈ కండర ముల సంకోచ వ్యాకోచములు సింపతెటిక్ శాఖల వల్ల జరుగుతవి.

శరీరంలో రక్తనాళములలో వర్తులాకారం గల (రింగువంటి) కండరములు ఉన్నవి. వాటి సంకోచంవల్ల ఆర్టెరీలు చిన్నవై వాటిలోపల ఉండే ఖాళీ ప్రదేశపు ఘనపరిమాణము తగ్గిపోతుంది. అప్పుడు నెత్తురుపోటు పెరుగుతుంది. అవి వ్యాకోచిస్తే ఆ ఘనపరిమాణం పెరిగి నెత్తురుపోటు తగ్గుతుంది. రక్తంలో ఉండే నీరుగానీ, ప్లాస్మాగానీ అధికంగా బయటికి పోయినా నెత్తురుపోటు తగ్గుతుంది. సింపతెటిక్ శాఖలు హృదయ కండరములకు, రక్తనాళములలో ఉండే కండరములకు, ఊపిరితిత్తులకు, వక్ష, ఉదరముల అంతరాళంలో ఉండే అన్ని అంగములకు పోతవి. శరీరాంతరాళములలో ఉండే అంగమును విస్కస్, (Viscus) అంటారు ఇది ఏకవచనము. 'విసరా' బహువచనము. వీటికే స్ప్లాంక్నా (Splanchna) అని పేరున్నది. ఇందువల్ల, వీటికి పోయే నరములకు "స్ప్లాంక్నిక్ నరములు" అని పేరు.

మెదడులో రెండు పాదగోళములు ఉన్నవి. ఆ రెంటినీ కలిపే వంతెన వంటి నిర్మితి ఉన్నది. దానిక్రింద వుండే పాన్సు, సెరిబెల్లము, తేలమస్ అనే భాగములను, మెదడు మధ్య భాగము అంటారు క్రింద మెడుల్లా ఆబ్లాంగేటా అనే భాగమున్నది. అది మెదడు మూడవ భాగము. ఈ భాగమే వెన్నుపాముగా క్రిందికి వస్తుంది. పాదగోళములు, మధ్య మెదడు, మెడుల్లా, వెన్నుపాము కలిపి కేంద్ర నరాశయము అంటారు. నరాశయంలో ప్రధాన పదార్థములు మూడు: (1) నైరికజీవాణువులు. వీటిని న్యూరానులు అంటారు. (2) న్యూరానులనుండి సాగిపోయేతంతువుల వంటి నిర్మితులు. వీటినిఏగ్జానులు

47 వ పేజీ చూడండి



సింపతెటిక్ పేరా సింపతెటిక్ నర విస్తరణము.>

1. నల్లగుడ్డు, 2. బాష్పగ్రంధి, 3. నాసికకు అంగిలికీ సంబంధించిన మ్యూకస్ మెంబ్రేను, 4, 5. నోటిలో ఉండే లాలాజల గ్రంధులు, 6. నోటిలో ఉండే మ్యూకస్ మెంబ్రేను, 7. గవదలో ఉండే పెరాటెడ్ లాలాజల గ్రంధి, 8. హృదయము, 9. శ్వాసనాళము, ఊపిరితిత్తులు, 10. జఠరాశయము, 11. ఉదరాంగములకు సంబంధించిన రక్తనాళములు, 12. లివరు—పిత్తాశయము, దాని నాళములు, 13. పేంక్రియస్ గ్రంధి, 14. ఎడ్రినల్ గ్రంధి, 15. చిన్న ప్రేగు, 16. పెద్ద ప్రేగురెక్టను 17. కిడ్నీ, దాని నాళము, 18. మూత్రాశయము, 19. బీజములు లేక రజఃకోశములు, 20. ఇతర పురుష జాత్యాంగములు, 21. మెసెంటెరిక్ గేంగ్లియాను—క్రిందది, 22. మెసెంటెరిక్ గేంగ్లియాను పైది, 23. సీలియక్ గేంగ్లియాను, 24. చెవికి సంబంధించిన కేంద్రము, 25. లాలాజల గ్రంధి కేంద్రము, 26. అంగిలి కేంద్రము, 27. కనీనికా కేంద్రము, 28. 1 వ సేక్రల్ వర్టెబ్రా, 29. ఉదరభాగపు వర్టెబ్రాలు 1, 2, 3, 30. 1 వ వక్ష వర్టెబ్రా, 31. 1 వ కంఠ వర్టెబ్రా, 32. మెడుల్లా ఆబ్లాంగేటా, 33. మెదడు మధ్యభాగము, 34. కంఠప్రదేశములో మొదటి సింపతెటిక్ గేంగ్లియాను

అకస్మాత్తుగా బస్ స్టాపులో కనపడ్డ సుమిత్రను చూసి ఆశ్చర్య పోయాను. 'పలకరిద్దామా, వద్దా' అనుకుంటూండగానే తనే దగ్గరకు వచ్చి, "గుర్తున్నానా?" అంది.



పద్దెనిమిదేళ్ళ తరువాత కూడా సుమిత్రను సులభంగానే గుర్తు పట్టగలిగాను. వయసుతో వచ్చిన కొద్ది మార్పులే తప్ప పెద్ద మార్పులేమీ లేవు ఆమెలో.

''లేకేం?'' అన్నాను. పొడిగా. ఇన్నేళ్ళ తరువాత కలుసుకున్నా ఆమెతో మాట్లాడాలనిపించ లేదు—మనసులో పేరుకున్న అసహ్యంవల్ల కాబోలు. ఆమే మళ్ళీ పలకరించింది. 'ఈ వూరి కెప్పుడొచ్చావ్' అని నే చెప్పాను. ''ఇంకా ఉంటావా?''

''ఎల్లుండి వెళ్ళిపోతున్నాం.''

''నీతో ఓమారు మాట్లాడాలి. నేనున్న చోటికి రాగలవా?'' అంది మళ్ళీ.

''అంత అవసరమా? ఇక్కడే చెప్పు పోనీ'' అన్నాను.

''కాదులే. నీ కిష్టం లేనట్టుంది. కాని మన పాత స్నేహాన్ని పురస్కరించుకుని ఒక్కసారి రా. ఇదిగో అడ్రసు. మూడో నంబరు బస్సు ఎక్కావంటే అక్కడే దిగుతావ్. లేదంటే ఇప్పుడేం తొందర పనుల్లేకపోతే నాతోనేరా.''

''ఇప్పుడు వీలుపడదు, సుమిత్రా. రేపు తప్ప

కుండా వస్తాను" అన్నాను. అంతలో ఆమె ఎక్క వలసిన బస్సు వచ్చింది. "తప్పకుండా వస్తావు కదూ? నీ కోసం ఎదురుచూస్తూ ఉంటాను." అంటూ బస్సెక్కింది. బస్సు వెళ్ళిపోయింది. నేను వెళ్ళాల్సిన బస్సు ఇంకా రాలేదు. ఆమిచ్చిన అడ్రస్ కాయితం విప్పి చూశాను.

"అనాథాశ్రమ బసవనగుడి' అని ఉంది. అయితే అనాథాశ్రమంలో ఉందన్నమాట! ఇదా కథ? అనుకున్నాను.

ఇంటికి వచ్చాక కూడా ఆ రోజంతా సుమిత్రే నా మనసులో మెదల సాగింది.

ఇప్పటి సంగతా? సుమారు ఇరవై రెండేళ్ళ క్రిందటిమాట. అప్పుడే సుమిత్ర నవ వధువుగా మా వూళ్ళో అడుగు పెట్టింది. మూర్తి మాకంతా బాగా తెలిసిన వాడవటంచేత నేనూ వెళ్ళా నా రోజు వాళ్ళింటికి. పెద్ద పెద్ద కళ్ళతో అందంగా ఎర్రగా, తీగలా ఉన్న సుమిత్ర నన్నెంతో ఆకర్షించింది. మూర్తి అదృష్టవంతు డనుకున్నాను.

బాగా చదువుకున్న సుమిత్రకు కొద్దిగానైనా చదువుకున్న నేనంటే ఎంతో ఇష్టం. రోజూ వాళ్ళింటికి రమ్మని పోరు పెట్టేది. నేను రాక పోతే తనే వచ్చేసేది. ఇక పుస్తకాల గురించి సినిమాల గురించి బోలెడు కబుర్లు చెప్పుకునే వాళ్ళం. మా కిద్దరికీ మంచి స్నేహం ఏర్పడింది. ఆ తరువాత సంవత్సరానికి విజ్జి పుట్టింది. నాకు పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోయాను. మా వారికి దూర ప్రాంతాల్లో ఉద్యోగమవటం వల్ల మళ్ళీ మూడేళ్ళకుగాని రాలేకపోయాను. కాని, రాగానే అంత ఘోరమైన వార్త వినాల్సి వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

సుమిత్ర లేచిపోయింది!

మూడేళ్ళపాప విజ్జిని కూడా విడిచి వెళ్ళిపోయింది. నమ్మలేకపోయాను. మూర్తితో ఏం మాట్లాడాలో తెలియక వాళ్ళింటివైపే వెళ్ళటం మానేశాను. కాని ఇక మళ్ళీ వూరెళ్ళిపోతున్నా నన్నపుడు మూర్తిని, విజ్జిని చూడాలన్న కోర్కెను ఆపుకోలేకపోయాను.

నేను వెళ్ళేసరికి మూర్తి విజ్జిని నిద్ర పుచ్చుతున్నాడు. నన్ను "రామ్మా, కూర్చో" అన్నాడు. మౌనంగా కూర్చున్నాను. కుశల ప్రశ్నలు వేశాడు. తన సంగతులేం మాట్లాడలేదు. అతన్ని చూస్తుంటే నా కడుపు తరుక్కుపోయింది. మొహమంతా పీక్కుపోయింది. ముప్ఫై రెండేళ్ళకే ముసలితనం వచ్చినట్లు కనిపిస్తోంది. అతడిని ఈ స్థితికి తెచ్చిన సుమిత్రమీద చెప్పలేనంత ఆగ్రహమూ, అసహ్యమూ కలిగాయి. ఆవేశంతోనే అన్నాను.

"ఆఖరికి సుమిత్ర ఇంత పని చేస్తుందనుకోలేదన్నయ్యా"

మూర్తి తొణకలేదు. మెల్లిగావచ్చి నా కెదురుగా కుర్చీమీద కూరున్నాడు. అతడి మొహాన్ని నిరాశా, నిస్పృహా ఆవరించాయి.

"పాపిష్టిది. కనీసం బిడ్డ మొహమైనా చూడలేదు"

"అలా అనకమ్మా తప్పంతా నాదే. నేనే సుమిత్రకు తీరని ద్రోహం చేశాను. తల్లీ, తండ్రీ లేని పిల్లను నా చేతుల్లో పెట్టాడు. వాళ్ళ మామయ్య. ఏం సుఖ పెట్టాను. నేను? ఆఖరికిలా అయింది. ఎక్కడుందో, ఎన్ని బాధలు పడుతోందో!" అన్నాడు మూర్తి కిటికీలోనుండి బయటకు చూస్తూ.

"తనకే పెడ్డ బుద్ధులు పుడితే నువ్వేం చేస్తావు మధ్యన?" అన్నాను కోపంగా.

"నీకు తెలీదమ్మా. అంతటికీ నేనే కారణం. తన కోర్కె లేమిటో, ఆశ లేమిటో గ్రహించా లన్న ధ్యాసే లేకపోయింది నాకు. వాటి కోసమే తపించి ఇలా వెళ్ళిపోయింది సుమిత్ర. వట్టి అమాయకురాలమ్మా. నీకు తెలీదు. తప్పంతా నాదే" బయటకు రాబోతున్న కన్నీటిని తుడుచుకున్నాడు మూర్తి.

"ఇక చాల్లే అన్నయ్యా. లేనిపోని నిందలు నెత్తిన వేసుకోకు. అంతమాత్రానికే ఇల్లు వదిలి వెళ్ళిపోతారా? అసహ్యం వేస్తుంది వింటే. నీలాంటి వాడు దొరకాలంటే తపస్సు చెయ్యాలి"

మూర్తి ఇంకేం మాట్లాడలేదు. ఇక వెడతానని లేచినపుడు చెప్పాడు.

"ఈ వూరు వదిలి పెట్టాలనుకుంటున్నానమ్మా. 'విజ్జికి బాగా చదువు చెప్పించాలి' అంటూండేది వాళ్ళమ్మ. పట్నం వెళ్ళి అక్కడే ఉండి పోదామనుకుంటున్నా."

మళ్ళీ మూడేళ్లకు, నాలుగేళ్ళకు పట్నం వెళ్ళినపుడల్లా విజ్జి, మూర్తులను చూసేదాన్ని విజ్జి ఎంతో ప్రేమతో 'పిన్నీ, పిన్నీ' అంటూ నావెంటే తిరిగేది. విజ్జి పెద్ద పెద్ద కళ్ళు, అందమయిన మొహం సుమిత్రనే గుర్తుకు తెచ్చేవి నాకు. కాని సుమిత్రలో లేనిది విజ్జిలో ఉన్నదీ ఒక్క గాంభీర్యమే. అంత చిన్న పిల్ల కుండవలసింది కాదది. అలా అనుకున్నపుడల్లా సుమిత్రమీది అసహ్యం పెరిగి పోయేది నాలో.

ఇపుడు అయిదేళ్ళుగా పట్నంలోనే ఉంటున్నాం. మేము. విజ్జి బి. ఏ. చదువుతోంది. మూర్తికి వంట్లో ఏమంత బాగుండటంలేదు. ఆ తండ్రీ కూతుళ్ళ మధ్యనున్న ప్రేమ వాత్సల్యాలను చూస్తూ ఉంటే నా కళ్ళు చెమ్మగిల్లేవి. తల్లి తన బిడ్డను చూసినట్లు చూసేది విజ్జి తండ్రిని. బుజ్జగించి మందులు తాగించేది. సాయంత్రాలు ఎక్కడికీ వెళ్ళకుండా తండ్రి దగ్గరే కూర్చుని ఏవో చదివి వినిపిస్తూండేది.

ఒక్కటిమాత్రం కనిపెట్టాను. విజయకు వాళ్ళమ్మ అంటే అపరిమితమయిన అసహ్యం అని. అందుకే నే నెప్పుడూ తన ముందు సుమిత్ర పేరెత్తేదాన్నికాదు. మూర్తి కూడా అంతే ననుకుంటాను. ఒకరోజు విజ్జి లేకుండా చూసి అన్నాడు

"బతికి ఉంటే ఒక్కమారన్నా వచ్చేదే"

మూర్తి సుమిత్రను ఎన్నటికీ మర్చిపోలేడు. అనుకున్నాను.

ఈ సంవత్సరం వేసంగి సెలవులకూ అన్నయ్యున్నాడుకదానని ఈ వూరికి వస్తే అకస్మాత్తుగా సుమిత్ర తటస్థించింది. ఆ రాత్రి వెళ్ళనా వద్దా అనుకోవటంతోనే తెల్లవారింది.

* * *

మరునాటిరోజు సాయంత్రం సుమిత్ర చెప్పిన అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళాను. ఆ అనాథాశ్రయాన్ని సులభంగానే కనుక్కోగలిగాను. నా కోసం ఎదురు చూస్తోందేమో, గేటు దగ్గరే ఎదుర్కొని లోపలికి తీసుకుని వెళ్ళింది సుమిత్ర. నలుగురు పిల్లలు "అమ్మా, అమ్మా" అంటూ వచ్చి ఏదో చెప్పి వెళ్ళిపోయారు సుమిత్రతో.

"వీళ్ళంతా......." అన్నాను.

"నా పిల్లలేనా అని అడగబోతున్నావ్ కదూ? అవును. ఇంకా చాలా మందున్నారు. ఇక్కడి మేట్రన్ని నేను" అంది సుమిత్ర.

"ఓ" అనుకున్నాను. ఎందుకోసం మూర్తిని వదిలిపెట్టి ఈ స్వర్గాన్ని చేరుకుందో అడగాలనుంది నా మనసులో. కాని ఎలా అడగాలో తోచక మౌనం వహించాను.

"నా కథంతా తెలుసుకోవాలని లేదూ?" అంది సుమిత్రే మళ్ళీ మొదటినుండి మనసులోని భావాలను చదవటం సుమిత్ర కలవాటే. అది ఇప్పటికీ అలాగే ఉందన్నమాట.

"నీ కభ్యంతరం లేకపోతే అంత సహృదయుడయిన భర్త నెందుకు మోసగించావో తెలుసుకోవాలనుంది" అన్నా. నా కంఠంలోని కాఠిన్యం దాగలేదు. సుమిత్ర కళ్ళలో ఏదో నాకు తెలియని భావం మెరిసి మాయమైనట్లు కనిపించింది.

"నేనంటే నీ కసహ్యమని నాకు తెలుసు. కాని నా కథంతా ఇంతవరకూ ఎవరికీ చెప్పలేదు. నీకు చెప్పాలనిపించింది. అవసరముంది కూడా......" అని ఆగిది.

సరే నన్నట్టు తలూపి వినటానికి సిద్ధంగా కూర్చున్నాను.

"ఆయనంటే నీ కెంతో అభిమానమని నాకు తెలుసు. నా కర్మకు ఆయన్ను నిందించటం నా ఉద్దేశ్యంకాదు. కాని ఆయన పెళ్ళే చేసుకోకుండా ఉండాల్సింది......"

"నే నేదో చెప్పబోయాను.

"దయచేసి చెప్పేదంతా విను సరళా. నేను నా చిన్నతనం—లోనే తల్లిని, పదహారో ఏట తండ్రినీ పోగొట్టుకున్నాను. తల్లి దండ్రుల ప్రేమానురాగాలకు నోచుకోనిదురదృష్టవంతురాల్ని రెండో సంబంధమయినా పెద్ద వయసుకాదని, బోలెడు ఆస్తి ఉందని ఈ సంబంధం నిశ్చయించినప్పుడు నేను కాదనలేదు. కాని మా దాంపత్యంలో నేను సుఖపడ్డ రోజు ఒక్కటి కూడా లేదంటే నమ్మలేవు. ఆయన నన్నెంతో ఆప్యాయంగా ఆదరించారు. కాని అనురాగంతోకాదు. రోజంతా సాయంకాలానికోసం ఎదురు చూసేదాన్ని. ఆరాటాన్ని, ఆహ్వానాన్ని, అనురాగాల్ని కళ్ళలో నింపుకుని ఆయన కోసం అలమటించేదాన్ని. కాని ఆయనెప్పుడూ! వీటిని గమనించేవారేకాదు. గమనించినా ఏమీ చెయ్యలేనట్లు నిస్సహాయులుగా ఉండిపోయేవారు. భోజనాలవగానే గదిలోకి వెళ్ళి పుస్తకం ముందేసుకుని, ఇక నేను నిద్రపోయేదాకా అనే చదువు. నేను చదువుతున్న ఆయన మొహంలోకి చూస్తూ కూర్చునేదాన్ని. ఒక్కోసారి మనసులోని కోర్కెలు పడగలు విప్పితే ఓర్చుకోలేక పడకమీద పడి వెక్కి వెక్కి ఏడ్చేదాన్ని. అప్పుడు దగ్గరకు తీసుకుని,

"పిచ్చిపిల్లా ఎందుకేడుస్తావ్" అని ఓదార్చేవారు. ఒక్కోమారు "నిన్ను బాధ పెడుతున్నాను కదూ? కాని ఏం చేయను......" అని వాపోయేవారు. నా తలమీద చెయ్యివేసి నిమురుతూ ఉంటే చనిపోయిన నాన్న ఆప్యాయిత గుర్తుకొచ్చేది. కాని నాక్కావలసినది ఆప్యాయతకాదు, అనురాగం.

వంచిత

అది నాలో స్పందనను కలిగించాలి. అతడు నన్నే సర్వస్వం అనుకుని నాలోని కోర్కెలనూ, ఆవేదననూ అర్థం చేసుకుని మెలగాలి. ఒక్కోమారు ఆయన గుండెలమీద తల పెట్టుకుని నాలోని ఆవేదనవంతా వెళ్ళబోసుకోవాలనిపించేది. ఎప్పుడో గాని ఆ అవకాశమూ లభించేదికాదు. అపుడు ఆయన గుండెలమీద తల పెట్టుకుని ఏరవంగా రోదించేదాన్ని. ఇంతకూ ఈయన అనాదరణకు కారణమేమిటో ఒకరోజు తెలిసింది. "నిర్మలను మర్చిపోలేకుండా ఉన్నాను" అన్నారు. నాలోని సహనం కట్టలు తెంచుకుంది.

"అయితే నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారూ? ఇలా అన్యాయం చెయ్యడానికేనా?" అని రెట్టించాను.

"నిజమే నీ కన్యాయమే జరిగింది. కాని అది నేను కావాలని చేసిందికాదు. నేను మానసికంగా ముసలివాడి నయ్యానన్న సంగతి నా కప్పుడు తెలియదు. నలుగురూ పెళ్ళి చేసుకోమని బలవంత పెడితే చేసుకున్నాను. నిన్నింత బాధ పెడుతున్నందుకు నా మనసు క్షోభిస్తోంది"

ఆయన మొహం చూస్తే జాలి, అసహ్యం, కోపం అన్నీ పెనవేసుకుని బయటికి పొంగసాగింది. ఆయనముందు నిల్చోలేక పారిపోయాను. అప్పటికే విజ్జి పుట్టింది. ఇక పాపే నా సర్వస్వం అనుకుంటూ నిర్లిప్తంగా జీవించటానికి నిర్ణయించుకున్నాను. కాని అపుడే ఆ వూరికి టీచర్‌గా వచ్చిన మాధవ్‌తో పరిచయమయింది. అనుకోని మార్పులు వచ్చాయి. నాలో అణగి మణగిన కోర్కెలు విజృంభించాయి. సులభంగానే అతడికి లొంగిపోయాను. నన్నారాధించి స్వర్గం చవి చూపిడతడు.

"ఈ కట్టడిలో నిన్నిలా పూజించను? నాతో వచ్చేయి" అన్నప్పుడు వెనుదిరిగి చూడకుండా కళ్ళు మూసుకుని అతడివెంట నడిచాను.

తలెత్తి సుమిత్రవైపు చూశాను. గత స్మృతితో ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. యౌవనం దిగజారిపోయినా, ఆ తాలుకు అందం ఆమెను విడలేదనిపించింది.

"సరళా ఇదంతా చెప్పటానికి నాకు సిగ్గు వెయ్యటంలేదు. నేను ఆయనకు ద్రోహం చేశానని కూడా అనిపించటంలేదు. నేను నమ్మి వచ్చిన తను జీవితంలో మాధుర్యమంటే ఎలా ఉంటుందో చవి చూపాడు—కొద్ది రోజులైతే మాత్రమేం అవే నాకు మధుర క్షణాలు.

"ఒకరోజు ఇంటికి తిరిగి పొమ్మని చీటీ రాసి పెట్టి తన త్రోవ చూసుకున్నాడు. అందుకని అతడిని నిందించను నేను. అతడికీ ఇల్లూ, ఇల్లాలూ కావాలనిపించి ఉంటుంది. వెళ్ళిపోయాడు. ఇక నాకు మిగిలిందేమిటి? జీవితంలో ఇంకేం ఆశా లేదు. విజ్జిని మాత్రం ఒక్కసారి చూడాలనిపించింది. ఆ ఆశను మనసులోనే దాచుకుని ఈ జీవితాన్ని చాలించాలనుకున్నాను. కాని ఈమె అడ్డుపడింది……"

అంటూ ఆ గదిలోనే ఉన్న ఫోటో చూపింది సుమిత్ర.

"నన్ను తీసుకొచ్చి కన్న తల్లిలా ఆదరించింది నేను చదువుకున్న చదువు అక్కరకొచ్చిందప్పుడు. ఈ అనాధాశ్రమానికి మేట్రన్ ఆమె. నేను సహాయకు

తాలిగా చేరాను. అప్పటినుండి ఇక్కడే ఇలాగే జీవిస్తున్నాను.

"కాని నేను చేసిన పాపమల్లా ఒక్కటే. తల్లి ప్రేమలేని లోటు ఎంతటిదో తెలిసి కూడా విజయని తల్లిలేనిదాన్నిగా చేశాను. అదే నన్ను రంపపుకోత పెడుతోంది. ఒక్కసారిమాత్రం విజ్జిని చూడాలన్న కోర్కె ఆపుకోలేక వూరికి వెళ్ళాను. ఇంటికి తాళం వేసి ఉంది. ఎవరినయినా అడిగితే గుర్తు పడతారేమోనని అలాగే తిరిగి వచ్చాను. ఇదీ నా కథ" అంటూ ఆపింది సుమిత్ర. నా కళ్ళలోని నీరు ఆమెకు కనపడుతుందేమోనన్న భయంతో తలవంచుకుని టేబిల్‌మీది పుస్తకంమీద దృష్టి నిలిపాను.

"ఇపుడు వారెక్కడున్నారో తెలుసా......?" సుమిత్ర కంఠం వణికింది. నేను తెప్పరిల్లుకుని "మద్రాసులోనే ఉంటున్నారు" అన్నాను.

"అమ్మాయి ఎలా ఉంది?" అంది కిటికీలోనుండి బయట అలుముకున్న సంజ చీకట్లను చూస్తూ.

"అచ్చం చిన్నప్పటి నీలాగే ఉంది" అన్నాను విజయను తల్చుకుంటూ.

"కాని ముక్కుమటుకు వాళ్ళ నాన్నదే."

"నిజమే" అన్నాను ఎంతయినా తల్లి హృదయం అనుకుంటూ.

అప్పటికిగాని సుమిత్ర ఏదో చెప్పాలని నన్ను పిలిచిందన్న విషయం గుర్తుకు రాలా. ఇప్పుడు కారణం లీలగా అవుపిస్తోంది. విజయ కళ్ళలోని గాంభీర్యం నా మనసులో మెదిలింది.

"విజ్జి ఇప్పుడు బి. ఏ. చదువుతోంది. మూర్తి ఆరోగ్యం ఏమంత బాగుండటం లేదు."

"నే నొక్కటడగాలనుకుంటున్నా"

సుమిత్ర ఏమి అడగబోతోందో వూహించుకుని నా మనసు కలవర పడింది.

"విజయ నోమారు చూడాలని ఉంది. వీలు పడుతుందా?"

అమాయకంగా కనిపించే విజయ పెంకితనం గుర్తుకొచ్చింది. వీలుపడుతుందని ధైర్యంగా చెప్పలేకపోయాను.

"ఇక్కడ పిల్లలంతా నన్ను 'అమ్మా' అనే పిలుస్తారు. నేనూ వాళ్ళల్లో విజయనే చూసుకుంటున్నాను. అయినా సంతృప్తి కలగలేదు. విజయ నోమారు చూడాలనుకోవటం తప్పంటావా?

"మూర్తిని చూడాలని లేదా?"

"లేదు......లేదు......" అంది తడబడుతూ.

"విజయను మాత్రం చూడాలని ఉంది. బహుశా అమ్మాయికి నేనంటే అసహ్యమేనను కుంటా" సుమిత్ర కళ్ళలో నీరు తిరిగింది. జాలి వేసింది. నాకు సుమిత్రను చూసి కాదు. ఆమె మొహంలో జ్వలిస్తున్న మాతృమూర్తిని చూసి, లేచి ఆమె బుగ్గలమీదుగా ప్రవహిస్తున్న కన్నీటిని తుడిచాను. నా కళ్ళలో నీరు ప్రవహించి లోపల గడ్డ కట్టుకున్న అసహ్యాన్నంతా తుడిచి వేసినట్టనిపించింది. కాని విజయతో పరిచయం బాగా ఉన్న నాకు వాళ్ళ మధ్యకు సుమిత్రను తీసుకుని వెళ్ళి నిలబెట్టే సాహసం కలగలేదు.

"అక్కడి పరిస్థితులను చూసి వీలునుబట్టి ఉత్తరం రాస్తాను. అప్పుడు వద్దువుగాని" అన్నాను.

"కాని నే నెవరో తెలియ నివ్వకుండా దూరంనుంచే విజ్జిని చూసి సంతృప్తిపడి వచ్చేయలేను. ఒక్కసారి 'అమ్మ' అని పిలిపించుకోవాలని' దగ్గరకు తీసుకోవాలని నాలో ఉధృతంగా ఉన్న కోర్కె బయట పడవచ్చు. విజయ నన్ను గుర్తించినా ప్రమాదం లేదనిపిస్తేనే రాయి. లేదంటే...... ఇలాగే శేష జీవితాన్నంతా గడిపెయ్యగలనులే. వీళ్ళంతా నా పిల్లలే......మరేం పర్వాలేదు."

"కొత్త సమస్య వచ్చి పడింది. ఏం చెప్పాలో తెలియలేదు. నాకు తెలిసినంతవరకూ సుమిత్ర కోర్కె తీరే అవకాశంలేదు.

"సరేలే ఉత్తరం రాస్తానుగా" అంటూ బరువుగా సెలవు తీసుకున్నాను.

ఊరికి వచ్చి నాలుగు రోజులయినా విజయనీ, మూర్తినీ కలుసుకోవటం పడలేదు. నెల రోజులుగా వదిలి వెళ్ళిన ఇంటిని సర్దటంలోనూ, పిల్లల స్కూలు గొడవలలోనూ సరిపోయింది.

అయిదో రోజు తీరిక చేసుకుని వెళ్ళాను. మూర్తి శాలువా కప్పుకుని పడక కుర్చీలో కూర్చున్నాడు. విజ్జీ కూడా అక్కడే బత్తాయి పళ్ళరసం తీస్తూ కూర్చుంది. ఇద్దరూ ఏదో వాదించుకుంటున్నట్టున్నారు. నేను వెళ్ళగానే.

"రా పిన్నీ, ఎప్పుడూ రావటం వూరినుండి" అంటూ పలకరించింది విజయ వెంటనే.

"చూడు పిన్నీ. కొద్ది రోజులు మన వూరికి వెళ్ళి ఉందామంటే ఒప్పుకోవటం లేదు నాన్న" అంటూ ఫిర్యాదు చేసింది.

నవ్వుతూ కూర్చున్నాను.

"అయితే అమ్మాయి చెప్పిన మాట వినటం లేదన్నమాట నాన్నగారు. ఆరోగ్యం బాగుపడుతుందంటే రెండు రోజులు వెళ్ళిరాకూడదా అన్నయ్యా?" అన్నాను.

"అలా చెప్పు పిన్ని" అంటూ మూర్తి పళ్ళరసం తాగి కింద పెట్టిన గ్లాసు తీసుకుని లోపలకు వెళ్ళింది విజయ.

"అదికాదమ్మా. నేను విజయను ఎంత బాధ పెడుతున్నానో చూశావా? ఎలా ఉండాల్సిన పిల్ల. నలుగురు స్నేహితులతో కలిసి తిరగదు, ఎప్పుడూ నన్నంటిపెట్టుకునే ఉంటుంది. విజయకి తల్లి లేకుండా చేశాను. నేను ఉండీ బాధ పెడుతున్నాను."

"ఇప్పుడు అకస్మాత్‌గా సుమిత్ర కనిపిస్తే?"

నా నోట మాట జారింది.

మూర్తి ముందుకువంగి అన్నాడు. "ఏమిటి? సుమిత్రా! ఎక్కడ?...... లేదమ్మా, సుమిత్ర బ్రతికిఉంటే ఒక్కసారైనా వచ్చేదే. కనీసం విజ్జికోసమైనా రాదా?......ఊహూ...... ఇక అక్కడే కలుసుకోవటం......" మాట పూర్తి చేస్తూండగానే అతని మొహం వివర్ణమయింది. కుర్చీలో వెనక్కి వాలిపోయాడు. గాబరా పడ్డాను నేను. అపుడే లోపలకు అడుగుపెట్టిన విజ్జి చప్పున ముందుకువచ్చి పట్టుకుంది. ఇద్దరం కలిసి నెమ్మ

35 వ పేజీ చూడండి



" ఇంకా ఎంతసేపో నీ సింగారింపూ? అవతల షో బిగిన్నై పోయుంటుందిపాటికి !! "

" అబ్బబ్బ ! గంటల తరబడి చెబుతున్నా, ఒక్క నిముషంపాటు ఆగండీ అని....?? ! "

అరటిచెట్టు పదికూరల పెట్టు

యమ్. సుశీల

అరటికాయ, పువ్వు, దవ్వ (దూటలతో) అనేకమైన కమ్మటి కూరలు తయారు చేయవచ్చు.

సాధారణంగా అరటికాయతో వండే కూరకు, ఉడకడానికి అట్టే, 'టైమ్' పట్టదు. మామూలుగా వండే ఈ కూరకు మరీలేతవి, మరీ ముదురువి కాక, మధ్యరకంగా ఉండే కాయలు బాగుంటాయి. వేపుడుకైనా ఇంతే, ఉడకబెట్టి వార్చి వండే కూరకు ముదురువైనా ఫర్వాలేదు. పచ్చడి (దీన్నే, పొడి, పాళోళి, అని కూడా అంటారు)కి మాత్రం ఖచ్చితంగా ముదురు కాయలే బాగుంటాయి.

మామూలు కూర

1. కూరకు కావలసిన కాయలు చెక్కు తీసుకుని, మరీ పెద్దవి, మరీ చిన్నవి కాకుండా నీళ్ళలో ముక్కలు తరుక్కోవాలి. వేరే ఒక పళ్ళెంలో రెండు ఉల్లిపాయలు. నాలుగు పచ్చిమిరపకాయలు, కాస్త అల్లం ముక్కను ముక్కలుగా తరుక్కొని కాస్త మినపప్పువేసి పోపు తయారు చెయ్యాలి. అల్లం ముక్కను చాలా సన్నగా ముక్కలు తరుక్కోవాలి. లేదా కొంతమంది చితకకొట్టి వేస్తారు. గిన్నెను కుంపటిమీద వేసి, కాస్త నూనెవేసి ముందు మినపప్పు వెయ్యాలి. మినపప్పు వేగాక, మిగతా పోపువేసి బాగా వేగేవరకు అట్లకాడతో కలియబెట్టాలి. అప్పుడు అరటికాయ ముక్కలను నీళ్లల్లోంచి తీసి గిన్నెలోవేసి తగినంత ఉప్పు, కారం. చిటికెడు పసుపు వేసి కలియబెట్టాలి. ముక్కలు కాస్త వేగాక, అవి ఉడకడానికి తగినన్ని నీళ్ళు (సుమారు గ్లాసున్నర, రెండు గ్లాసులు) పొయ్యాలి. కూర బాగా ఉడికేక దించెయ్యాలి.

ఏ కూర వండేటప్పుడైనా, పోపులో ముందు మినపప్పు నూనెలో వేసి కాస్త వేగింతర్వాత, మిగతాపోపువేసి వేయించాలి. మిగతా పోపు ముక్కల కన్నా మినపప్పు వేగడానికి 'టైమ్' ఎక్కువ పడుతుంది. అన్నీ ఒక్కసారే వేస్తే, మినపప్పు వేగకుండా ఉంటుంది. మిగతా పోపు వేగిపోయి [illegible]రుకుంటుంది. పైన చెప్పిన పద్ధతిలో చేసినట్లయితే రెండూ సమానంగా వేగుతాయి. ఈ విషయం ఏ కూరవండేటప్పుడైనా ముఖ్యంగా జ్ఞాపకం పెట్టుకోవాలి. రెండవది ఉడకబెట్టి చేసే కూర.

2. ఈ కూర అరటి కాయల ముక్కలు, నీళ్లతో ఉడకబెట్టి వార్చి వండుతారు. మామూలు కూర కంటె, ఈ కూర చాలా రుచిగా ఉంటుంది. ఇష్టమున్నవారు, ఉల్లికారం పెట్టి, లేనివారు ఉట్టి పోపు పెట్టి వండుతారు.

ఒక గిన్నెలో నీళ్లు తీసుకుని అరటి కాయలు తడుపుతూ చెక్కు తీసుకోవాలి. వీటిని సుమారు అర అంగుళం వెడల్పు అంగుళంన్నర పొడవు ఉండే పొడుగాటి ముక్కలుగా కొయ్యాలి. ఈ ముక్కలు ఎలా తరగాలో వివరంగా చెబుతాను. చెక్కుతీసిన అరటికాయ లావుగా ఉన్న పక్షంలో నాలుగు, సన్నగా ఉంటే మూడు ముక్కలుగా అడ్డంగా కొయ్యాలి. ఈ ముక్కలను ఒక్కొక్కదాన్ని రెండేసి చెక్కలు చెయ్యాలి. ఆ చెక్కలను కలిపి పట్టుకొని, నిలువుగా మూడు లేక నాలుగు సార్లు తరగాలి.

కావలసినన్ని ముక్కలు తరిగాక, ఒక స్టీలు పాత్రలో గాని, సిల్వర్ పాత్రలోకాని, ముక్కలు మునిగేలా నీళ్ళుపోసి, కాస్త ఉప్పువేసి, ఈ ముక్కలను వేసి ఉడక నివ్వాలి. ముక్కలు ఉడికిందీ లేనిదీ ఒకముక్క గరిటెలో తీసి, కాస్త చల్లారిన తర్వాత చేత్తో నొక్కి చూడాలి. మెత్తగా నొక్కుపడితే ఉడికినట్టే, బాగా ఉడికేక దించి నీళ్ళన్నీ వార్చి వేయాలి.

ఇంక ఇప్పుడు పోపు తయారు చెయ్యాలి నాలుగు ఎండు మిరపకాయలు ముక్కలు తుంపి, కాస్త మినపచెక్కు, కాసిని ఆవాలు, కాస్త కరివేపాకు, రెండు వెల్లుల్లి రేకలు చితగ్గొట్టి, పోపు చెయ్యాలి. కుంపటి మీద గిన్నెవేసి, నూనెవేసి పోపు వేగాక, ఉడికిన ముక్కలు అందులో, తగినంత నూరిన ఉప్పు (ఉప్పువేసి ఉడికిస్తాం కాబట్టి కాస్త మామూలుకన్నా తక్కువే వెయ్యాలి) కారం చిటికెడు పసుపువేసి, అట్లకాడతో వేగే వరకు కలియబెట్టాలి. కూర బాగా వేగాక దింపి వాడుకోవచ్చు.

ఉల్లికారం ఇష్టమైన వారు, నాలుగైదు పెద్ద ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయలు, కాస్త అల్లం ముక్క, కాసిని ఆవాలు, జీలకర్ర, ధనియాలు వేసి ముద్దగా నూరుకోవాలి. పై కూరకు మాదిరిగానే పోపు తయారుచేసి, ఆ పోపు వేగాక, ఈ ఉల్లికారంవేసి, బాగా వేగాక, ఉడికించి వార్చిన అరటికాయ ముక్కలు వేసి, తగినంత నూరిన ఉప్పు మొదలైనవి బాగా వేయించాలి. ఉల్లికారం బాగా వేగాక, ముక్కలు వెయ్యాలి. లేకపోతే ఉల్లివాసన వేస్తూ అసహ్యంగా ఉంటుంది. ఉల్లికారం ఇష్టమున్నవారికీ కూర చాలా రుచిగా ఉంటుంది.

3. అరటికాయ వేపుడు : తొక్కు తీసిన అరటి కాయలను మరీ సన్నగా కాకుండా, లావుగా కాకుండా గుండ్రటి చక్రాలుగా తరుగుతారు. తగినంత నూరిన ఉప్పు, కారం, చిటికెడు పసుపు ముక్కల్లోవేసి బాగా ముక్కలకు పట్టేట్లు కలియబెట్టాలి. మూకుడులో నూనెవేసి, కాస్త మరిగాక, అందులో ఈ ముక్కలు కొద్దికొద్దిగా, వేసి అట్లకాడతో కలుపుతూ, బాగా వేగాక దించుకోవాలి. ఉల్లికారం ఇష్టమైనవారు ఉప్పు కారాలతోపాటు, ఉల్లికారం కూడా ముక్కల్లో కలిపి, పై మాదిరిగానే వేయిస్తారు. కొందరు చక్రాలుగా కాక, ఉడికించి వార్చి చేసే కూరకు మాదిరి ముందు పెద్ద పెద్ద ముక్కలు తరిగి, వాటిని వెడల్పుగా చదరాలుగా తరిగి, పై రెండు విధాలుగా వేయిస్తారు.

పైన చెప్పిన వేపుళ్ళు వేయించడానికి కాస్త ఓపిక కావాలి. వాయితర్వాత వాయి వేస్తూ వేయించాలి. అలాకాక ముక్కలన్నీ ఒకేసారి వేసి చేసే వేపుడు ఇంకొక విధమున్నది. ఈ వేపుడు ఇటు కూరలాగ అన్నంలో కలుపుకోవడానికి వీలుగా ఉంటుంది. అటు వేపుడు రుచీ ఉంటుంది.

5. అరటిపువ్వు కూర : సాధారణముగా ఇవి బజార్లలోను, ఇండ్ల దగ్గరకు చౌకగా అమ్మవస్తుంటాయి. అణాకి రెండు, ఒక్కొక్కప్పుడు బేడకు అయిదు పువ్వులు కూడా ఇస్తుంటారు. కూర చౌకగా వస్తుందన్న మాటేగాని, ఇది చెయ్యడం చాలా కష్టపడి చెయ్యాలి. చాలా రుచిగా మాత్రం ఉంటుంది.

కూరకు కావలసిన పువ్వులు కొన్నాక, ఎర్రటి డిప్పలు ఒక్కొక్కటే ఒలిచి ముందు తెల్లటి పువ్వులన్నీ ఒక ప్రక్క పోగెయ్యాలి. సన్నగా, తెల్లగాఉన్న ఈప్పుల్లో (వీటిని ఏమంటారో తెలియదు. అందుకని పువ్వులంటాను), దొంగలనీ, పిల్లేళ్లనీ ఉంటాయి. దొంగలనేవి, పువ్వుల్లో గట్టిగా కడ్డీలా ఉంటాయి. నెత్తిమీద గుండ్రంగా ఉంటుంది, పిల్లేళ్లనేవి దళసరి ఉలిపిరి కాగితంతో చేసిన డిప్పల్లా ఉంటాయి. వీటి రెంటినీ ప్రతి పువ్వులో నుండి వేరు చెయ్యాలి. ఇలా ఏరుకున్న తర్వాత చివర చిన్న పువ్వు మిగిలిపోతుంది. దాన్ని ఏరటం చాలా కష్టం. అందుచేత దాన్ని పూరికే తినేస్తారు. చాలా రుచిగా ఉంటుంది. ప్రతి పెద్ద పువ్వుకు, చిన్న పువ్వొకటి వస్తుంది. ఒలిచిన పువ్వు నోట్లో వేసుకు చూస్తే ఎప్పుడైతే వగరుగా ఉండదో అప్పటి నుండీ ఒలవడం మానేస్తారు. ఏరేసిన పువ్వులను, వరుసగా పేర్చి, చిన్నచిన్న ముక్కలుగా తరుక్కోవాలి. తరిగిన ముక్కలను రోటిలోవేసి, కచ్చాపచ్చాగా దంచాలి. దంచిన ముద్దను ఒక గిన్నెలో వేసి, రెండు మూడుసార్లు శుభ్రంగా నీటిలో వేసి కడగాలి.

ఇంతకు ముందే ఉల్లికారం రుబ్బి ఉంచుకోవాలి. ఉల్లికారం కడిగిన ముద్దలో వేసి, తగినంత నూరిన ఉప్పుకారం, చిటికెడు పసుపు వేసి, చేత్తో బాగా కలియ బెట్టాలి. మామూలు కూరకు మల్లేనే పోపు తయారుచేసి, కాస్త వెడలాంటి గిన్నెలో వేసి, పోపు వేగాక, ముద్ద అందులో వేసి, బాగా వేగేవరకు, అట్ల పుల్లతో అప్పుడప్పుడూ కలుపుతూ ఉండాలి. కొద్దిగా వేగిం తర్వాత, తగినన్ని నీళ్లువేసి మెత్తగా ఉడకనిచ్చి దించుకోవాలి.

6. అరటి దూట : దీన్నే 'దవ్వ'అని కూడా అంటారు. ఇది కూడా బజార్లో చౌకగానే అమ్ముతుంటారు. గిన్నెలో కొంచెం నీళ్ళు తీసు

కుని, పైన తెల్లగా మెరుస్తూండే తొక్కను, కొద్దిగా తరుక్కోవాలి. ఇలా తరుగుతుండగా, మధ్యమధ్య దారంలా వచ్చే పీచును తీసేయాలి. ఆ చక్రాలన్నింటినీ సన్నగా చింతగింజలంత ముక్కలు తరగాలి. వాటిని, ఒక కళాయి గిన్నెలో కాని, స్టీలు గిన్నెలోకాని, కాస్త ఉప్పువేసి మెత్తగా ఉడకనివ్వాలి. ఉడికిన తర్వాత దించి, నీళ్ళన్నీ వార్చేయాలి. కాస్సేపు చల్లారనివ్వాలి. త్వరగా చల్లారక పోతే చన్నీరుపోసి కాస్సేపు ఉంచి, వార్చితే చల్లారి పోతాయి. చల్లారిన ముక్కలను, వాటిల్లో నీరంతా పోయేట్లు గట్టిగా పిండి, ఒక పళ్ళెంలో పెట్టుకోవాలి. ముందుగా రుబ్బి ఉంచిన, ఉల్లి కారం ఇందులో వేసి బాగా కలపాలి. పోపు బాణలిలో వేసి, తర్వాత ఈ ముక్కలకువేసి, తగినంత నూరిన ఉప్పు మొదలైనవి వేసి బాగా వేయించాలి. తినడానికి చాలా రుచిగా ఉంటుంది.

ఉల్లికారం ఇష్టం లేనివారు ఉట్టి పోపు వేసి, వేయించుకోవచ్చు. ఇలా ఉడకబెట్టి వండితే కూర చాల తక్కువగా అవుతుంది. అందుకని కొందరామాదిరిగా వండడానికి ఇష్టపడరు. తరిగిన ముక్కలు ఉడక బెట్టకుండా, పోపువేసి, ఉల్లి కారం ఇష్టమైనవారు వేసి, లేనివారు వెయ్యక, కాస్త వేగాక నీళ్లువేసి ఉడకనిస్తారు.

7. అరటికాయ పచ్చడి : కావలసినన్ని, అరటి కాయలు తీసుకుని, కాడలు కోసేసి, నీటిలో వేసి ఉడకనివ్వాలి. ఉడికిందీ, లేనిదీ, గరిటెతో నొక్కి చూడాలి. అరటి కాయలు ఉడికాక, దింపి వార్చేసి, కాయలను చల్లారనివ్వాలి. ఈలోపున కాసిన్ని ఎండు మిరపకాయలు ముక్కలుతుంచి, కాస్త మిరపచెక్క, రెండు వెల్లుల్లి రెబ్బలు చిదగ్గొట్టి, కాస్త కరివేపాకులతో పోపు అమర్చాలి. చల్లారిన కాయలు తొక్క చేత్తో తీసేసి, ఓ పళ్ళెంలో పెట్టి, అవి చక్కగా పొడి అయ్యేటట్టు, చేతితో పిసకాలి. ఆ పొడిలో తగినంత నూరిన ఉప్పు, కారం చిటికెడు పసుపువేసి బాగా కలపాలి. ఆ పొడికి ఇవన్నీ బాగా పట్టాలి. అప్పుడు బాణలిలో నూనెవేసి, మరిగాక, పోపువేసి వేయించి ఈ పొడిని వేసి, బాగా వేగేవరకు వేయించాలి. దీనికి కాస్త నూనె ఎక్కువే పడుతుంది. వేగిం తర్వాత వేసుకుంటే చాలారుచిగా ఉంటుంది. దీన్నే అరటికాయ 'పొడి' అనీ 'పొకోళి' అనీ అంటారు.

8. అరటికాయ తొక్కలు, పారేసే పార వేయక, పచ్చడి చేసుకోవచ్చు. తొక్కలను శుభ్రంగా చిన్నచిన్న ముక్కలుగా తరగాలి. ఆ ముక్కలను శుభ్రంగా కడిగి, కాసిన్ని నీళ్ళలో, కాస్త ఉప్పువేసి ఉడికించాలి. మెత్తగా ఉడికేక, దింపి నీళ్ళు వార్చివేయాలి. కాస్త చల్లబడ్డాక, ఈ ముక్కలను రోట్లోవేసి, మెత్తగా రుబ్బాలి. ఈ ముద్దను వేరే పళ్ళెంలోకి తీసి ఉంచాలి. వేరే గిన్నెలో, ముద్దకు సరిపోయే చింతపండు కాసిన్ని నీళ్ళతో నానబెట్టాలి. చింతపండు నానాక, అట్టే పలుచగాను, చిక్కగాను కాకుండా మధ్యరకంగా పులుసు తయారు చెయ్యాలి. ఆ పులుసులో ఈ ముద్దను కలిపివెయ్యాలి.

రెండు ఉల్లిపాయలను, రెండు పచ్చిమిరప కాయలను సన్నగా ముక్కలు తరిగి, మిగతా పోపంతా తయారుచేసి, పోపును నూనెలో వేసి, ఈ పులుసును అందులో పోసి, కాస్సేపు ఉడకనివ్వాలి. తర్వాత తీసి వాడుకోవచ్చు.


9. పప్పుకూరలు : ఏ పప్పు వండుతామో ఆ పప్పును ముందు రాయీ, రప్పా లేకుండా శుభ్రంగా బాగు చెయ్యాలి. బజార్లలో అమ్మే పప్పు సాధారణంగా శుభ్రంగానే ఉంటుంది. కూర ఇంక గంటకో అరగంటకో వండుతామనగా, కాయకు తగినంత పెసరపప్పు నానబొయ్యాలి. కూరకు వేసే పోపు తయారు చెయ్యాలి. అరటి కాయలు మామూలుగా కూర ముక్కలు తరుక్కోవాలి. అందులో తగినంత కారం, చిటికెడు పసుపు వేసి, కాస్త వేగనిచ్చి, పప్పు అందులో వెయ్యాలి. పప్పుకూడా కాస్త వేగాక, ఒక గ్లాసో గ్లాసున్నరో తగినన్ని నీళ్లు పొయ్యాలి. కూరముక్కలు, పప్పు బాగా ఉడికే వరకు నీళ్ళు చాలకపోతే పోస్తూనే ఉండాలి. పప్పు బద్దబాగా ఉడికేక తగినంత ఉప్పు వెయ్యాలి. మరిపోయి కూడా పెసరలో ఉప్పు వేయకూడదు. అలావేస్తే పప్పు ఎంతకీ ఉడకదు. పప్పుకూరలు వండేటప్పుడు ఈ విషయం బాగా జ్ఞాపకం పెట్టుకోవాలి.

10. అరటిపువ్వు పప్పు : దీన్ని కంది పప్పులోనే వేస్తుంటారు. ఉత్తి పప్పు ముందు ఒక కుంపటి మీద ఉడకబెట్టాలి. కూరకు మాదిరిగానే పువ్వును కడిగి సిద్ధం చేసుకోవాలి. ఎండు మిరపకాయలు మొదలైన వాటితో పోపు చేసుకుని, నూనెలో పోపు వేగాక, అందులో పువ్వు ముద్ద వెయ్యాలి. అది కాస్త వేగం తర్వాత పప్పు వెయ్యాలి. కాస్త కారం, చిటికెడు పసుపువేసి, కలియబెట్టి, ఒక పది నిముషాల వరకూ కలుపుతూ ఉండాలి. తర్వాత తగినన్ని నీళ్ళువేసి, కాస్సేపు ఉడికింతర్వాత, తగినంత ఉప్పువేసి, కొంతసేపు ఉడకనిచ్చి దించుకోవాలి.

ఈ అరటితో ఏది చేసినా, తరుక్కునేటప్పుడు చేతులకు నల్లగా మచ్చలు ఏర్పడతాయి. కాస్త అజాగ్రత్తగా ఉంటే చీరలకు కూడా మచ్చలు పడతాయి. ఇవి ఎంత ఉతికినా పోవు. అందుచేత చిన్న గిన్నెలో కాస్త నూనెగోరు వెచ్చగా కాగబెట్టి, దాన్ని చేతులకు, కత్తిపీటకు రాసుకుంటే, ఈ సిరమైన నల్లటి మచ్చలు ఏర్పడవు. ★



త్వరలో నలుగురు పిల్లల తల్లి కానున్న బ్రిటిషు రాణి ఎలిజబెత్.



గరల్స్ హైస్కూళ్లు

వనిత నిర్మలప్రభావతిగారి వ్యాసం చదివి ఆశ్చర్యపోయాము. రచయిత్రియొక్క ఉద్దేశ్యము కేవలం ఆడటీచర్లను దుమ్మెత్తిపోయడంగానే కన్పిస్తోంది. ఆ వ్యాసానికి 'ఆడటీచర్లు' అని హెడ్డింగు పెట్టుకున్నా బాగుండేది. బహుశ, ఈవిడగారు పుస్తకాలు లేకుండానే విద్య గడించారు కాబోలు. ప్రాచీన కాలంలో గురుకులంలో విద్యార్థులు ఏ పుస్తకాలు అవసరం లేకుండగనే సర్వ విద్యలను అభ్యసించేవారు. రచయిత్రి ఉద్దేశం మళ్ళీ అలాటి కాలమేరావాలనా ? కాలం, కాలంతోబాటు భావాలు మారాయి. ప్రతి తల్లి, తండ్రి తమ బిడ్డల్ని విద్యావంతుల్ని చేయాలనే అభిలషిస్తారు వారికెన్నో రకాలైన ఇబ్బందులు బిడ్డల్ని చదివించడంవలన కలగొచ్చు. ఏ తల్లితండ్రి గరల్సు హైస్కూళ్లను గురించి గోరంతలు, కొండంతలు చేయడం వినకున్నా ఈనాడు రచయిత్రి వ్యాసం ద్వారా విన్నందుకు చింతిస్తున్నాము.

రచయిత్రి రచన కుపక్రమించేముందు పాఠశాలలను గూర్చి ముఖ్యంగా గరల్సు స్కూళ్ళను గూర్చి బాగా పరిశీలించి యుండాల్సింది. ఏ కొద్ది స్కూళ్ళనో చూచి పైకి కన్పించే కొన్ని విషయాలు మాత్రం గమనించి వాటిని భూతద్దంలో దృశ్యాలుగా మార్చి చూపారు. అంతే కాని పాఠశాలల్లో ఆడటీచర్లంత రాక్షసులుగా మాత్రం ఉండరు. లేదా ఆమె టీచరుగా ఏ స్కూల్లోనన్నా పనిచేసుంటే బాగా పరిజ్ఞానం ముఖ్యంగా ఆడటీచర్ల పరిస్థితు లర్థమై యుండేవి. భావి భారత పౌరులు, ఝాన్సీ లక్ష్మీబాయి, దుర్గాబాయిలాంటి వాళ్లను తయారుచేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయినిదే. అందకని విద్యార్థులను శుభ్రంగా రమ్మనటంలో ఆడ టీచర్ల తప్పేమిటి ? ఏ టీచరూ క్లాసులో పక్షపాతంగా ప్రవర్తించరు.

సాధారణముగా ఆడవాళ్ళు దయార్ద్రహృదయులని పేరొందినవారు. చాల పాఠశాలల్లోను, ఆస్పత్రులలోను నర్సింగు, టీచింగులలో రాణించేది స్త్రీలే. వారికే ఓర్పు ఎక్కువ. కిండర్ గార్డన్ మొదలగు పాఠశాలల్లో ఉపాధ్యాయినులందరు స్త్రీలే కదా ? అలాటి ఆడటీచర్లపై ధ్వజమెత్తటం భావ్యంకాదని మనవి.

తరువాత దుస్తుల విషయం. అసలు యూనిఫారం ఏర్పాటు చేయడంలో ముఖ్యోద్దేశం బీద, గొప్ప తేడాలు పిల్లల్లో కలక్కుండా చేయాలని. అందుకే డ్రస్సు కొనమంటారు గాని రచయిత్రి చెప్పినట్లు నెలకోసారి మార్చటం మాత్రం జరగని పని. తల్లిదండ్రులు ఎలా భరిస్తారు ? ఒక సంవత్సరం ముందు నించి చెప్తున్నా, డ్రస్సుకు డబ్బు పోగుచేయడం కష్టంగా ఉండే తండ్రి నెలకోసారి మారిస్తే ఊరుకుంటాడా ? ఇంక కుట్టు టీచరుమీద వేసిన నింద: ముఖ్యంగా ఆడపిల్లలకి కుట్టు, గృహశాస్త్రం అవసరం. అందుకని కుట్టుగుడ్డ తెమ్మంటే తప్పా ? కుట్టు టీచరేదో లంచగొండిలా మాట్లాడారు. స్కూల్లో పిల్లలకు కావాల్సినవి నేర్పించడంకోసం శుభ్రమైన బట్ట తెమ్మనటం కూడ తప్పేనా ? రచయిత్రి అన్నట్లు బట్టకై డబ్బు వసూలుచేసి, కుట్టు టీచరు కాజేస్తుందనటం ఉపాధ్యాయినినే కించపరచట మౌతుంది. అన్ని వృత్తులలో ఆదర్శప్రాయమైందీ వృత్తి.

ఇక పుస్తకాల విషయం : ఈ విషయం కూడ రచయిత్రికి బాగా తెలిసుంటే అలా వ్రాసుండరు. బహుశ ఈవిడ మగవాళ్ళ స్కూల్లో చదివుంటారనుకుంటాను. మగ మాష్టర్లన్నా, మగపిల్లలన్నా అభిమానంచేత అలా అనుండొచ్చు. ఆ పాఠశాలల అధికార్లు కూడ మగవాళ్లే కాబట్టి వారికి పుస్తకాలు అవీ చూచే అలవాటుండదు. శుభ్రతకు ప్రాముఖ్యం అక్కడ తక్కువ.

రచయిత్రిగారు ఈ మేడమ్సుకు ఆ దయామయుని న్యాయస్థానంలో శిక్ష తప్పదన్నారు. అంతదూరం ఎందుకు ? ప్రతి సంవత్సరం వచ్చే అధికారిణి ఉన్నారుకదా ? ఆవిడముందు ప్రతి టీచరూ, ప్రతి పుస్తకం హాజరు పర్చాల్సుంటుంది. ఒక్క పుస్తకం తక్కువైనా, మురికిగానున్నా ఆ తప్పు టీచరుదే అవుతుంది. ఆవిడ బుక్సు బాగాలేవని, వ్రాత బాగాలేదని ఆదేశాలు, ఆర్డర్లు జారీచేస్తారు. అటువంటప్పుడు బవుండ్ బుక్సు కాకపోయినా నీటైన బుక్సు పెట్టించి వ్రాయించి వారిని శుభ్రమైనవారుగా తయారుచేయడం ఆడటీచర్ల కర్తవ్యమేకదా ?

ఈ బాధలు రచయిత్రిగారి కన్న విద్యార్థినులకే అనుభవంమీద అర్థమౌతాయనుకుంటాను. అందుకే వారు టీచర్సు చెప్పినట్లు చేయడం జరుగుతోంది. ఏదో ఒక సాకుతో మార్కులు తగ్గించడం, పుస్తకాలు గిరవాటు వేయడం, గుడ్డకు డబ్బు గుంజుకోవడం, బీదవాళ్లను, డ్రస్సుకు డబ్బు లేదన్నవాళ్లను తరిమేయడం లాటివి రచయిత్రి దృష్టిలో మాత్రమే ఇవి స్కూల్లో టీచర్సు బోధించే విషయాలు.

అంతేగాక ఆడటీచర్సు గురుస్థానానికి తగరని రచయిత్రి ఉద్దేశ్య మనుకుంటాను. అందరూ సత్యవంతులని, దయామయులని ఎవరూ అనరు. ఎవరో మాటికి ఒకరు అవిడ చెప్పినట్టివా రుండొచ్చు. అంతమాత్రానికే 95% మంది వారే ననటం అతిశయోక్తి, అన్యాయం కూడాను. ఈ చిన్న విషయాన్ని తీసుకొని, విజ్ఞానవంతులు, విద్యావంతులైన సహోదరీమణుల నిట్లు కించపరచడ మనేది అవమానకరమైన విషయము.

డి. జయమ్మ (కావలి)

సానుభూతి

అనవసర విషయాలలో జోక్యం కలుగజేసుకోడంలో మగవాళ్లకన్న ఆడవారే ఒకమెట్టు పైకెక్కేరంటారు. మనని మనం కించపరచుకోకూడదు గాని అది నిజం. "మీ కూతురే అటువంటి పరిస్థితులలో యుంటే ఇలా ఎవరైనా ప్రవర్తిస్తే ....", "ఏదో ఒకనాడు అటువంటి పరిస్థితులలో మనం పడవచ్చునేమో ...." లాటి కొన్ని చక్కటి సూచనలు యిచ్చారు. ఈ వ్యాసం చదివినవారు సానుభూతి చూపటం నేర్చుకుంటారని ఆశిస్తున్నాం. మనిషన్నాక తప్పు చేయడం సహజం, చేసిన తప్పును క్షమించుకోడం నేర్చుకోవాలి.

మరువాడ సూర్యకుమారి (ఖుర్దారోడ్డు)

* * *

'సానుభూతి' కోసం ఎదురుచూసి, లభించనప్పుడు బలిపీఠాని కెక్కిన బలహీనులు ఎందరు లేరు ! కష్టాలతో సతమత మవుతున్న వారిని చూచి సానుభూతి చూపటం మానవధర్మం. కాని, కొందరు సానుభూతి చూపవల్సినది పోయి పరిహసించటానికి ప్రయత్నిస్తారు. ఉప్పులూరి దుర్గాంబగారు 'సానుభూతి' యొక్క అవసరాన్ని చక్కగ వివరించారు.

శ్రీమతి అక్షయపాత్ర రాజేశ్వరి (బెంగుళూరు)

* * *

ప్రతి వ్యక్తికి ఎప్పుడో ఒకప్పుడు తప్పక సానుభూతి అవసర మవుతుంది. కానీ అటువంటప్పుడే సానుభూతి చూపాల్సింది పోయి ఇంకా ఎక్కువగా ఎదుటివారి మనస్సు బాధించేట్లు ప్రవర్తించే వారుంటారు. తప్పులెన్నువారు తమ తప్పులు ఎరుగ రన్నట్లు విమర్శించేవాళ్ళు, తామూ ఒకనాడు ఎవరి సానుభూతి కోసమయినా ఆశిస్తామని గానీ, తమకూ అలాంటి పరిస్థితి తప్పక కలుగుతుందని గానీ అనుకోరు. ఏదైనా ఒక క్లిష్ట పరిస్థితిలో సానుభూతి చూపించేవారిలో బంధువులకన్నా స్నేహితులే ఎక్కువ ఉంటారు. రచయిత్రిగారు చెప్పినట్లు కష్ట పరిస్థితిలో సానుభూతి చూపగలిగి వారి బాధను పోగొట్టగలిగేట్లు ఓదార్పుతో మాట్లాడితే చాలు. వారు తమ స్థితిని మరచిపోవుటకు. విమర్శించేవారు కూడా మనలాగే ఎదటివారికి కూడా ఆత్మాభిమానం ఉంటుందని వారి విమర్శ విని బాధపడుతారని గ్రహించగలిగితే చాలు వారు తప్పక సానుభూతి చూపగలుగుతారు.

పహోర్జనమ్మ, సుమిత్ర (కోట)

సుప్రసిద్ధ ఆసియా కథలు

పాడు బడిన నుయ్యి

లిండా టి. కాస్పర్

[ఈ కథలో మూలభాషలోని మాటలు కొన్ని అలాగే ఉంచబడ్డాయి: 'మబోలో' (చెట్టు దినుసు) 'కారబో' (దున్నపోతు) మొదలయినవి. సందర్భాన్నిబట్టి అర్థం గ్రహించవచ్చు.]

పరుల వశం అయిపోయిన ఆ పొలం అంతా నడిచి చూశాడు మాంగ్ అగుస్తో. ప్రతి అడుగు అతి ప్రయాసతోనే వేశాడు. ఎండ తీక్షణానికి కళ్ళు నొప్పి పుట్టాయి, అతనికి. భుజాలు వంగిపోయాయి; నడుమూ, మోకాళ్ళూ సైతం వంగిపోయాయి. అతని అరవై సంవత్సరాల దేహంలోకి ప్రతి సంవత్సరం వేడి ఇంకిపోయినట్లుంది.

ఈ పొలం తనకి వంశ పరంపరలో రాకముందే వేసిన 'మబోలో', మామిడిచెట్ల తోపుల అవతల మరికొన్ని వరసలు పాములాగ పచ్చగా మెరుస్తున్నాయి. పొలాలగట్ల తర్వాత నేల కుంగిపోయి నదిలోకి ఒరిగిపోయింది. గాలివడకకి అరిగి, ఎండకి తెల్లగా ఎండిన బాటలు నేలలోనుంచి తిరిగి తిరిగి, అక్కడక్కడ మాయం అయిపోయి, మళ్ళీ చెట్ల తోపులలో కనిపించేవి.

ఆపుకోలేక, అమాంతంగా అనేశాడు:

"ఇంటికి వచ్చేస్తున్నాను !" అతని ఇల్లు ఎక్కడో అతనికే తెలియదు. ఎప్పుడో చూసిన ట్లున్న ఒక సమాధి అవవచ్చు (తను చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు వేడెక్కిన 'కారబోల' మీద నీరు చిలకరించిన నది మరోసారి అతని కళ్ళ ముందే ప్రవహించినట్లయింది.)

మెల్లిగా నడుచుకుంటూ, అడుగులు లెక్క వేస్తూ ముందుకి సాగిపోయాడు. నేలని కొలత వేస్తున్నట్లుంది అతని వాలకం. తన పళ్ళ భారానికి గర్భిణివలె వంగి పోయినట్లు కనిపించింది ఒక జామచెట్టు—బాగా పండిపోయిన దానిని ఒకటి కోసి, చేతులతోనే చిదిమి, నోట్లో వేసుకున్నాడు. పళ్ళులేని చిగుళ్ళతో నములటం ప్రారంభించాడు. మొదట కోపంతో చెట్లన్నిటినీ నరికి పారెయ్యా లనుకున్నాడు కాని, చెయ్యి ఎత్తలేకపోయాడు. ఆ ఘోరకృత్యం ఇతరుల చేతుల మీదుగానే జరగనీ అనుకున్నాడు.

అసలు ఈ గడ్డ ఇంకెన్ని రోజులు బ్రతుకుతుంది? అనుకున్నా ముందే ఎండిపోయి, చనిపోతుంది.

ఆకారం మాసిపోయి, చెట్లు, చీమలపుట్టలు సైతం నేలమట్ట మయిపోతాయి. వాటి స్థానంలో 'పలే' మొక్కలు నాటినట్లు, వరసలు వరసలుగా ఇళ్ళు కట్టేస్తారు. సున్నం రాయి మిగల్చకుండా కొట్టుకుపోతారు. నేలని పూర్తిగా మట్టం చేసేస్తారు. నది పక్కనే ఉంది కాబట్టి—అక్కడ 'సేపా' తమ బట్టలు ఉతకటం ఆగిపోతుంది—దానిని 'రివర్‌సైడ్ పార్క్' అంటారు.

అంతా మారిపోతుంది, తను వారానికి ఒకసారి బస్తీలోకి పోయి కాన్వెంట్‌వారికి పాలు సరఫరా చేసేవాడు. జాగ్రత్తగా ప్రతి సీసా బిరడాని సర్ది స్వయంగా ఫాదరీకి ఇచ్చొచ్చేవాడు. ఇక పైన తను బస్తీలోనే ఉండిపోవాలి. తన కోడలితో బ్రతకాలి. ఈమెకి మెల్లకన్ను, తనని చూస్తే ఎప్పుడూ విసుగు. కాని, సేపా పండించిన పళ్ళు, కూరగాయలు తీసుకొనటానికి మాత్రం సిద్ధం! సంతలో చేపల బుట్ట దగ్గర సేపా కూర్చుంటాడు. ఇకపైదట—బేరానికి వచ్చినవారు చేపలని వేళ్ళతో చిదిమి, చెడగొట్టి వెళ్ళిపోతారు. లేదా ఒక చిన్న గుడిసెలో పడేస్తారు. ఇది మరీ చిన్నదిగా ఉంటుంది. పక్క ఇళ్ళ కంపు అంతా తన పూపిరితిత్తులని నింపేస్తుంది.

మాంగ్ అగుస్తోకి తన భార్య జ్ఞాపకం వచ్చింది. ఇప్పుడు ఆమె వయస్సు ముదిరి నోరంతా వదులుగా వేళ్ళాడుతోంది. చేతులు చెట్ల వేళ్ళలా ఎండిపోయాయి. అయినా 'పేము' తక్కెడ నిండా బియ్యం పోసుకుని, తిరిగిపోయిన వేళ్ళతో రాళ్ళు ఏరుదామని ప్రయత్నిస్తుంది. ధాన్యంలో పూకని తీసి పారెయ్యటానికి ప్రయత్నిస్తుంది. చేతులు తమ క్రమం తప్పి ధాన్యం ఏమయినా రాలుతుందేమో అని కోడిపిల్లలు ఆమె చుట్టూ తిరుగుతూ ఉంటాయి. నిజంగా ఆమెని తలుచుకుంటే జాలివేస్తుంది. ఇంతకుముందు కొన్ని సంవత్సరాలముందే కదా, సేపా, నెత్తిమీద బుట్ట పెట్టుకుని చక్కగా పొలంగట్లమీద నడిచి వెడుతూ ఉండేది. ఆమె బుగ్గలు నిండుగా మెరిసిపోతూ ఉండేవి. 'పలే' దంచేటప్పుడు ఆమె తల గర్వంగా పైకి ఎత్తిపట్టుకునేది. 'పినోరా' లాగ. ఇప్పుడేమో తమ జీవితమంతా ముసలివాళ్ళగానే గడిపినా అన్నట్లుంది. తను తొడుక్కున్న లాగూ కాళ్ళకి బాగా వదులు అయిపోయింది. అసలు సేపా పిల్లలకి ఎప్పుడయినా పాలు ఇచ్చిందా అని సందేహం కలుగుతోంది. ఎప్పుడయినా 'చీమ పుట్టలో మనిషి' ని తన బిడ్డని తీసుకుపోవద్దని పాడుతుందా అనిపిస్తుంది. పెరుగుతున్న తన కడుపు మీద చెయ్యి వేసుకుని ఎండలో నుంచున్నదా ఎప్పుడయినా అసలు? ఇప్పుడు ఆమె ఎముకల గూడుమీద చర్మం వస్త్రం వలె వదులు వదులుగా వేళ్ళాడుతోంది.

పాడుబడిన నుయ్యి ముందు ఆగాడు. కొంచెం ప్రొద్దెక్కినదేమో 'దుహల్' చెట్టు నీడలు దాని మీద విచిత్రంగా పడుతున్నాయి. ఒకసారి ఆవు దూడ కట్లు తెంపుకుని వచ్చి అందులో పడిపోయింది. చాలారోజుల తర్వాత, అది చనిపోయి దుర్వాసన వెలువడిన తర్వాతనే తను చూశాడు. దానిని పూడ్చటం అనవసరం. ఆ చుట్టుపక్కల వారందరికీ అది ఎక్కడో తెలుసు. సేపా మాత్రం దానిని చూస్తే భయపడేది. చీమ పుట్టలు ఎంత ప్రమాదకరమో అంత ప్రమాదకరం అనేది.

అక్కడినుంచి 'విజిటా' దగ్గరకి వెళ్ళాడు. ఇక్కడే సంవత్సరానికి ఒకసారి 'ఫాదరీ' వచ్చి 'మాస్' చెప్పి పిల్లలని 'బాప్టయిజ్' చేసి వెళ్ళేవాడు. పిల్లలలో కొంచెం ఎదిగినవారికి 'కాన్ఫెషన్' ఇప్పించేవారు. ఈ జాబితా వ్రాసే పొట్టి మనిషిని చూసి వెకిలిపడేవారు. 'విజిటా' చాలా అశుభ్రంగా ఉంటుంది. ఎక్కడ చూసినా దుమ్ము, కోడిపిల్లల రెట్టలు. సేపా పెట్టెలో ఒక 'శాన్ యాంటోనియో' (ఏంటోనీ సెయింట్ ప్రతిమ) ఉంది. ఇది ముదురు జేగురు రంగులో ఉంటుంది. కడిగి, కడిగి బాగా మెరుగు వచ్చింది. దానిని శుభ్రం చెయ్యటానికి బయటికి తీసినప్పుడల్లా పిల్లలు ఏడిచేవారు—అది 'చీమలపుట్ట మనిషి' అని వారి భయం.

సేపాతో అతని పెళ్ళి బస్తీలో జరిగింది. మేయర్ పెళ్ళి పెద్ద—అతనికి తన తండ్రి కోడి పుంజాలు కొన్ని ఇచ్చాడు. గంటలు మ్రోగించేందుకు డబ్బు లేదని తన తమ్ముడు చాలా బాధపడ్డాడు. రుసుము చెల్లించనిదే చర్చిలో మనిషి (సాక్రిస్టాన్) గంట వాయించనివ్వడు. అయినా వారు అతిగా కంగారుపడలేదు. మొత్తానికి రోజంతా సంతోషంగానే గడిచింది. చిన్న బండుతో పొలానికి తిరిగి వెళ్ళిపోయారు. పొలంగట్ల మీద వేగంగా పరుగెత్తారు.

నది నీరు తగ్గిపోయి ఇసుకలో పండిన 'ఖర్బుజా' పళ్ళు దొరకవచ్చునని ఇంకా ముందుకి సాగిపోయాడు. కాని తీరా చూసేసరికి పచ్చిగానే ఉన్నాయి, వేరుశనగలు సైతం ఆకులు దట్టంగా

పాడుబడిన నుయ్యి

చిగిర్చి ఉన్నాయి. నదీప్రవాహం మందంగా ఉంది. సన్నని, తెల్లటి ఇసుకమీద సూర్యరశ్మి ప్రతిబింబించి కళ్ళు చెదరిపోయేట్లు చేస్తోంది.

చూపు మరల్చి, సున్నపురాతిలో తను చెక్కిన 'బాట' మీదుగా మెట్టమీదికి ఎక్కి వెళ్ళిపోయాడు. ఎక్కేటప్పుడు చిన్న చిన్న మొక్కలని ఆధారంగా పట్టుకుని మరీ ఎక్కవలసి వచ్చింది. కోతలు ఇప్పు డప్పుడే జరుగవు. బలం లేక అడ్డంగా మాంగ్ తెరియో పొలంలో నుంచి నడిచి వెళ్ళ నిశ్చయించుకున్నాడు. ఇద్దరూ తమ కొడుకులని యుద్ధంలో కోల్పోయారు.

మాంగ్‌తెరియో తన 'కారబో' ని మామిడి చెట్టుకింద కట్టేస్తున్నాడు.

"దూడకి పాలు వదులుతున్నావా ?" అని అడిగాడు.

ఏం చెయ్యను ? ఎలాగూ మధ్యాహ్నం అమ్మతాను. అన్నీ చచ్చిపోయే ముందు ఈ దూడ దాని తల్లిపాలు తాగనిచ్చినా మంచిదే కదా !"

"సేన ఎలా ఉంది ?"

"ఏమీ బాగాలేదు. ఏడుస్తూనే ఉంది. పొద్దున్నే లేచి మొక్కలన్నీ పెరికేసింది .... వాటిని ఎంత శ్రద్ధగా పెంచిందో నీకు తెలుసు. 'బీన్స్' తీగలని జల్లెడ మీదకి ఎక్కించింది, ప్రతి పండుకీ ఒక సంచీ కట్టింది..... నేలంతా కాల్చిపారేద్దామని ఉంది. ఏం, కాలిస్తే ?" మాంగ్ తెరియో కత్తితో మామిడిచెట్టు మొదలుమీద కొట్టాడు. "నేలనంతా తవ్వేస్తారుగా !"

మాంగ్ అగుస్తో చుట్టూ చూశాడు. "ఏమీ మిగలదు" అనుకున్నాడు. తను ఒకప్పుడు అక్కడ ఉన్నాడని ఎవరికి తెలుస్తుంది ? అసలు తను బ్రతికింది కూడా ఎవరికీ తెలియదేమో ! ఇప్పుడు రాళ్ళు సైతం విలువ కలవిగా కనిపించాయి. వాటిని ఏరుదామా అనుకున్నాడు. వాటినే కదా తను ఒకప్పుడు పిట్టలమీద విసిరేవాడు ? వాటినేగా సేపా నది ఒడ్డు దగ్గరనుంచి ఏరి తీసుకువచ్చి ఇంటిముందు అందంగా దారిమీద వేయించింది ?

"నీ అబ్బాయితో ఉంటావా ?" మాంగ్ తెరియో అడిగాడు. "కసాయి శాలలో ఉద్యోగం ఖాయం చేశారా ?"

"దానితోనే కుటుంబం గడుస్తోంది. మమ్మల్ని వచ్చి ఉండమన్నాడు కాని .... " తన మెల్లకన్ను కోడలు ఇంట్లో ఖాళీ లేదన్నదన్న సంగతి చెప్పటం ఇష్టంలేక ఊరుకున్నాడు. చనిపోవటానికి ఒక చిన్న స్థలం ఉంటే చాలు తనకి ఇప్పుడు. ఒక విధంగా ఇదీ మంచిదే, తను వచ్చినప్పుడెల్లా కోడలు ఆహార వస్తువులు దాచివేసేది.

"పన్నులు వసూలుచేసేవాడితో మరికొంచెం గడువు కావాలని అడిగితే బావుంటుందా? అప్పుడు భూమి మనదే అనే ఆధారం ఉంటుంది" అన్నాడు మాంగ్ తెరియో కొంచెం ఆశతో. చేతితో మెడ వెనుకభాగం రాసుకున్నాడు.

"వాడు గవర్నర్ పంపినవాడు కాడు మోసగాడు!"

"అంతేనా ? ఆశ లేదంటావా ?" అని అడిగాడు మాంగ్ తెరియో. "మనదే తప్పు. వాడిని నమ్మి ఉండకూడదు. వాడెలాగూ ఆమాటే అంటాడు. మన్ని మనమే మోసం చేసుకున్నామంటాడు."

"ఒక హెక్టారెకి 20 పెసోలు ఇస్తా నన్నారు. మా నాన్నకి 40 హెక్టారెలు ఉండేవి. దాన్ని చుట్టి రావాలంటే డేగ పక్షికే గంటసేపయ్యేది. మాంగ్ ఇంటాంగ్ 'కసావా' పొలం నుంచి 'రోడ్డు' దాకా ఉంటుంది. ఇంకా ఎక్కువే ఉండేమో కాని నాకేమి తెలుసు ?"

"హెక్టారెకి ఇరవై. అంటే భాగాలుగా చేసి ఒక చదరపు మీటర్‌కి 20 చొప్పున అమ్మి, నాలుగ లక్షల చదరపు మీటర్లకి ....." మాంగ్ తెరియో బాధగా తల ఆడించాడు.

మాంగ్ అగుస్తో తల ఊపాడు. వారి వంత మరీ తక్కువగా ఉంటుంది.

"కాని ఏజంటు ఏమన్నాడూ ? ఇది భూమి ధర కాదు, తన యజమాని దయ అన్నాడు. దానితో ఇంకెక్కడో మళ్లీ మొదలు పెట్టాలిట. "అక్కడా తయారవుతాడు ! ఇందులో పెద్ద భాగం ప్రభుత్వానికి ఊరికే ఇస్తారు రోడ్డు వేస్తారుట. ప్రభుత్వంవారు ఏదో ముట్ట చెప్పకుండా ఉండరు. మన భూమిని దానం చెయ్యటానికేం ?"

మాంగ్‌తెరియోనములుతున్నవక్కపొడిఉమ్మివేశాడు.

భానుమూర్తి : "ఈ ప్రచురణకర్తలంతా నామీద కుట్ర పన్నుతున్నట్లున్నారోయ్!"

రామనాథం : ఎందుకని ?

భా॥ మూ॥ "పదిమంది ప్రచురణకర్తలూ ఒకే కథను త్రిప్పి పంపితే ఏమనుకోవాలేం?"

మాంగ్ అగస్తో ఈ వేళాకోళంలో పాల్గొనకుండా తనకిచ్చే డబ్బుతో చిన్న భూభాగం కొనుక్కుంటే బాగుంటుందని ఆలోచిస్తున్నాడు. వెంటనే అతనిలో నిరాశ కొంచెం తగ్గుముఖం పట్టింది. నది అవతల చిన్న పొలం వేస్తే ? కొండల దగ్గరగా ! తన మెల్లకన్ను కోడలి దగ్గర ఉండనవసరం లేదు. విత్తనం నాటడంలో కొత్త పద్ధతులు మొదలు పెడతాడు తను. ఎడం, ఎడంగా మరీ లోతుగా కాకుండా నాటుతాడు. తనకి బలం తగ్గిపోయింది కాబట్టి చిన్న పొలమే వేసుకుంటాడు. 'ఇసిల్' చెట్లు వేస్తే గాలికి మంచి అడ్డుగా ఉంటాయి. పెద్ద, తెల్లని ముల్లంగి దుంపలు, నదిలో కర్బూజా పళ్ళు ! సేపా సంతోషిస్తుంది. ఇంటివెనుక వెదురు పొదలు కొన్ని ఉన్నాయి. వీటిని కోసి, వానలు మొదలయ్యే లోపుగా, ఇల్లు వేసుకోవచ్చు. ఇలా చిన్న చిన్న విషయాలను గురించి ఆలోచిస్తూ ఉండిపోయాడు. మనస్సులోని ఆందోళన కొంచెం తగ్గినట్లయింది.

"ఇది 'రివర్‌సైడ్' అయిపోతుందని ఆ ఏజంటు చెప్పాడు. నది అవతలవైపు 'హిల్‌సైడు' అవుతుందిట. నేనే ఒక చిన్న స్థలం కొందామనుకుంటే వాడు ఒప్పుకోలేదు. ఇళ్ళకి హోదా ఉండాలిట ! వాడి భూమి ఎంత ఉంటుంది ? నది, పాడు గూతా రాష్ట్రమంతా ! ప్రెసిడెంటుతో భోజనానికి కూర్చుంటాడుట, ఒక బాంకు, విశ్వవిద్యాలయం సొంతంవిట !"

సేపాకి చెప్పేముందుగానే కల కరిగిపోయింది. మాంగ్ అగుస్తో ఇంటివైపు తిరిగాడు. ఎవరో తరుముతున్నట్లు అనిపించింది. ఏమి ఏర్పాట్లు చేసుకోగలడు ? రాక్షసిని కదిపినట్లే కదా ? అసలు పుట్టకుండా ఉంటే బాగుండేది.

సూర్యుడు నది అవతలి వైపుకి పోయాడు. సేపా, ఉడకబెట్టిన కూరగాయలతో, ఉప్పు చల్లిన చేపలతో సిద్ధంగా ఉండి ఉంటుంది. ఎప్పుడయినా ఏదో పిట్ట గుడ్లు 'వినెగర్' లో ఊరగాయ వేసి తినేవారు. భోజనం సంగతి తలచుకున్నా ఆకలి వెయ్యలేదు. ఏదో చెయ్యాలి అనిపించింది. కోపం తీరక సేపా మనస్సు గాయపరచటానికి ప్రయత్నించేవాడు. ఇప్పుడు, తన మనస్సే గాయపడింది. ఆమెతో నెమ్మదిగా ప్రవర్తించాలి అనుకున్నాడు. ముందు ఎలాగయినా కోపం తీర్చుకోవాలి కదా !

వేసే ప్రతి అంగకీ బాగా ఊపిరి పీల్చి తను ఇంకా బలంగా, వయస్సులో ఉన్నానని తనకి తనే చెప్పుకోపోయాడు. భుజాలు పైకి ఎత్తిపట్టాడు. గూడులో ఎముకలు పైకి లేచి బాధ కలిగించాయి. లాభంలేదు ! తను ముసలివాడు. రక్షణ లేనివాడు. ఎండ వేడి కూడా భరించలేక పోతున్నాడు. నుదురు రుద్దుకున్నాడు..

నేల కాల్చలేకపోతే నేమి ? మట్టంగా చేసి వేస్తాడు. కత్తి తీసి గాలిని చీల్చాడు. ముందు 'దుహల్' చెట్టుని నరుకుతాడు. తర్వాత ఇంటి దాకా ఏది వస్తే అది బాధ, విచారం, కలిసిపోయి ఆవేశంతో చెట్టుని కొట్టాడు. మొదలులో కత్తి దిగలేదు. శరీరం ఉండగట్టుకని మళ్లీ మళ్లీ కొట్టాడు, బెరడుమీద ఉలుతున్న విషయం కూడా గమనించకుండా.కోపంతోవళ్ళు వక్రం అయిపోయింది.

"ఆగు ! చెట్టు నీదికాదు !" ఏజెంటు దూరంగా నించుని అన్నాడు. అతని పెద్ద గుండ్రని కళ్ళజోడు మీద ఎండ మెరిసింది.

మాంగ్ అగుస్తో తిరిగాడు. ఆ పాడి కంఠస్వరం అతన్ని తగ్గించివేసింది. ఏదో ఎదిరించి చెబుదా మనుకున్నాడు కాని, గొంతుక బిగుసుకుపోయింది. ఆత్మరక్షణ కోసం అన్నట్లు కత్తిని పైకి ఎత్తాడు. కాని, దానితో వేటు వేద్దామని మాత్రం కాదు.

ఏజంటు పోలీసులని పిలుస్తానని బెదిరించాడు. స్పానిష్‌లో, ఇంగ్లీషులో తిట్టాడు.

మాంగ్ అగుస్తో ఆగాడు. ఏజంటుకీ, పాడుపడిన నూతికీ దూరం అంచనా వేశాడు. తను చిన్నప్పుడు, జింకలనీ, అడవి పందులనీ వేటాడి గోతులలోకి దింపాడు. గుండె దడదడ కొట్టుకుంటూ ఉండగా ముందుకి జరిగాడు. గడసరి తనం అమాంతం హెచ్చు అయింది.

ఏజంటు పరుగెత్తటం మొదలుపెట్టాడు. కాని, మరీ ఎడమవైపుగా పరిగెత్తాడు. మాంగ్ అగుస్తో దీన్ని సరిచేశాడు. ఇటు, అటూ అడ్డంగా జరుగుతూనే నేరుగా నూతివైపుకి తరిమాడు.

తర్వాత మాంగ్ అగుస్తో నిరుపయోగమయిన కత్తిని దింపాడు. దుహల్ చెట్టు నీడ అంచుమీద నుంచున్నాడు. పాడుపడిన నూతిమీద దుమ్ము, ఎండుటాకులు తేలుతున్నాయి. అవి నెమ్మదిగా కిందికి దిగిపోయాయి. చివరిదాకా చూసి, పీలయినంత వీటారుగా మంచుని ఇంటి ముఖం పట్టాడు. ★

కథ కాని కథలు

వెటరినరియా మెటర్నిటీయా !

ప్రతి ఎండాకాలం సెలవులకు మా మేనమామ వూరికి వెళ్ళడం మాకు అలవాటు. ఈ యేడు కూడా మామూలుగా మేనమామ వూరికి వెళ్ళాము. వాళ్ళింట్లో ఒక కుక్క వుంది. అది చాలా ముద్దుగా వుంటుంది. మా మామకు బిడ్డలు లేరు గనుక ఆ కుక్కను ప్రాణ సమానంగా చూచుకొనేవారు. యిలా వుండగా ఒకరోజు ఆ కుక్కకు జబ్బు చేసింది. మా మామకు ఏమీ తోచక పక్కింటి వకీలుగారిని అడిగి దగ్గర్లో ఎక్కడైనా వెటరినరి ఆసుపత్రి వున్నదేమో తెలుసుకోరమ్మని నన్ను పంపించారు. నేను వకీలు గారిని కలుసుకొని దగ్గర్లో ఎక్కడైనా వెటరినరి ఆసుపత్రి వున్నదాండీ మా మామ తెలుసుకోరమ్మన్నారని అడిగాను. తను వచ్చి మాట్లాడుతానని నన్ను వెళ్ళమన్నారు. కాసేపటికి వకీలుగారు మా యింటికి వచ్చి రావడంతోటే "కంగ్రాచులేషన్స్" మీరు తండ్రి గాబోతున్నారని తెలిసి చాలా సంతోషమయిందంటూ మామతో కరచాలనం చేశారు. మా మామ అదిరిపోయి నావంక చూచి 'అసలేమని అడిగావే' అని అడిగారు. నేను అడిగిన విధం గురించి చెప్పను తర్వాత వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుకొని యింటికప్పు ఎగిరేటట్లు గట్టిగా నవ్వసాగారు. నాకేమీ అర్థంగాక వాళ్ళ మొహాలు చూస్తూ వుండిపోయినాను. తర్వాత కాసేపటికి అసలు సంగతి బయట పడింది ఏమిటంటే ఆ వకీలుగారికి చెవులు సరిగా వినపడవట. నేను వెటరినరి ఆసుపత్రి గురించి అడిగితే ఆయనకు మెటర్నిటి ఆసుపత్రి అని వినపడిందట. అందరం పొట్టలు చెక్కలయ్యేటట్లు నవ్వుకొన్నాం.

బి. ఎన్. భారతి, (ఆగ్రా)

* * *

ముందు జాగ్రత్త

మా అమ్మాయి ఉంది 6 సంవత్సరాల పిల్ల, దానికి డ్యాన్సు నేర్పుతున్నాము. స్కూల్‌నుంచి రాగానే మాష్టరు వస్తారు, సాయంత్రం. దీనికి విసుగ్గా వుండేది; ఆడుకోకుండా ఇదొక గొడవ నాకు అని. ఒకనాడు ఆవిడ ఇది పాఠం సరిగ్గా ఒప్పచెప్పకపోతే కోప్పడి "ఇదో ఉమా! రేపు పాఠం సరిగా చేయకపోతే పాతిక గుంజీలుతీయిస్తా"నందిట. పొద్దున్నే లేచి ఇది గుంజీలు తీస్తోంది! మొదట ఇదే ఒక డ్యాన్సు కాబోలనుకున్నాను. ఎంతసేపటికి ఇది అల్లాగే గుంజీలు తీస్తుంటే ఉండబట్టక "ఇదేమి డాన్సే?" అని అడిగాను. "మాస్టారు పాఠం రాపోతే గుంజీలు తీయిస్తానన్నారు. అందుకని ప్రాక్టీసు చేస్తున్నా కష్టం లేకుండా" అంది ఈ మాట విని చచ్చేట్లు నవ్వారు మాష్టరుగారు, 'మీ అమ్మాయితో ఏమి చెప్పినా తంటా కదా!' అని.

వి. లలిత (గుంటూరు)


* * *

"పుణ్యానికి పోతే...."

మా స్నేహితుడు, నేను నెలరోజుల క్రితము తెనాలి వెళ్ళామని రైలెక్కినాము. మే మెక్కిన కంపార్టుమెంటులోనే ఒక సాహెబుగారు దోసలి పట్టి 'అల్లా! అల్లా!' అంటున్నాడు. పాపం బిచ్చగాడేమో ననుకుని నేను ఐదు నయాపైసల బిళ్లా అతని చేతిలో వేసినాను. అంతే యిక చూసుకోండి ఆ సాహెబుగారు ఇంతెత్తై కొండంతై మమ్ము నానా మాటలు అన్నాడు. మేము ఆశ్చర్యపోయాం దానంచేస్తే తిడతాడేమని. అసలు విషయ మేమంటే ఆ సాయిబుగారు సాయంత్రం కావడమువల్ల నమాజు చదువుకుంటున్నారట. మాకు నవ్వాలో ఏడవాలో తెలియలేదంటే నమ్మండి.

దుడకా యోగానందరావు, (బాపట్ల)





జరిగిన కథ

జానకరామయ్య రిటైర్డైన బడిపంతులు. ఆయనకు నిరంజనం, శంకరం, సుశీల అని ముగ్గురు సంతానం. శంకరం కాకినాడలో రంగారావు దంపతుల ఆతిథ్యం పుచ్చుకుంటాడు. నిరంజనం పంపిన సొమ్ము చూసి సంతోష పడతాడు జానకిరామయ్య.

3

రంగారావ్ కేంప్ కెళ్ళేడు.

శంకరం ఇరుకున పడ్డాడు. సుజాతతో మనసు విప్పుకు మాటాడటానికి భయపడుతున్నాడు. ఆమె ఒక పట్టాన అతనికి అర్థం కావడంలేదు. ఆమె చనువు అతని కిబ్బందిగా తయారయ్యింది. దానికి తగ్గట్టు ఆమెలో ఏదో మార్పు వచ్చినట్టు గమనించాడు. మళ్ళా అంతలోకి అపార్థం చేసుకుంటున్నానేమోనని విచారించేవాడు. అంతా అవ్యక్తంగా ఉంది. సమయానికి రంగారావ్ ఊళ్ళో లేకపోవడ మయ్యింది. మరి మూడు రోజులు ఎలా గడిపేది?

ఉద్యోగంకోసం వచ్చినవారు ఉద్యోగం వేయించే వాడి ఇష్టానుసారంగా నడి ఉండటం పద్ధతి. వాడు రావాలి, ఆఫీసరుకి నచ్చజెప్పాలి, ఆనక ఉద్యోగం వేయించాలి.

అన్నయ్య హోదాలో ఉన్నమాట నిజమే. తనతో పుట్టినవాడు ఉద్యోగం లేకుండా తిరుగుతున్నాడే, వాడికో దారంటూ చూపించే పూచీ నాది గదా అనే ఇంగితం వాడికుండాలిగాని మరి. 'నాకుద్యోగం కావాలి' అని నోరు తెరిచి అడిగిన తర్వాత 'నా వల్ల కాదురా తమ్ముడూ' అని జాలి చూపిస్తే ఎంత అవమానం.

తనకున్న హోదాతో ఒకడికి భుక్తి జరిగేందుకు అవసరమైన ఉద్యోగం వేయించడం బ్రహ్మ విద్యేమీ కాదు.

తన పట్ల వాళ్ళు గూడా సుముఖంగా ఉంటున్నారు. ఆయనకి తీసు కుట్టినంత బాధైనా అనిపించడం లేదు కాబోలు!

అయినా ఆయనేం చెయ్యగలరు? రిటైర్డైన బడిపంతులు. తను సంపాయించుకున్న పరపతి నుపయోగించి ఉద్యోగం వేయించడం అనుకున్నంత తేలిక పనికాదు.

శంకరం సిగరెట్టు ముట్టించాడు.

గది దగ్గర శబ్దమైతే, తొంగి చూసేడు. సుజాత మరో ఇద్దరు ఆడ పిల్లల్ని వెంట బెట్టుకు వచ్చింది. వచ్చీ రావడంతోనే—

"పిల్లిద్దరూ నా స్నేహితురాళ్ళు. ఈవిడ సుభద్ర, ఈవిడ సత్యవతి. బి. ఏ. వరకూ చదువుకున్నారు. కథలు రాయాలనే కోరిక చాలా ఉంది. ప్రస్తుతం వ్యాసాలూ వగైరా వ్రాస్తున్నారు. ఈయనే శంకరం గారు" ఒకర్నొకరికి పరిచయం చేసింది.

పరిచయమైన ఆ ఇద్దరూ సుజాతతోపాటూ చాలా ప్రశ్నలు వేశారు. కథల గురించీ, వివిధ కథకుల గురించీ అతని అభిప్రాయాలు అడిగారు.

సిగ్గు పడుతూనే తెలిసినంతవరకూ చెప్పాడు. ఆ తర్వాత కేవలం అతని కథల గురించి అతని అభిప్రాయాలు అడిగి వాళ్ళ అభిప్రాయాలు చెప్పారు. ఇక్కడ మాత్రం శంకరం చాలా ఇబ్బంది పడిపోయాడు. అవునూ కాదని ఏది చెప్పినా తంటాగా కనిపించవచ్చు.

సత్యవతి అడిగింది—

"అవుతే మీరు ఇక్కడే ఉంటారన్నమాట"

"అని వేరే చెప్పాలా. అంతా విన్నావుగా" అన్నది సుజాత.

"నా దగ్గర రెండు కథలున్నాయి. రేపు పట్టుకొస్తాను. వీలుంటే చదివి మీ అభిప్రాయం చెప్తారు గదూ?"

"తీసుకు రారాదూ" సుజాతే సమాధానం చెప్పింది.

మరికొంతసేపు తన ప్రసక్తి లేకుండానే నేటి సాహిత్యమూ ముఖ్యంగా కథలూ వాటి కమామీషు గురించి ముగ్గురు వనితలూ చర్చించి, ముగించి—వెళ్ళేముందు రేపు తీసుకురాబోయే కథను గురించి మరొక్కమాటు జ్ఞాపకంచేసి మరీ వెళ్ళారు.

సుజాత వాళ్ళని సాగనంపటానికి వీధిగుమ్మం వరకూ వెళ్ళింది. గుమ్మం వరకూ వెళ్ళారన్న మాటేగాని, అక్కడే ఆగిపోయి ఇంకా ఏవో విషయాలు మాటాడుతూనే ఉన్నారు.

శంకరానికి నవ్వు వచ్చింది.

వచ్చిన వాళ్ళు పరిచయమైన మరుక్షణమే కథల గురించి లొడలొడా మాటాడేశారు. రంగారావ్ అన్నట్టు ఈ రోజుల్లో ఆడవాళ్ళే కథలంటే ప్రాణం పెడుతున్నట్టు కనుపిస్తుంది. రేపు తన అభిప్రాయం కొరకు కథలు గూడా పట్టుకొస్తారుట.

ఇది తలుచుకుంటూంటే ఒక చిన్న సంఘటన గుర్తుకు వచ్చింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఒకానొక ప్రముఖ రచయిత (పేరూ, దేశం గుర్తు లేవు. చెప్పిన మనిషీ జ్ఞాపకానికి రావడం లేదు) మరో దేశస్థులు ఆహ్వానం పంపుతే వెళ్ళాడు. ఘనమైన స్వాగతాలూ, శుభాకాంక్షలూ వగైరాలూ స్వీకరించేడు. తన పట్ల ఇంతమందికి గల గౌరవ భావాన్ని గమనించి మురిసిపోయేడు. అప్పట్లో తన దేశం యుద్ధ భీతిలో చిక్కుకుని ఉంది. అక్కడ ఆ వాతావరణాన్ని వదిలి దూరంగా ఇక్కడ ఈ గౌరవ మర్యాదలూ పొందుతూ తనని తనే పూర్తిగా మరిచిపోయేట్టు ఆ మహా రచయిత. ఒకనాడు—ఒకానొక రచయితల మహా సంఘం ఆహ్వానంమీద అక్కడ సభలకి వెళ్ళేడు. గంటా గంటన్నరపాటు ఏవో ఉపన్యాసాలు జరిగాయట. అవి ముగిసిన తర్వాత— ప్రారంభమైందిట చిన్న సైజు యుద్ధం! ఒక్కొక్కరు రావడం, తను రాసిన మహా గ్రంథాన్ని ఆ మహా రచయితముందు పెట్టడం, ఈ దేశం ఒదిలి వెళ్ళేలోగా చదివి తమ అమూల్యాభిప్రాయం ఇచ్చి వెళ్ళవలసిందిగా కోరడం—ఇలా వందమందికి పైగా తమ గ్రంథాల్ని ఆయన ముందుంచారు. ఇదంతా చూచిన ఆ మహా రచయితకి పిచ్చెత్తినట్టయింది. ఏమని చెప్పాలో తెలీక బిక్కమొహం పెట్టి అనుకున్నాట్ట "నా దేశంలో, నా గదిలో కూర్చునుంటె ఏదో బాంబు లాంటి ఆయుధం నా ప్రాణాన్ని తీసి ఉండేది. నిశ్చింతగా కన్నుమూసి ఉండేవాడిని. ఎరక్కపోయి ఈ దేశం వచ్చి ఈ బోన్లో చిక్కుకున్నాను. చిత్రహింస ప్రారంభమయ్యింది. ఆ యుద్ధం కంటె ఈ యుద్ధమే మహా భీభత్సంగా ఉన్నది సుమా!" అని.

ఇది తలుచుకుని మళ్ళా ఓ మాటు నవ్వుకున్నాడు శంకరం.

పోలికచేసి చెప్పడం కాదుగాని, తరచూ కథలు రాసే వాళ్ళతో, కథలు రాయబోయే, కాబోయే కథకులు పరిచయమైతే—అవతలి కథకుడి పాట్లు

ప్ప నలవికాదు. ఏది చెప్పినా చిక్కేను. పెడా ర్ధాలు తీసి 'గర్వపోతు', 'అబ్బో అతనా', 'ఆయన గారి పలుకే బంగారం కాదుటండీ', 'నాలుగు కథలు రాస్తే, ఇహ పెద్దాడై పోయినట్టేనా', 'ఏం చూచుకునో ఈ మిడిసిపాటు' ఇలా ప్రచారం మొదలపుతుంది.

తను రాసిన కథ పట్టుకొచ్చి మొహాన్న కొట్టి చదవమని ప్రాణం తీసేంతవరకే అవతలివాడి వంతు కథ ఓపిగ్గా చదివి ఎలాటి అభిప్రాయం ఇస్తే ఎలాటి చిక్కు లొస్తాయిరా భగవంతుడా అని దిగులు పడటం కథకుడి వంతు.

ఎవరో కొందరదృష్టవంతుల మినహా, చాలా మంది ఈ 'హింస'లో ఇరుకున్న వాళ్ళేమరి.

"ఏమిటో దీక్షగా ఆలోచిస్తున్నారూ" అన్నది సుజాత తన ముందున్న కుర్చీలో కూర్చుంటూ.

"ఏమీలేదు"

"మా వాళ్ళు మీకు విసుగు ఇస్తున్నారు కాబోలు"

"లేదండి"

"మీ కంత మోడస్టీ పనికిరాదు. విసుగు పుట్టి నప్పుడు చెప్పేయడం మంచిది"



"..............

"సరే.....ఇక నేను విసిగించడం మొదలు పెడుతున్నాను కాబోలు"

"ఎందు కలా అనుకుంటారూ?"

"అన్నట్టు— ఇవ్వాళిటి ప్రోగ్రాం ఏమైనా ఆలోచించారా?"

"ప్రోగ్రామా?"

"అవును. మిమ్మల్ని ఇంట్లో కట్టేసి ఉంచుతే రేప్పొద్దున ఆయనొచ్చి ఎంత మండిపడి పోతారో తెలుసా? అదిగాక, ఆయన లేరనే వెలితి కనిపించనే కూడదు."

శంకరం నవ్వి ఊరుకున్నాడు.

"ఇవ్వాళ మా మహిళా సమాజంవాళ్ళు ఏదో మీటింగొహటి పెట్టారు. ఈ విషయం చెప్పటానికే వీళ్ళు వచ్చింది. కానీ—'అమ్మాయిలూ ఈవేళ నే రాదలుచుకోలేదూ' అని చెప్పేశాను."

"అరె......"

"అవునండీ. మిమ్మల్నొక్కర్నీ ఇంట్లో పెట్టి సమాజాలూ, మీటింగులూ అని ఊరేగితే, ఇంక అతిథి మర్యాదకి అర్థం ఏముంటుంది చెప్పండి?"

"అనవసరంగా మీకు శ్రమ నిస్తున్నాను"

"బాబోయ్ ఆపండి. మీవల్ల మేముగాని, మా వల్ల మీరు గాని శ్రమ పడటాలూ, తీసుకోడాల్లాటి మాటకి స్థానం లే దసలు. సరే......నేను కాఫీ పట్టుకొస్తాను. ఈ లోగా మీరు ఒక బ్రహ్మాండమైన ప్రోగ్రాం ఆలోచించి పెట్టండి" అని ఆవిడ వెళ్ళిపోయింది.

శంకరాని కేమి చేయాలో తోచడంలేదు. ఇప్పు డీవిడ బ్రహ్మాండమైన ప్రోగ్రామంటూ ప్రాణం తీయడం ఏమీ బాగోలేదు. బాగుండదు కూడా.

పోనీ, ఆవిడకి నచ్చజెప్పి ఈ మూర్డోజుల పాటూ ఏదైనా హోటల్లో గడుపుదామనే మాట ఉత్తదీ, కుదరనిదీను.

వెడుతూ వెడుతూ రంగారావ్ 'నా ఇంట్లో వచ్చినట్టు పడుండమన్నాడు' పడుండక తప్పదు మరి.

ఎవరైనా ఏమైనా అనుకుంటూ రన్న దిగులు కంటె ముందు తన మనస్సుకే నచ్చడంలేదు ఈ పద్ధతి.

సుజాత కాఫీ తీసుకొచ్చింది. తెచ్చిన కాఫీ గడా లాగేసి గోళ్ళు గిల్లుకోవడం ప్రారంభించాడు శంకరం.

"మరి మన ప్రోగ్రాం మాటేం చేశారు?" రెట్టించి అడిగింది సుజాత.

"ఏం ప్రోగ్రాముల్లేండి" అనేశాడు.

"అదేమిటి?"

"అవునండీ. నా వంట్లో బాగో లేదు. విపరీతమైన తల నొప్పి—వళ్ళు నొప్పులూను."

"అరె.....చెప్పారుకాదె. ఉండండి. ఒక్క నిమిషం ఇంట్లో అమృతాంజనం ఉంది. పట్టుకొస్తాను" ఆమె గబ గబా తన గదిలోకి వెళ్ళింది.

ఈవిడతో ఏ మాట అన్నా తంటాగానే ఉంది. ఇప్పుడు అమృతాంజనం పట్టుకొస్తుంది కాబోలు ఖర్మం. లేని నొప్పులకి అదేం పని చేస్తుంది! ఏమైనా సరే—ఇవ్వాళ ప్రోగ్రాం మాట రానేకూడదు— అని నిశ్చయం చేసుకున్నాడు.

సుజాత అమృతాంజనం తేవడం, ఆ ఇంటి

మనిషి - మిథ్య

...ఒక టెక్సీ కారు ఆగడం రెండూ ఒక్క సారే జరిగాయి. కారులోంచి దిగి ఇంట్లోకి రాబోతూన్న వ్యక్తిని చూచి ఆనందంగా అంది సుజాత.

"భలే......సమయానికి రాంబాబూ వచ్చాడు"

వచ్చినతను హుందాగా ఉన్నాడు. గాబర్డీన్ పాంటూ, టెరిలిన్ స్లాక్‌లో అతని హుందాతనం మరింత విజృంభించింది. అతను రాగానే ఖరీదైన సెంటు వాసన గుప్పున గుమాయించింది. టీపాయ్ మీద ఉన్న అష్ట్రెలో సగం వరకూ కాలిన సిగరెట్టు పడేసి మరో కుర్చీలో కూర్చున్నాడు.

"రంగారావ్ ఇంకా గూటికి చేరుకున్నట్టు లేదే?"

"ఆయన కేంప్ కెళ్లారుగానీ, తమరెప్పుడు వేంచేశారు ఈ ఊరు" అని అడిగింది సుజాత.

"ఉదయం."

"అవుతే మేమిప్పటిగ్గా కనిపించ లేదన్న మాట"

"ఏమిటా విష్యారం? రాత్రంతా ట్రైనులోనే గడిచిందేమో—ఇంటికొచ్చి ఇప్పటి వరకూ ఒళ్ళు మరిచి నిద్ర పోయాను"

"సమర్థించి చెప్పుకోడంలో నిన్ను మించిన వాడు మరొకడు లేడు......వీరు మావారికి మిత్రులూ, ప్రఖ్యాత కథకులూ అయిన శంకరం గారు...వీరు........"

"రాంబాబుగారు. పేరు మీరంటూండగా తెల్సి

పింది'' అన్నాడు శంకరం.

''సుజాత నవ్వుతో......''

''వృత్తి లయ్యరు. అనగా వకీలు. పూర్వాశ్రమంలో నా క్లాసు మేటు. ఇప్పుడు రెండు చేతులా ఆర్జిస్తున్న ఒకానొక......''

''చాలు'' అన్నాడు రాంబాబు.

''పోతే......నువ్వు శంకరంగారితో మాటాడుతూండు. నీకు కాఫీ పట్టుకొస్తాను'' అని వెళ్ళిపోయింది. మళ్ళీ అంతలోకే వచ్చి—

''తలనొప్పిగా ఉందని చెప్పారుగదూ. ఈ అమృతాంజనం వాడండి'' అని ఆ డబ్బీ శంకరానికిచ్చి వెళ్ళింది.

రాంబాబుతో ఎలా మాటాడాలో అర్థం కావడం లేదు. తన అవస్థ గ్రహించో ఏమో రాంబాబే మాటలు ప్రారంభించారు.

''హేవ్ ఎ సిగరెట్ ప్లీజ్'' అన్నాడు సిగరెట్టు పెట్టె శంకరానికి అందిస్తూ.

''థాంక్స్'' సిగరెట్టు తీసుకున్నాడు శంకరం.

ఇద్దరూ సిగరెట్లు ముట్టించుకున్నారు.

''మీరిక్కడ కొచ్చి ఎన్నాళ్ళయిందన్నారు'' అడిగాడు రాంబాబు.

జవాబు చెప్పాడు శంకరం.

''రంగారావ్ మీ కెలా తెలుసు?''

''చిన్నప్పట్నుంచి కలిసి తిరిగాం. మంచి స్నేహితుడు.''

''ఐ. సీ.'' అన్నాడు రాంబాబు తలూపుతూ.

వాళ్ళిద్దరి మధ్యా అంతటితో మాట లాగిపోయాయి.

సుజాత కాఫీ పట్టుకొచ్చింది.

''నువ్వింత తొందరగా వస్తావనుకోలేదు రాం'' అన్నది సుజాత.

''బతే దానివేలే......వెళ్ళిన పనైనా గూడా ఆ శ్రీకాకుళంలో కాలు కాలిన పిల్లిలా తిరగమంటావా? మనమంతా యిక్కడే షికారు చేస్తుంటే అక్కడేంతోచి చస్తుంది చెప్పూ. అదృరే......ఇవ్వాళ ప్రోగ్రాం—''

''అది తేలకే ఇందాకనుంచి తలలు బద్దలు కొట్టుకుని ఆలోచిస్తున్నాం. '' అన్నది సుజాత.

''ఏదైనా పిక్చర్‌కి పోతే పోలా?'' అన్నాడు రాంబాబు.

''ఎందుకూ పోదూ. కాని రాత్రే వెళ్ళాం.''

''పోనీ......నా కోసం రాకూడదా ఏమిటి?'' అన్నాడు రాంబాబు. కాళీ కప్పు టీపాయ్‌మీద ఉంచుతూ.

సుజాత కాసేపు ఆలోచించి శంకరాన్ని అడిగింది.

''ఏమంటారు శంకరం?''

''సారి......నే నెక్కడికీ రాలేను''

''మీ పద్ధతేం బాగోలేదు'' నొచ్చుకుంటూ అన్నది సుజాత.

''తలనొప్పని చెప్పా గదండీ!''

''దట్సాల్‌రైట్. మీకేమీ అభ్యంతరం లేకపోతే సుజాతా నేనూ వెడతాం'' అన్నాడు రాంబాబు.

''తప్పకుండాను'' అన్నాడు శంకరం.

రాంబాబు సుజాత వైపు చూసేడు. ఆవిడ ఏమీ మాటాడక పోవడంతో అడిగాడు.

''నువ్వేమంటావ్ సుజాత! చెప్పు త్వరగా. అవతల పొద్దవుతుంది మరి.''

''నే నాలోచించేది ఈ పూట భోజనం గురించి మనం సినిమాకి వెళ్ళిపోతే ఇక్కడ వంట చేసే దెవరూ?''

''నాకేం పర్వాలేదు. ఆకలైనప్పుడు, అలా హొటల్‌కి వెళ్ళి భోంచేసి వస్తాను'' అన్నాడు శంకరం.

''మా ఇంటి కొచ్చి గూడా హొటల్ భోజనమా?''

''పర్వలేదు లెండి''

''బై ది బై—ఇవ్వాళ మనం గూడా ఏదైనా హొటల్లో చెయ్యి కడుక్కుందాం. ఇద్దరం కలిసి భోజనంచేసి చాలా రోజులయ్యింది'' అన్నాడు రాంబాబు ఉత్సాహంగా.

''ఇప్పుడు మన ముచ్చట్లే కావల్సొచ్చాయి'' సుజాత కాస్త కటువుగా అన్నది. ఆ మాటతో రాంబాబు ఉత్సాహం నీరుకారిపోయింది. కొంతసేపు మవునంగా జరిగిన తర్వాత రాంబాబు లేచి నిలబడి—

''ఆల్ రైట్......వెళ్ళొస్తా. అవతల మంచి ఇంగ్లీషు పిక్చరు ఇవ్వాళతో మారిపోతుంది గూడాను మళ్ళా చూడటం పడుతుందో పడదో'' అని రెండడుగులు వేశాడు.

''ఆగవయ్యా దేవుడా? నాకు మాత్రం రావాలని లేదూ?'' అన్నది సుజాత. ఇంటి తాళం శంకరం చేతికిస్తూ, ''మీ రెక్కడికైనా వెళ్ళదలుస్తే ఇంటికి తాళంవేసి వెళ్ళండి. మళ్ళా పదింటికి వచ్చేస్తాం. వెళ్ళొచ్చేదా మరి'' అనేసి రాంబాబుతో కలిసి బయటికి వెళ్ళిపోయింది సుజాత.

కారు కదిలింది. శంకరం నిట్టూర్చాడు.

శంకరానికి ముళ్ళకంపమీద ఉన్నట్టుంది. ఉద్యోగం సంగతి దేవుడెరుగు—ఇక్కడ్నుంచి తక్షణం వెళ్ళిపోదామనిపించింది. సుజాత గురించి ఆలోచిస్తుంటే, అతని క్కాస్త కోపం కలిగిన మాటా వాస్తవమే! ఇలాంటి స్త్రీని తనము మునుపెన్నడూ చూడలేదు.

వాళ్ళు వెళ్ళి గంటయ్యింది. ఈ గంటా వాళ్ళ గురించి ఆలోచించడమూ, ఇష్టం లేకపోయినా 'రేజర్స్ ఎడ్జ్' లో పేజీలు తిప్పడమూ చేశాడు శంకరం.

తనూ పట్టభద్రుడే. తనతోపాటు చదువుకున్న అమ్మాయిలూ ఉన్నారు. ఇద్దరి ముగ్గురితో మంచి పరిచయమూ ఉంది. అవుతే—అంత మాత్రాన......

అంత మాత్రావ?......

తర్వాత 'భాగం' ఆలోచించడానికి సభ్యత అడ్డుపడింది. ఏమో......తనూహిస్తుందీ, ఆలోచిస్తుందీ పొరపాటేనేమో? నవ నాగరికతా, దాని తాలూకు డెవలప్‌మెంట్సూ గురించి తనకుబాగా తెలీదేమో.

అయినా సరే......తను రాతి యుగం నాటి మానవుడైనా, అతని ఆలోచనలు ఆయుగం నాటివైనా, ఇది కేవలం తన మూర్ఖమే అయినా. ఈ రకమైన కలుపుగోలుతనం తన కిష్టంలేదు.

ఎనిమిది గంటలకి ఇంటికి తాళంవేసి హొటలుకి వెడుతూండగా ఎవరో ఇద్దరు యువకులు ఆ ఇంటి ముందు నుంచి వెడుతూ, తనని చూచి ఏదో మాటాడుకుని ఫక్కున నవ్వేశారు.

వాళ్ళు నవ్వుకున్న మాట వాస్తవమేగాని, అది 'తనని చూచి' అనేది అతను అనుకున్నదీ, అతను అనుమానించిందీను.


హొటల్లో భోంచేసి కాసేపు గాంధీనగరం వంతెనమీద కూర్చుని తల వేడెక్కేంతవరకూ అదీ ఇదీ ఆలోచించి ఇల్లు చేరుకున్నాడు. తలుపు తీసి ఇంట్లోకి వెడుతూండగా వాళ్ళు వచ్చేశారు. కార్లోంచి సుజాత దిగింది. కార్లోంచే అతను చెయ్యూపాడు వొస్తానంటూ. కారు కదిలింది. సుజాత ఇంట్లోకి వచ్చింది. తనని చూస్తూ—

''మీరూ ఇప్పుడే వచ్చారులాగుంది''

''అవును''

''సినిమానుని బయులు దేరామా, కొంతదూరం వెళ్ళిన తర్వాత దారి మార్చి ఇంజనీరింగ్ కాలేజ

40 వ పేజీ చూడండి





కొలంబా

ప్రాస్పర్ మెరిమె

జరిగిన కథ

కర్నల్ థామస్ నెవిల్, కుమార్తె లిడియా కార్సికాకి వెడుతూ లెఫ్టినెంటు ఆర్సో దెల్లా రెబ్బియాని కలుస్తారు. ఆర్సో తండ్రి హత్య చెయ్యబడ్డాడని మిస్ లిడియా తెలుసుకుంటుంది. ఆర్సో చెల్లెలు కొలంబా తమ తండ్రిని బారిచినీ అనే వ్యక్తి చంపించాడనీ, అందువల్ల పగ తీర్చుకోవాలనీ ప్రేరేపిస్తుంది. ఆర్సోకి పగ అంటే ఇష్టంలేదు కాని గ్రామాధికారి రాయబారాలు కూడా బారిచినీ నిర్దోషి అని రుజువు చెయ్యలేకపోతాయి. రాయబార ప్రయత్నాలు విఫలం అవుతాయి. కర్నల్‌గారు, మిస్ లిడియా మరొక ఊరినుంచి ఆర్సో స్వగ్రామం పియత్రవెరాకి రాబోతారు. కొలంబా బారిచిని మీదఆర్సో ఆంటన్‌కు అనుమానం ఎక్కువయ్యే ప్రయత్నాలు చేస్తుంది. ఆర్సో కర్నల్‌ను తీసుకు వచ్చేందుకు బయల్దేర్తాడు. దారిలో బారిచిని కొడుకు [illegible] ఆర్లాందుచ్చియో తనను చంపప్రయత్నించగా వారినే కాల్చివేస్తాడు. మిత్రుడైన బ్రాందలాచ్చియో ఆర్సోనున్తజోవా అడవులవేపు తీసుకుపోతాడు.

19

ఇంతలో కొలంబా గూఢచారుల ద్వారా ఆర్సో బయలు దేరిన కొద్ది సేపటికి, బారిచినీ కూడా బయటికి వెళ్లాడని విని కలవరపాటుకి లోనయింది. రాబోయే అతిథులకి కావలసిన ఏర్పాట్లన్నీ చేస్తూనే, ఈ గదినుంచి ఆగదికి కదులుతూనే, గ్రామంలో ఏమి జరుగుతున్నదీ ఒక కంట కనిపెడుతూనే ఉండేది. పది కొండు గంటలకి ఒక చిన్న గుంపు ఊరిలోకి వచ్చింది; అది కర్నల్‌గారి పరివారం — ఆయనా, ఆయన కూతురూ, వారి పనిమనిష్యులూ, వారి 'గైడ్'. వారికి ఎదురవుతూనే కొలంబా అడిగిన మొదటి ప్రశ్న "మా అన్నయ్యని చూశారా?" అని.

తర్వాత గైడ్‌ని, ఏ దారి వెంబడి వచ్చారని అడిగింది. ఎప్పుడు బయలు దేరారని అడిగింది. అతని సమాధానాలనుబట్టి ఏమి జరిగిందో ఊహించలేకపోయింది.

"మీ అన్నగారు కొండలమీదుగా వెళ్లారేమో" అన్నాడు గైడ్. "మేము కిందగానే వచ్చాము."

కొలంబా తల అడ్డంగా ఆడించి మరికొన్ని ప్రశ్నలు వేసింది. సాధారణంగా, నిబ్బరంగా ఉండే వ్యక్తి బాగా బెదిరి పోయినట్లు కనిపించింది. మిస్ నెవిల్ ఒక సూచన చేసింది. వెంటనే అన్ని దిక్కులకీ మనుష్యులని పంపి వెతకమని. కర్నల్ గారు గైడ్‌ని వెంట పెట్టుకుని స్వయంగా వెతుకుతానన్నాడు. అప్పటికిగాని కొలంబాకి ఇంటి యజమానురాలిగా తన కర్తవ్యం మరిచిపోతున్నానేమో అనే ఊహ కలగలేదు. నవ్వు తెచ్చిపెట్టుకుని, కర్నల్‌గారిని బల్ల దగ్గర కూర్చోపెట్టి, తన అన్నకి ఏ ప్రమాదమూ జరిగి ఉండదేమో అని సర్ది చెప్పింది. ఆడవారిని సముదాయించటమే మగవారి ముఖ్య ధర్మమని నమ్మిన కర్నల్‌గారు ఆమె మాటలను పూర్తిగా అంగీకరించాడు.

"దెల్లా రెబ్బియా వేటకిపోయి ఉంటాడు. అంతదాకా పోయిన తర్వాత ఆపుకోలేక వేటాడుతూ ఉండి ఉంటాడు. మర్చిపోయాను! దారిలో మాకు నాలుగు తుపాకి ప్రేలుడులు వినిపించాయి మా అమ్మాయితో అప్పుడే అన్నాను: అది దెల్లా రెబ్బియా కాల్చినవే, అనుమానంలేదు. అంత చప్పుడు చేసేది నేనిచ్చిన తుపాకియే, సందేహం లేదు!"

కొలంబా ముఖం పాలిపోయింది. ఆమెను శ్రద్ధగా చూస్తున్న లిడియాకి కర్నల్‌గారి ఊహ కొలంబాలో ఇంకేమి భయంకరమయిన అనుమానాలు కలిగించాయో అర్థం అయింది. కొంత సేపటికి కొలంబా తత్తరపాటుతో రెండు చిన్న ప్రేల్లుళ్ల తర్వాత పెద్దవి రెండు వినిపించాయా లేక ముందా అని అడిగింది. అయితే కర్నల్‌గారు కాని, ఆయన కూతురుకాని చివరికి గైడ్‌కాని ఈ విషయమై సరిగ్గా ఏదీ చెప్పలేకపోయారు.

ఒంటిగంట అవుతోందనగా తను పంపిన మరికొందరు గూఢచారులు ఇంకా తిరిగి రాకపోవటంచూసి కొలంబా అందరినీ భోజనానికి కూర్చోమని బలవంతం చేసింది. కాని, కర్నల్‌గారుతప్ప తక్కినవారెవరికీ భోజనం సహించలేదు. బయట ఏమాత్రం శబ్దం వినిపించినా కొలంబా కిటికీ దగ్గరికి పరిగెత్తేది. తర్వాత విచారంగా వచ్చి బల్ల దగ్గర కూర్చునేది. అంతకన్నా విచారంగా అత్యల్ప విషయాలమీద సంభాషణ కొనసాగించాలని చూసేది. ఎవరికీ ఆసక్తి లేకపోవటంతో ఈ సంభాషణ బాగా సాగేదికాదు.

హఠాత్తుగా గుర్రం డెక్కల శబ్దం వినిపించింది. శబ్దాన్నిబట్టి గుర్రం వేగంగా పరిగెత్తుకుని వస్తున్నదని తెలుస్తోంది.

"ఈసారి మా అన్నయ్యే వస్తున్నాడు!" అని లేచింది కొలంబా. కాని ఆర్సో గుర్రంమీద అడ్డంగా కూర్చుని వస్తున్న చిలినాని చూసి, "మా అన్నయ్య ఇక లేడు!" అని కేక వేసింది దుఃఖంతో.

కర్నల్‌గారి చేతిలో గ్లాసు కింద పడిపోయింది. మిస్ లిడియా చిన్న కేక వేసింది. అందరూ ఇంటి గుమ్మం వైపు పరిగెత్తారు. చిలినా గుర్రం దిగే ముందర కొలంబా ఆమెని సునాయాసంగా ఎత్తి దింపేసి గట్టిగా గుండెలకి అదుముకుంది. ఆమె భయ విహ్వల పూరితమయిన చూపుని

చూసి, చిలినా ఒక అరుపు అరిచింది. "ఐతిరికే ఉన్నాడు!" కొలంబా ఆమెని వదిలివేసింది. చిలినా ఒక చిన్న పిల్లికూనలాగ నేలమీద పడింది.

"తక్కిన వాళ్ళు?" అని అడిగింది కొలంబా బొంగురుపోయిన గొంతుతో. చిలినా చూపుడు, మధ్య వేళ్లతో 'క్రాస్' సంజ్ఞ చేసింది. అంత దాకా పాలిపోయి ఉన్న కొలంబా ముఖంలోకి కొంచెం రంగు వచ్చింది. బారిచినీ ఇంటివైపు ఒక చూపు విసిరి, చిరునవ్వుతో అతిథుల వంక తిరిగింది. "కాఫీ తాగుదాం రండి" అంది.

బందిపోట్లు 'దూతిక' పెద్ద కథే చెప్పింది. కార్సికాలో వాడే ప్రాంతీయ భాషలో చెప్పిన ఆ కథను ఫ్రెంచిలోకి కొలంబా, అందులోనుంచి ఇంగ్లీషులోకి మిస్ నెవిల్ అనువాదాలు చేశారు. అది విన్న మిస్ లిడియా చాలా సార్లు నిట్టూర్పు విడిచింది. కర్నల్‌గారు ఆశ్చర్యంతో తిట్లు తిట్టారు కొలంబా మాత్రం నిదానంగా విన్నప్పటికీ ఆమె చేతిలో 'నాప్కిన్' చిన్న చిన్న పేలికలుగా చింపేసింది. ఆర్సో గాయానికి కట్టు కడుతూ అది ప్రమాదమయినది కాదన్న మాటని అయిదు, ఆరు తడవలు చెప్పించుకుంది. బ్రాందొలాచ్చియో

ముగించేముందు చిలినాకి ఒక కాగితం ముక్క కోసం అడగటం జ్ఞాపకం వచ్చింది. తన చెల్లెలితో, ఇంటికి వచ్చిన అమ్మాయిని తన దగ్గర నుంచి ఉత్తరం వచ్చేటంతవరకూ వెళ్లవద్దని చెప్పమని కోరాడుట కూడా. "ఇదే అతన్ని ఎక్కువగా కలవర పెట్టింది" అంది చిలినా. "వెళ్లిపోయేముందు మళ్లీ చెప్పాడు దీని సంగతి. మూడు సార్లు చెప్పాడు." ఇది విన్న కొలంబా చిన్నగా నవ్వుకుని ఇంగ్లీషు అమ్మాయి చెయ్యి గట్టిగా నొక్కింది. ఆమె కన్నీరు పెట్టుకుని చిలినా చెప్పిన దానిలో ఈ భాగం మాత్రం తన తండ్రికి అనువాదం చేసి చెప్పలేదు.

"ఇక్కడే ఉండి మాకు సహాయం చెయ్యాలి!" అన్నది కొలంబా ఆమెను కౌగలించుకుంటూ.

అని ఆమె తన పనిలో మునిగిపోయింది. మొహంలో ఎర్రదనం, కళ్లలో కనిపించే వెలుగు, మళ్లీ మామూలు పనుల విషయమై ఆమె చూపే శ్రద్ధ వీటిని బట్టి ఆమెకి తన అన్న గాయపడ్డాడని విచారంగా ఉందో, శత్రువులు హతం అయ్యారని సంతోషంగా ఉందో తెలుసుకొనటం కష్టం. కర్నల్‌గారికి కాఫీ చేసి ఇచ్చింది. మిస్ నెవిల్‌కి, చిలినాకి పనులు చెబుతూ తనూ తన పనిలో నిమగ్నురాలయిపోయింది చీటికి, మాటికి కర్నల్ గారితో "ఇద్దరినీ!.......తను మాత్రం చేతికి ఒక గాయంతో తప్పించుకున్నాడు!...... ఏమి ధైర్యం కర్నల్‌గారూ!........చాల సాహసం కలవాడు కదూ!.........మిస్ నెవిల్, మీ దేశంలో ఈ గొడవ లేవి ఉండవుకదూ, ఎంత హాయి! మా అన్నయ్య సంగతి మీ కింకా తెలీదు!........డేగ తన రెక్కలు పరవాలేకాని!........అతనేదో నెమ్మది వాడనుకుని ఉంటారు!.......పాపం మీరు అతని కోసం పడే ఆందోళన చూస్తే ఏమనేవాడో...."

మిస్ లిడియా ఆందోళన కూడా తక్కువ లేదు కాని ఏమీ మాటాడలేకపోయింది. ఆమె తండ్రి ఈ వ్యవహారమంతా న్యాయస్థానానికే ఎందుకు తీసుకు పోరాదని అడిగాడు. కార్సికాలో పరిస్థితులని తిట్టాడు. బ్రాందొలాచ్చియో నివాసం తెలిస్తే అక్కడ ఆర్సో ఉన్నదీ, లేనిదీ చూడవచ్చుకదా అన్నాడు.

కొలంబా ఆయన ప్రశ్నలకి నిదానంగా సమాధానం చెప్పింది. ఆర్సో 'ఇప్పుడు బయటికి వస్తే జడ్జి, జూరీల వాళ్ల మనస్థితులని పట్టి తీర్పు మారిపోవచ్చునని వివరించింది. కర్నల్‌గారు ఏమీ అనలేక ఊరుకున్నాడు.

బాగా ఎండ ఎక్కిన సమయానికి ఊరిలోకి విషాదకరమయిన ఊరేగింపు ఒకటి వచ్చింది. తన కొడుకుల శవాలని రెండు కంచర గాడిదల మీదవేసి తీసుకు వస్తున్నాడు ఎడ్వకేటు బారిచినీ. అతని తాలూకు వారూ, వారితోబాటు పనిలేని వారు కొందరూ వెనకాల వస్తున్నారు. ఇంకా వెనక పోలీసులు కొందరు కనిపించారు. వారిలో ఒకడు "గ్రామాధికారి ఏమంటాడు!" అని బాధగా అరుస్తున్నాడు మాటి మాటికీ. ఆడవారిలో అర్థాం దుచ్చియో దాది కూడా వస్తోంది. ఈమె పిచ్చి పిచ్చిగా జుట్టు పీక్కుంటుంది. తక్కిన స్త్రీలు ఏడుస్తున్నారు. కాని వీరందరికన్నా భయంకరంగా కనిపిస్తున్నాడు మరణించిన వారి తండ్రి.

రెండు కళేబరాల మధ్యా ఇటూ, అటూ జరుగుతూ, నల్లబడిన వాటి పెదవులను ముద్దాడుతూ, వేళ్లాడుతున్న వారి తలలు పైకి ఎత్తి ముఖాల లోకి చూస్తూ, అప్పటికే బిగుసుకుపోయిన వాటి కాళ్లూ, చేతులని తడుముతూ ఏదో చెప్ప పోయినట్లు నోరు తెరుస్తూ మాట రాకపోగా దారిలో తగిలిన రాళ్లు పొదలు లెక్క చెయ్యకుండా తూలుతూ ముందుకి సాగిపోతున్నాడు.

"ఆహా అద్భుతం! అపూర్వం! ఎంత గొప్పగావుంది!" ఒక విమర్శకుడు అదేపనిగా పొగడుతున్నాడు.

"క్షమించాలి! మీరు చూసింది బొమ్మ కాదు నేను కుంచలరంగు తుడిచే పట్టా" చిత్రకారుడు అసలుసంగతి బైట పెట్టాడు.

శ్రీనివాసరావు (శృంగవరపుకోట)

ఆర్సో ఇల్లు సమీపించేటప్పటికి ఆ గుంపు హాహాకారాలు, శాపాలు ఎక్కువ అయ్యాయి. "రెబ్బియా పార్టీ" వారిలో కొందరు తమ విజయ గర్వాన్ని దాచుకోలేకపోయారు. ఇది గమనించిన వారి ప్రత్యర్థులలో కోలాహలం మరికొంత అధికం అయింది. "ప్రతీకారం అవసరం!" అని అరిచారు. కొందరు రాళ్లు విసిరారు. రెండు తుపాకులు పేలాయి. వాటి గుళ్లు కొలంబా, ఆమె అతిథులూ కూర్చుని ఉన్న గది కిటికీలకి తగిలాయి. వాటి దెబ్బలకి చెదిరిన కొయ్య ముక్కలు వచ్చి వారు కూర్చుని ఉన్న బల్లమీద అంతటా పడ్డాయి. మిస్ లిడియా భయపడి, ఒక కేక వేసింది. కొలంబా గబగబా లేచి వెళ్లి ఇంటి వాకిలి తెరిచింది. బిగపట్టిన పిడికిళ్లు పైకి ఎత్తి శత్రువులని తిట్టింది

"దొంగలు!" అని అరిచింది. ఆడవాళ్లమీదా, తెలియని వాళ్లమీదా తుపాకి పేలుస్తారా. మీరు కార్సికన్ లేనా? మగవాళ్లేనా? ఎదురుగా వచ్చి పోట్లాడలేని మీరు! రండి చూద్దాం! నేను ఒంటరిగా ఉన్నాను. మా అన్నయ్య లేడు. నన్ను కాల్చి చంపండి! నా అతిథులని కాల్చి చంపండి! అంతేమి సాహసం.....ఆమాత్రం ధైర్యమయినా ఉంటేగా... నాపగ మేము తీర్చుకుంటాము.......ఇలా ఆడవాళ్ళ లాగ ఏడవకుండా నెత్తురుచిందే ఉపాయం చూసుకోండి!"

కొలంబా కంఠస్వరంలో ఆమె వైఖరిలో భయంకరమైనది ఏదో కనిపించింది. అక్కడి వారిలో చాలామంది చకితులయ్యారు. ఈ అదను తీసుకుని పోలీసులు తమ అధికారం కొంచెం చెలాయించారు. పోట్లాటకి సిద్ధం అవుతున్న వారిని వారించారు. అసలే నాయకులు లేని ఈ రెండు పక్షాలూ వెంటనే నెమ్మది పడిపోయాయి. కొలంబా, "పాపం ఏడుస్తున్నారు, ఏడవనివ్వండి. ఈ ముసలాయన ప్రాణం దక్కనివ్వండి. పళ్లు ఊడిన ఈ ముసలి నక్క ఇంక హాత్య లేమి చేయిస్తుంది? బ్యాడిస్ బారిచినీ! రెండు ఆగస్టు నెలలు జ్ఞాపకం ఉంచుకో! మా నాన్న డైరీలో దొంగ సంతకం పెట్టావు గుర్తుందా? నీ అప్పు నీ కొడుకులు తీర్చారు. ఇక అంతా చెల్లు ముసలివాడా" అంది

చేతులు కట్టుకుని అవజ్ఞతో చిరునవ్వు నవ్వుతూ, కొలంబా శవాలు రెండూ శత్రు గృహంలోకి తీసుకుపోయే వరకూ నుంచుని ఉండిపోయింది.

గుంపు నెమ్మదిగా తగ్గిపోవటం గమనించి ఆమె లోపలికి వెళ్లి తలుపు వేసుకుంది. భోజనాల గది ప్రవేశించి కర్నల్ గారితో అంది:

"మా దేశం వారి తరఫున మన్నింపు కోరుతున్నాను. కార్సికన్లు అపరిచితులున్న ఇంటిమీద తుపాకి కాలుస్తున్నారని ఎవరైనా చెబితే నమ్మేదానిని కాదు. మా దేశాన్ని తలుచుకుని సిగ్గు పడుతున్నాను"

సాయంత్రం మిస్ లిడియా తన గదిలోకి వెళ్లిపోయింది. కర్నల్‌గారు ఆమె వెంటనే వెళ్ళి ప్రతి క్షణం ఏ తుపాకీ గుండు వచ్చి తలకి తగులుతుందో అని భయపడవలసిన ఈ గ్రామం మర్నాడే వదలి పోతే బాగుంటుందన్నాడు. ఈ దేశంలో హత్యలు తప్ప చూడటానికి వేరే ఏమి లేదన్నాడు.

మిస్ నెవిల్ వెంటనే జవాబు చెప్పలేదు. తండ్రి మాటలకి ఏమనాలో ఆమెకి తోచలేదు. కాని చివరకి ఇలా అంది:

"ఈ అమ్మాయిని ఇటువంటి పరిస్థితిలో ఎలా వదిలి పోతాము? అలా వదిలి పోవటం క్రూరంగా ఉండదు నాన్నగారూ?"

"నీ కోసమే చెప్పాను, అమ్మాయి" అన్నాడు కర్నల్‌గారు. "నిన్ను అజాచ్చియోలోనే వదిలి వచ్చి ఉంటే దెల్లా రెబ్బియా సాహసాన్ని మెచ్చుకుంటూ అతనితో కరచాలనం చెయ్యకుండా వచ్చేవాడిని కాదు."

"సరే! కాని నాన్నగారూ, ఇంకా కొంచెం ఆగి చూద్దాము. ఏమయినా సాయం చెయ్య గలుగుతామేమో!"

"నిజంగా మంచి గుండె నీది!" అన్నాడు కర్నల్‌గారు. ఆమె నుదురుమీద ముద్దు పెట్టుకుంటూ. "ఇవతల వాళ్ల కష్టాలు పంచుకునే

33 వ పేజీ చూడండి



...ఈమె యదార్థగాథ విచిత్రమైంది

జాన్ హోగాన్ చెప్పిన
క్రిస్టీన్ కీలర్ కథ

[జాన్ హోగాన్ క్రిస్టిన్ కీలర్ మాండీరైస్ డేవిస్ అనే యిద్దరు 'నెరజాణ'లకు రెండేళ్లు 'బట్లర్'గా పనిచేశాడు. అతను నిజమని చెపుతున్న కీలర్ కథ.]

స్వతహాగా నేను విమర్శచేసే తరహావాణ్ణి గాక పోయినా, షేవ్స్ వదిని కూడా లక్ష్యపెట్ట కుండా డాఫిన్స్ స్క్వేర్‌లోని 204 హాకిన్స్ హశాప్‌కి వచ్చే కొందరు పెద్దమనుష్యులంటే మాత్రం నాకు పెద్ద భావం లేదు.

నేను క్రిస్టిన్ కీలర్‌కి ఒక సంవత్సరం పైగా బట్లర్ పని చేశాను. ఆ రోజుల్లో ఆమె వద్దకు వచ్చిన ఏ ఒక్క వ్యక్తిమీదా నాకు మంచి భావం లేనేలేదని చెప్పితీరాలి.

"ప్రొఫ్యూమో ఉదంతం"గా మారిన ఈ పద్మ వ్యూహంలో, పాపకూపంలో చాలామంది చిక్కు కున్నారు. వారిలో చాలామంది పేర్లు ఆమె పేరు గణించుకున్నంత పెద్ద పేరు సంపాదించుకున్నాయి.

అలాంటివాళ్లందరిలో శ్రీ ప్రొఫ్యూమోదే అగ్రతాంబూలం. శ్రీ ప్రొఫ్యూమో కొన్నాళ్ల క్రితం యుద్ధశాఖామంత్రి.

స్టీఫెన్‌వార్డ్ అనే డాక్టరు తనమీద జరిగే ప్రచారానికి, దుష్ప్రచారానికీ తట్టుకోలేక, తన జీవితాన్ని ముడుపుకట్టి, చెల్లించుకున్నాడు.

గోర్డన్ అనే వ్యక్తి మరొకడు: అతడు చాలా అదృష్టవంతుడు. రంగు రంగుల టోపీ (Tartan) పెట్టుకుని, అతను చాలా రాత్రులు ఆమెతో గడిపి, ఆనక నా యజమానురాలి (కీలర్) ని అవమానించడంవల్ల మూడేళ్ల శిక్ష అనుభవించ బోయి, తిరిగి క్షమింపబడ్డాడు.

పేరూ, పద్దూ తెలియని పెద్దమనిషి ఒకాయ మన్నాడు. ఆయనకి, నా యజమానురాలికి ఒక నాడు ఫోనులో పరిచయమై స్నేహంగా మారి, తాగి, తందనా లాడి, బాత్‌రూముల్లో స్నానాలతో అది అంతమయ్యింది.

తాగి, మైకంలో ఉన్నపుడీ విషయాలన్నీ కీలర్ నాకు చెప్పింది.

ఒకనాడున్నట్టుండి ఆమె స్నేహితునికి ఆమె మీద కోపం వచ్చిందట. ఆ కోపంలో అతను ఆమె తాలూకు బట్టలన్నీ తీసుకుని, ఆమెను ఒదిలేసి వెళ్లిపోయాడు. కోపకారణం తెలియలేదు కాని, కీలర్ మాత్రం మరొక స్నేహితునికి ఫోన్‌చేసి జరిగినదంతా వివరించి, తనకు సహాయపడవలసిందిగా కోరింది.

అతను వచ్చేసరికల్లా ఆమె బాత్‌రూమ్‌లో అర్ధ నగ్నంగా ఉంది. తరువాత వారిద్దరూ కలిసి వేడి వేడి నీళ్లల్లో ఉమ్మడిగా స్నానం చెయ్యాలని సంబరపడ్డారు. టబ్‌లోని వేడినీళ్లన్నీ చల్లపడిపోయే వరకూ మైమరచి స్నానం చేస్తూనే ఉన్నామని ఆమె నాతో చెప్పింది.

కీలర్‌తో పరిచయముండి, ఆమె చుట్టూ తిరిగేవారిలో పీటర్ రాక్‌మన్ అనే అతను నాకు బాగా గుర్తున్నాడు. నవంబరులో అతను చనిపో యాక — అతను దుర్మార్గుడనీ, సన్మార్గుడు కాదనీ చక్రవడ్డీలవంటి వ్యాపారాలు చేసేవాడనీ బయటపడింది.

అదలా ఉండగా నే నామెవద్ద పని మానేసి వేరేచోటకు పోడానికి ఒక సంఘటన మూల కారణం అయింది.

చూస్తుండగానే నాకూ, కీలర్‌కీ అభిప్రాయ భేదాలు వచ్చాయి. ఆమె నా కష్టానికి తగిన ఫలితం ముట్టజెప్పడం మానేసింది. రోజుకి రెండు పౌనులు యిచ్చే ఏర్పాటు ఉన్నా, ఆ డబ్బు ఇవ్వక, బకాయి పెట్టడం ప్రారంభించింది. నేను కొలువు మాను కుని వెళ్ళేటప్పుడు మొత్తం ఇచ్చింది లెండి.

మిస్ కీలర్ తన ఫ్లాట్‌లో ఎక్కువ కాలం ఉండడం మానేసింది. రాక్‌మన్—మిస్ మాండీ రైస్ డేవిస్ అనే ఆమెను బ్రయన్‌స్టన్‌మ్యూస్ వెస్ట్, మేఫెయిర్‌లో ఒక ఫ్లాట్ (Flat)లో ఉంచాడు. ఆమెవద్ద నేను బట్లర్ పని చెయ్యగల నేమోనని అడిగాడు.

నిజానికి నాకుకూడా కొంత మార్పు అవసర మనిపించింది. కీలర్‌కి చేసిన చాకిరీతో నాకు బుర్ర తిరిగింది. కొంచెం మార్పు వస్తేనే మంచిది అనిపించింది. వెంటనే ఒప్పేసు కున్నాను.

రాక్‌మన్ పరమ దుర్మార్గుడనీ, భయంకర మైన దారుణాలు చెయ్యడానికి వెనకాడడనీ నేను తొందరలోనే పసిగట్టాను.

నా కతనితో మొట్టమొదటిసారి పరిచయ మయినప్పుడే అతను డబ్బు కలవాడనీ, డబ్బు వాడనీ గ్రహించాను. అతని కట్టూ, మాట తీరూ, తెన్నూ వల్ల నేను గ్రహించినది నిజమే నని రూఢిచేసుకున్నాను. చూడడానికి ఎంత ముచ్చ టగా, బుద్ధిమంతుడిలా కనిపిస్తాడో అంత నీచుడు, దుర్మార్గుడు అతను. ఒకనాటి సంఘ టన నేను ఈనాటివరకూ మర్చిపోలేదు.

ఆనాటి ఉదయం నేను పనిలోకి రాగానే వంటింటి వైపు వెళ్లాను. అతను లోపల వేసుకొనే లాగు, బనీనుతో ఉన్నాడు. చొక్కాగాని, కాలికి జోడు, మేజోడుగాని లేవు. అతను పాలముద్ద (Condensed Milk — పాలగుండ) వేలితో తీసుకుని నాకుతున్నాడు. నే నాశ్చర్యపోయాను. వెర్రెత్తిన కోతి కుర్రాడిలా ఎగబడి, వేలు నాకుతున్నాడు. అతనలా చేస్తుండగా అతని లోపల లాగూ జేబు లోంచి ఒక వస్తువు జారిపడింది. అది 38 ఆటోమాటిక్ పిస్టల్!

నాకు ముచ్చెమటలు పోశాయి. అవును.

వార్డ్.




...ఆత్మహత్యచేసుకున్నాడు

ముచ్చెమటలూ పోశాయి. నాకు బాగా గుర్తుంది. ఈ భయంకర దృశ్యం చాలదన్నట్లు అతను గమ్మున పక్కనున్న తుపాకీ తీసి, నామీద గురి పెట్టి, క్రూరంగా, భయంకరంగా చూశాడు.

నేను భయాన్ని పారదోలి, ధైర్యాన్ని చిక్కబట్టు కునేలోగా అతనే పకపక నవ్వుతూ తుపాకీ పక్కన పెట్టేశాడు. కానీ, నేను స్వామి ద్రోహిని కాదు అతని మంచిచెడూలు దేనికదిగానే చెప్పకోవాలి. ఈ రకంగా చిన్న చిన్న తమాషాలు చేసి, నన్ను భయపెట్టి ఆనందించేవాడే తప్ప పెద్దగా దారుణాలేమీ చెయ్య లేదనే చెప్పాలి. అతను పురమాయించిన పని కోసం వూరంతా తిరిగి, నానా తంటాలుపడి సాధించుకువస్తే—నా కష్టానికి ఒకటో రెండో పౌన్లు అదనంగా యిచ్చి ఆనందించమనేవాడు.

ఏమైనా, ఆస్థిపాస్తులు పోయి, చాలామంది పేదవాళ్ళగా తయారవ్వడానికి ఇతనే బాధ్యుడని అనకతప్పదు. అతను కొంతమంది వ్యభిచారిణు లను పెట్టుకుని వ్యాపారం సాగించేవాడు. నిజానికి రాక్‌మన్ తమాషా వ్యక్తనే చెప్పాలి.

అతని క్రింద పనిచేసిన రోజుల్ని తలుచుకుంటే నాకు రెండు సంఘటనలు గుర్తుకు వస్తాయి. తృప్తి అనేది లేకుండా 'ఆ' పాలముద్ద తినడం ఒకటి, అమితమైన నియమంతో, పట్టుదలతో పరిశుభ్రతను కాపాడుకోడం ఒకటి—అది తన



క్రిస్టీన్ కీలర్ కథ

సొంతానికే గాక, తన 'పడకగది స్త్రీల' విషయంలో కూడా అతను పాటిస్తాడు.

అతనికి మరో తమాషా అలవాటుంది. పక్క మీదకి నల్లి రానడంతోనే లేచి దాన్ని చంపడం, దానికోసం వేరే మందొకటి పక్కలో పెట్టుకోడం అలవాటు.

కీలర్ని అతను మొట్టమొదటిసారి కలుసుకున్నప్పుడీ విషయం నేను కనిపెట్టాను. కీలర్ కాల్చే మార్జువానా (సిగరెట్టు) వాసన, పొగకన్నా ఘాటైన ఈ నల్లులమందు వాసనే హాయని పిస్తుంది నాకు మాత్రం.

ఒక రోజున నేను కీలర్ స్నానానికి బాత్ టబ్‌లో తియ్యటి సెంటు వాసన వచ్చే క్రిస్టల్స్ వేశాను.

కొన్ని సెకన్లు గడిచాయో లేదో బాత్ రూములోనుంచి ఆమె గొంతుచించుకుని, వెర్రి కేకలు వేస్తూ ఎగిరి బైటపడింది. "నేనా నీళ్లలో ఛస్తే స్నానం చెయ్యను" అని ఉప్పెనగా అరుస్తూ నగ్నంగా (ఆమె పుట్టినప్పుడున్నంత నగ్నంగా) పరిగెత్తుకుంటూ బెడ్‌రూమ్‌లోకి వా ముందునుంచే వెళ్లిపోయి భళ్లున తలుపు వేసేసుకుంది.

నేనేదైనా పొరపాటు చేసి వుంటానేమోనని భయపడి, బాత్‌రూమ్‌లోకి వెళ్లి చూసేసరికి బోధపడిపోయింది. నేను బాత్‌రూమ్‌లోంచి బయటకు రాగానే, రాక్‌మన్ ఆ టబ్‌లో నల్లుల మందు కొంచెం అధికరించినట్లు తర్వాత తెలిసింది.

నిజానికి అతను పరిశుభ్రతకు ఒక ప్రతినిధనే చెప్పాలి. కానీ, కీలర్‌కి మాత్రం అతను చెప్పిన "ఆరోగ్యాన్ని కాపాడుకునే వైద్యశాస్త్రం" అంటే మంట.

రాక్‌మన్ ఒక విషయంలో మాత్రం ఆట్టే పట్టించుకునేవాడు కాదు. అది డబ్బు విషయం. పాతనోటు ఎంత పాడై వచ్చినా సరే, అతడు తీసుకునేవాడు. నిజాని కతను చనిపోయే వరకూ అతనెంత ధనికుడో నాకు తెలియదు. అతని సిల్కు చొక్కాలు, సూట్లు, తన ఎత్తుని కొంచెం పెంచే జాతి చెప్పులే గాక, స్విస్ బ్యాంక్ ఎకౌంట్ నంబరుతో ఉన్న బంగారు గొలుసు వగైరాలు అతని ధనికత్వానికి నిదర్శనాలు.

మాండి డేవిస్—మిస్ కీలర్‌లా గాక సౌందర్యోపాసకురాలు. ఎంత అలంకరించుకొన్నా తృప్తి పొందదు. అందాలరాసిగా తయారయ్యేవరకు, తయారై తృప్తిపొందేవరకూ గంటల తరబడి ముస్తాబవుతూనే ఉండేది. ఆమెకు కావలసిన బట్టలు, స్నోలు వగైరా అన్నీ రాక్‌మన్ సమకూర్చేవాడు.

మిస్ కీలర్‌లా గాక, డేవిస్‌కి చక్కని వస్త్రధారణంమీద మంచి కోర్కె ఉండేది. నల్లని తొగలు వంటి వాటితో అల్లిన ఒక రకం పాత హ్యాండు బ్యాగు కీలర్ పట్టుకువస్తుంటే వద్దని నే చెప్పినట్టు నాకు గుర్తు కూడా.

కాని ఆ యిద్దరూ ఒకే ఒక్క గుణంలో మాత్రం ఏకీభవించారు. అది సిగ్గును విడిచి సంచరించడమే. బట్ట కట్టుకుని, ఇంట్లో తిరగడం కన్నా నగ్నంగా తిరగడమే వా రిద్దరికీ

చిక్కని అలవాటు. వాళ్లలా తిరుగుతూ నన్ను చూసి కూడా చూడనట్లు సంచరించేవారు. బహుశా నేను వాళ్లకి తండ్రి నయినట్లు వూహించేవారేమో !!

ఒకనాడు మిస్ డేవీస్ తన వీపు రుద్దమని నన్ను పిలిచింది. ఆ సంఘటన నా కీనాటికీ గుర్తుంది. ఆనాడు వంటింట్లో నేనేదో వంట కాలు చేస్తుండగా నాపేరు పిలుస్తున్న మిస్ డేవిస్ కంఠం వినబడింది. "నిన్నే ! ఇలారా కొంచెం. ఒక్క నిముషం. నీతో చిన్న పనుంది" అన్న మాటలు వినపడ్డాయి. నేను చేస్తున్న పని నాపి పరుగెత్తి, ఓరవాకిలిగా తీసున్న బాత్‌రూమ్ తలుపు పక్కగా నిలబడ్డాను.

"ఏం ? వచ్చావా ? పలకవేం" అంది.

"నీతో చిన్నపని ఉంది" అంది ఈసారి ఆమె కంఠంలో ఓర్పు నశించింది.

"వచ్చి యిక్కడ నిలబడ్డాను" అన్నాను నేను ఆవిరి నిండిన నేలని చూస్తూ.

"ఆహా ! అయితే లోపలకురా. అక్కడ ఎందుకు."

ఇది నే నూహించని సరికొత్త సంఘటన. ఇంతకుముం దెన్నడూ స్త్రీ స్నానం చేస్తుండగా నేను చూడనేలేదు. అందులో నగ్నంగా స్నానం చేస్తున్న స్త్రీ .... నగ్నంగా ఉన్న ఆమె శరీర సౌందర్యాన్ని చూడకుండా నేను దించిన తల ఎత్త కుండా వెళ్లాను. "ఏం కావాలి" అన్నాను ఒణుకు తున్న కంఠంతో.

"ఇప్పటికయినా దయ్యాన్ని చూసినట్టు చూడడం మానేసి యిలా వచ్చి నా వీపు కొంచెం రుద్దిపెట్టు—యిప్పటికి మూడుసార్లు పిలిచాను" అంది. అంటూనే వళ్లు తోముకునే బ్రష్ నా చేతికి యిచ్చింది. నేను చొక్కా చేతులు పైకి ఎగసందోసి, ఆమె చెప్పినట్టే చేశాను. అనక, ఆనాటి నా పిరికితనాన్ని గురించి చాలాసార్లు గేలి చేసి, ఆనందించింది. తరువాత ఆమెకు చాలా సార్లు వీపు రుద్దాను. నేనలా వీపు రుద్దితే ఆమెకు యిష్ట మనుకుంటాను. స్నానం చేసిన తరువాత టబ్‌లోంచి లేచి, వయ్యారంగా, నగ్నం గానే వెళ్లిపోయేది.

ఆటంకంగాని, సిగ్గు గాని లేని స్త్రీ ఎవరైనా గనుక ఉంటే ఆమె మిస్ మాండీరైవ్ డేవిస్ ఒక్కతేనని చెప్పవచ్చు. ఆమె అందమైన ముఖం మీద ఎన్నడూ సిగ్గుతెర కనుపించనే కనుపించదు.

అద్దంముందు నిలబడి "ఏం ? నే నందంగాలేనూ" అని ఏరోజూ నాగా లేకుండా అడిగే ఆమె క్రమం తప్పని అలవాటు చూస్తే నాకు చిరాకు పుట్టేది.

"ఏం ? అందంగా లేనూ" అని అడగ్గానే ఔనని తల వూపేవాణ్ణి. అందులోనూ చక్కగా, నగ్నంగా అద్దం ముందున్నాడయితే వెంటనే వొప్పేసుకునేవాణ్ణి.

అద్దాన్ని గురించి మాట్లాడడంవల్ల నాకో తమాషా అద్దం—సంగతి గుర్తుకు వచ్చింది. అది రెండు రకాల ఉపయోగాలు కల అద్దం. ఓ గోడకి అమర్చబడి ఉండేది.

* * *

ఆ అద్దం వెనుక 'ఒక బుద్ధుని బొమ్మ ఉంది. ఆ గోడ మిస్ డేవీస్ పడక గదిని కలుపుతుంది. నేనాగ గది దుమ్ము దులుపుతూంటే యాదృచ్ఛికంగా ఆ అద్దం నా కంట పడింది. ఆ బొమ్మని తట్టి నందువల్ల ఆసంగతి తెలిసిందనుకుంటాను. అద్దం లోంచి వంగి బయటికి చూసి ఆశ్చర్యపోయాను. పక్కగదిలో విశేషమంతా నా కంటికి కనుపించింది. నేను విపరీతంగా తాగుడు అలవాటున్నవాడిని కాదు. కానీ, ఆ సమయంలో తాగానేమో నన్న అను మానం వచ్చింది.

పక్కనున్న గదిలో రాక్‌మన్ గాఢనిద్రలో మునిగిపోయాడు. నాకు ముచ్చెమటలు పోశాయి. గమ్మున బుద్ధుని బొమ్మ యథాస్థానంలో పెట్టేసి, గది దాటి బయటికి వచ్చి, నా పనిలో మునిగిపోయాను.

ప్రస్తుత పరిస్థితుల్లో నేనా విషయం పసి గట్టినట్లు తెలియజెయ్యకుండడమే మంచిదను కున్నాను. కాని, ఎందుకో, చాలా నెలలు గడిచాక ఒకనాడు అద్దం పగిలి ముక్కలు అయిపోయింది.

ఒక ఎలక్ట్రిషియన్ ఒకడికి పని నేర్పుతున్నాడు.

'అబ్బాయ్! ఆతీగ పట్టుకో'

'ఆ పట్టుకున్నా' నని వాడి సమాధానం 'ఏమీ అనిపించ టంలా ?'

"అబ్బే! ఏం లేదండి!"

"అయితే ఆ రెండో తీగమాత్రం పట్టుకోకు అందులో కరం టుంది" ఎలక్ట్రిషియన్ మొదటి పాఠం చెప్పాడు.

రామారావు (మందడం)

అది ముక్కలవడానికి కారణగాథ తరువాత తెలిసింది.

మిస్ డేవీస్‌కి తెలియకుండా ఆ ఫ్లాట్‌కి రాక్‌మన్ ఆ రాత్రి గడపడాని కొక అందాలరాసిని తెచ్చుకున్నాడు. మిస్ డేవీస్ ఆ సమయంలో ఇంట్లో లేకపోవడం, మరో నాలుగైదు రోజుల వరకూ రాదని తెలియడంవల్ల రాక్‌మన్ ఆ సాహసం చేశాడు.

ముందే అనుకుని నిర్ణయించుకున్నట్టుగానో, లేక దైవికంగానో తెలియదుకాని, అనుకోకుండా మిస్ డేవిస్ మధ్యాహ్నంవేళ వచ్చింది. వస్తూనే పడకగదిలో కిలకిలలు, కలకలలు వింది.

నెమ్మదిగా బుద్ధుని పటం తీసి, అద్దంలోంచి చూసి నిశ్చేష్టురాలయ్యింది.

రాక్‌మన్ ఆమె కన్నుల ఎదురుగా మరొక స్త్రీతో గడిపాడు.

"తిరస్కరింపబడిన స్త్రీ చూపుల క్రోధం కన్నా యమలోకమే వెయ్యిరెట్లు హాయి" అన్న సామెత ఎంతవరకు నిజమో తెలియదు కాని, ఆనాడు మాత్రం తేలిపోయింది. మిస్ డేవిస్ శరీరం క్రోధంతో వొణికిపోయింది. పట్టరాని ఆవేశంలో ఓ బరువైన అభరణం తీసి, అద్దం గుండా 'ఆ' గదిలోకి రయ్యిన విసిరేసింది.

ఆ తరువాత ఏం జరిగిందో నా కంతగా తెలీదు. ఆనాడా పగిలిన గాజుపెంకులు తీస్తుండగా మిస్ డేవీస్ తనే చెప్పింది.

తను కోపంతో, భయంతో వణికే ఆ పిల్లను కత్తి పుచ్చుకుని వెంట బడ్డాననీ, రాక్‌మన్ ఆ దృశ్యం చూసి, "పిల్లుల పోట్లాట" గా కట్టి పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వాడనీ చెప్పింది.

కానీ, ఆమె మనస్సు మంచిది. రాక్‌మన్ మీది కోపం, ఆ మరుసటి క్షణంలోనే ఆమెకు పోయింది. సామాన్యంగా ఆమెకు ఎవరిమీదయినా, ఎలా అయినా సరే కోపం వస్తే ఎంతోకాలం నిలవదు.

మిస్ డేవీస్‌వద్ద నుంచి కీలర్ చాలాసార్లు అంద మైన వస్త్రాలు తీసుకుని, అవి తిరిగి యివ్వక పోయినా, ఆమె ఏమీ కోపగించుకోలేదు.

మిస్ డేవీస్‌కి గల మంచి గుణం, ఔదార్యం మీద మిస్ కీలర్‌కి నమ్మకం ఎక్కువనుకుంటాను.

అర్ధరాత్రి నిద్రపోతూండగా తనని అనేక సార్లు మిస్ కీలర్ లేపి, మార్జువానా (సిగరెట్లు) కొనుక్కోడానికి డబ్బు యివ్వమని అడిగేదని మిస్ డేవిస్ చెప్పింది.

ఆ రకమైన వాతావరణంలో ఎంతలేసి వింత లైనా జరుగవచ్చు. ప్రతి ఘడియకు, గంటకు ఎలాటి వింత చూడాలో, ఎలాటి దారుణం చూడాలో అని నేను గడగడ లాడేవాణ్ణి.

ముందు ఆ రోజుల్లో—కీలర్‌కి బట్లర్‌గా ఉన్న రోజుల్లో, ఆనక మిస్ డేవిస్‌కి బట్లర్‌గా ఉన్న కాలంలో జరిగిన సంఘటనల వల్లా, ఘటనల వల్లా నా ఆరోగ్యం నాశనమైపోయింది.

నా బరువు టకటక తగ్గుకు వచ్చేసింది. నెత్తి మీద జుట్టంతా రాలి, పల్చబడిపోయింది. రాత్రిళ్ళు నిద్రరావడమే మానేసింది. ఆయుల్షు వదిలే సమయం చాలా త్వరలో వస్తోందని నేను గ్రహించాను.

నిజానికా సమయం నే ననుకున్నదానికన్నాముందు గానే వచ్చింది. ఒకనాడు నన్ను మిస్ డేవిస్ బజా రుకు పంపింది. తిరిగి వచ్చేసరికి రాక్‌మన్ ఉన్నాడు. అతను అలవాటు చొప్పున కాఫీ కావా లని హఠం చేశాడు. నేను తీరా అదే తేవడం మర్చి పోయాను.

అతనికి కోపం వచ్చింది. నాకూ మాటపడే ఓపిక పోయింది. ఆమాటే సాయంత్రం ఆమెతో చెప్పి నాకు శలవిప్పించమని నిక్కచ్చిగా చెప్పేశాను

ఆ మర్నాడు నా కివ్వాల్సిన మొత్తం డబ్బు యిచ్చేసింది. నేను పెట్టె బేడాతో వెనక్కి తిరి గాను. నా వెనకాల తలుపు ఫెడీల్న వేసుకుంది. నేను వెనక్కి తిరిగైనా చూడలేదు.

తిన్నగా నా భార్య విక్టోరియా వద్దకు వెళ్లాను. ఆమె చేతిని ఆప్యాయంగా నా చేతిల్లోనికి తీసుకుని "అంతా అయిపోయింది చక్కగా" అన్నాను.

మొత్తం మీద స్వేచ్ఛావాయువులు పీల్చ గల్గాను !

గ్రహస్థితి

మిధునంలో రాహువు, తులలో సూర్యుడు, వృశ్చికంలో అంగారక, బుధ, శుక్రులు, ధనుస్సులో కేతువు, మకరంలో శని, మీనంలో గురువు, కర్కాటక, సింహ, కన్య, తులలో చంద్రుడు.

8-11-1963 శుక్రవారము మొదలు 14-11-1963 గురువారము వరకు

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

సమయం బాగున్నది. వ్యవహార రంగంలోను, రాజకీయాలలోను అనుకూల వాతావరణం కనుపిస్తుంది. ప్రస్తుతం తలపెట్టే పనులలో బంధువులు కలుసుకొని సహాయం చేస్తారు. బాధ్యతలు పెరగటంవల్ల మనస్సుకు పని ఎక్కువ. మొదట అనుకొన్న విషయం మరచిపోతూ ఉంటారు. కొత్త మిత్రులతో ఆరంభంలో అభిప్రాయ భేదాలు రాగలవు. సుఖ సంతోషాల నిమిత్తం ఖర్చులు పెరుగుతవి. విసుగు చెందకుండా మీ ధర్మాలను నెరవేర్చుకొనవలసిన సమయం. అధికారులు కూడా మీ మాటను గౌరవిస్తారు. ఆర్థికంగా చిన్న చిన్న చిక్కులను ఎదుర్కొంటూ జయం పొందగలుగుతారు. నీచులతో కలహాలు వస్తవి.

*　　*　　*

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

వృత్తి ఉద్యోగాలలో గౌరవం లభిస్తుంది. తోటివారిలో ప్రాధాన్యత లభిస్తుంది. ప్రయాణం చేయవలసి రావచ్చు. ధనాదాయం బాగుంటుంది. ఇతరులతో పోటీలు, పందెములు మొదలైన వాటికి ప్రోత్సహించే వారుంటారు. అయితే ప్రస్తుతం అనుకూలమయిన సమయం కాదు. బంధువులవల్ల ఖర్చులు పెరుగుతవి. ధన విషయంలో పేచీలు పడవలసి వస్తుంది. ఇతరుల రహస్యాలను మీద్వారా సేకరించేవా రుంటారు. జాగ్రత్తగా ఉండండి. విలువగల వస్తువులు కొనే సందర్భములలో చిక్కులను ఎదుర్కొనవలసి ఉంటుంది. మీరు ఎదురు చూస్తున్న వార్తలు సమయంలో అందవు. 9, 10 తేదీలలో శుభ వార్తలు, ఇష్టవస్తు లాభం.

*　　*　　*

మిధునం :

(మృగశిర 3, 4 పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

అప్పుడప్పుడు ఏదో ఒక సందర్భంలో పేచీలు వస్తూ ఉంటవి. వృత్తి వ్యాపారాలలో ఫలితం సాధారణంగా ఉంటుందే కాని, గౌరవము, మిత్రుల



దైవజ్ఞ పొతూరి శ్రీరామమూర్తి

ప్రోత్సాహము బాగుంటవి. సాధ్యమైనంతవరకు రుణభారం పెరగకుండా చూచుకొనండి. దేహ దార్ఢ్యత తగ్గే అవకాశా లున్నవి. ఉష్ణ, శైత్య దోషాలు కనుపిస్తవి. శుభకార్యాలు జరుగుతవి. ప్రస్తుతం కోర్టు కచేరీలలో ఏపనీ చురుకుగా జరుగదు. ఖర్చులు మాత్రం ఒకటికి రెండుగా జరుగుతవి. మీరు నిర్వహించే పనులలో పొరపాట్లు జరిగే సమయం. ఎదటివారి దృష్టికి రాకముందే సరిచూచుకొంటూ ఉండటం అవసరం. వ్యవహార రంగంలో రాజీ మార్గము అనుసరించటం మంచిది.

*　　*　　*

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష.)

ఇంతకుముందుకన్నా మానసికంగా తెంపు, ఉత్సాహము కనుపిస్తవి. ఆరోగ్యం బాగుంటుంది. సంఘంలో స్నేహితుల అండ లభిస్తుంది. చిల్లర చిల్లరగా ఖర్చులు పెరుగుతవి. ఉత్తరదిక్కునుంచి ధనలాభం పొందగలుగుదురు. వృత్తిలో ఎక్కువ శ్రమ చేయవలసి ఉంటుంది. లోగడ మీకు మాట చెప్పినవారు సమయంలో ఆదుకొంటారు. అశక్తుల మీద విడిచిన బాధ్యతలు తిరిగి మీకే చుట్టుకొనే అవకాశా లున్నవి. పుణ్యకార్యాలు సుఖంగా జరుగుతవి. విద్యారంగంలో మీ కృషికి తగిన ప్రోత్సాహము, ప్రయోజనము లభిస్తుంది. కుటుంబంలో చాలావరకు ప్రశాంతంగా ఉంటుంది. 10, 11 తేదీలలో కీర్తి, ధనవ్యయం, కార్యభారం.

*　　*　　*

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఈ సమయంలో ఒక్కొక్కప్పుడు ఇతరుల మీద ఆధారపడవలసి వస్తుంది. ఏ సందర్భంలోను అసంతృప్తి తోచదు. మీ శక్తి సామర్థ్యములతో తోటివారికి సహాయం చేయవలసి వస్తుంది. అధికారుల ఆదరాభిమానాలు లభిస్తవి. రెండవ భాగంలో కుటుంబంలో చికాకు కనుపిస్తుంది. బంధువులు నిష్ఠురాలు మాట్లాడుతారు. ప్రయాణాలు సుఖంగా జరుగవు. కొన్ని సమయాలలో చేసిన ఖర్చులు అనవసరమనే విషయం తరువాత తెలుసుకొంటారు. మంచివారి స్నేహం చేస్తారు. క్రొత్త

ఈ వారము ధరలు

పెసలు, కందులు వీని ధరలు ఈవారం ఆరంభంలో కొద్దిగా తగ్గుతవి. మిర్చి ధర వారాంతంలో బాగా పెరుగుతుంది. బెల్లము ధర తగ్గుతుంది. మావులధర 13, 14 తేదీలలో పెరగవచ్చు. వేరుశనగపప్పు, నూనెల ధరలు తగ్గే సూచన లున్నవి.

విషయములను తెలుసుకోగలుగుతారు. మీ ప్రాత కోతలతో జాగ్రత్త అవసరం. ఈ సమయంలో సాహసం కూడదు.

*　　*　　*

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

మీ ఆలోచనలు చాలావరకు నెరవేరుతవి. బంధువులకు మీయందు మంచి భావం కలుగుతుంది. క్రమంగా ఆదాయం పెరుగుతుంది. వృత్తిలో తరచు సంకల్పం మార్చుకొంటూ ఉండటంవల్ల పనులలోను, ఫలితంలోను మందకొడితనం కనుపిస్తుంది. శుభవార్తలు తెలుస్తవి. హంగులను తగ్గించుకొనవలసి వస్తుంది. కాని, అందువల్ల సుఖము, శాంతి లభిస్తవి. కుటుంబంలోని వారితో చిన్న చిన్న అభిప్రాయ భేదాలు వస్తు ఉంటవి అయితే దైవానుగ్రహంవల్ల ఆరంభంలోనే సమసిపోతూ ఉంటవి. వ్యవహారరంగంలో ధైర్యం లభిస్తుంది సమయంలో అయినవారి వల్ల ధనసహాయం లభిస్తుంది. 11, 12 తేదీలలో లాభవార్తలు, మంచి స్నేహం.

*　　*　　*

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

ఇంతకుముందుకన్నా గ్రహబలం బాగున్నది. కుటుంబంలో క్షేమము, లాభము బాగుంటవి. ఆదాయం పెద్దగా పెరుగదు. కాని, కోర్టు కచేరీలలో మీమాటకు మదింపు లభిస్తుంది. వృత్తిలో మంచివారి సహాయ సంపదలు లభిస్తవి. ప్రసంగాలలో ఎవ్వరియందు నిరసన కనపరచవద్దు. శుభకార్య ప్రయత్నాలు అనుకూలిస్తవి. స్నేహం కల్పించుకొని అప్పు అడిగేవారు తటస్థపడతారు. మీ వ్యాపార వ్యవహారాలలో అన్యాయాపరుల బాధ కొద్దిగా ఉంటుంది. ప్రస్తుతం ప్రయాణాలు వేయటం అంత మంచిదికాదు. ఏ విషయంలోనూ పట్టు పట్టకుండా ఫలితం అందినంతవరకు చేజిక్కించుకొనటం మంచిది.

*　　*　　*

వృశ్చికం:

(విశాఖ 4-వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

మీ సంకల్పానికి అడ్డు నిలుస్తున్న సమస్యలు సమసిపోతవి. అధికారులు అనుకూలిస్తారు. పెద్ద మొత్తాలలో ఖర్చులు, ప్రయాణము, దేహశ్రమ, తప్పవు. కుటుంబంలో అనుకూలమయిన కాలం. వృత్తిలో అభివృద్ధితో కూడిన మార్పు కనుపి

స్తుంది. లేనిపోని వార్తలు చెప్పి మిమ్మల్ని ఉద్రేకపరచేవారు ఉంటారు. తలవనితలంపుగా అనారోగ్య సూచనలు కనుపిస్తవి. ఇతరులవద్ద నుంచి రావలసిన ధనం వస్తుంది. ఇంతకు ముందు మీమీద ఉన్నటువంటి కార్యభారమును తగ్గించుకొన గలుగుతారు. ఈ సమయంలో వ్యవహారాల జోలికి వెళ్లటం మంచిదికాదు. 12, 13 తేదీలలో కార్యసిద్ధి, మిత్రలాభం.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ఈ వారం కుటుంబంలోను, వృత్తి, వ్యవహార రంగాలలో కూడా పరిస్థితులు సుముఖంగా గాకనిపించవు. మీరు న్యాయం మాట్లాడినా అవతలి వారి మాట నేర్పువల్ల మీరే తగ్గవలసి ఉంటుంది. మిత్రులు స్తోత్రం చేస్తారు. కాని, సమయంలో ఆదుకొంటారనే ఆశకనుపించదు. క్రొత్త ఆశలతోపాటు కొన్ని పథకాలు ఆరంభించగలుగుతారు. ఎంతో శ్రమపడి మీ కార్యక్రమాలను నెరవేర్చ గలుగుతారు. ప్రత్యేకంగా అనారోగ్యం చేయదు. కాని, మానసికంగాను, శారీరకంగాను బలహీనత తెలుస్తుంది. సంభాషణలలో విసుగుదల తోస్తుంది. ప్రయాణాలు లాభకరంగా ఉండవు. కాని, మానసికమైన సంతృప్తి తోస్తుంది. సంఘ కార్యాలలో శక్తికి మించిన భారం మీపై పడుతుంది.

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా. శ్రవణం. ధనిష 1, 2 పా.)

ప్రస్తుతం దేనికైనా మనుష్య ప్రయత్నం అవసరం. ఆదాయము, గౌరవము బాగుంటవి. కుటుంబంలో క్షేమ లాభాలకు లోపం కలుగదు. కాని, సంప్రదింపులలో అభిప్రాయాలు కలవటం కష్టం. దైవానుగ్రహంవల్ల ధనలోపం ఉండదు. వృత్తి వ్యాపారాలలో క్రొత్త పద్ధతులను అనుసరించవలసిన అవసరం కలుగుతుంది. మీ ఆహార విహారాలలో శ్రద్ధ వహించటం అవసరం. స్థిరాస్థుల మీద ధనం వినియోగిస్తారు. వారం రెండవ భాగంలో ఇతరులకు నీతులుచెప్పి మీరే పొరపాట్లు చేయటం జరుగుతుంది. ధైర్యము, ఆత్మ విశ్వాసము బాగుంటవి. అలంకార వస్తువులు కొంటారు. 13, 14 తేదీలలో మంచివారితో మైత్రి, శుభ వార్తలు, ప్రయాణం.

* * *

కుంభం :

(ధనిష 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

యధార్థంలో సాధారణ లోపాలు, ఇబ్బందులు ఉండకపోవు కాని, లోకుల దృష్టిలో మీ స్థితి చాలా బాగుంటుంది. కుటుంబంలోనివారి ఆరోగ్యం గురించి అక్కరగా ఉండవలసిన సమయం. ఖర్చుల విషయంలో జాగ్రత్తగా చూసుకొనండి. స్నేహితులను మంచి చేసుకొని మీ కార్యకలాపాలు సాఫీగా సాగేటట్లు చేసుకొన గలుగుతారు. అకస్మాత్తుగా కష్టవార్తలు తెలియగలవు యంత్రాలు, వాహనాలు మొదలయినవానివల్ల తలవనితలంపుగా బాధలు కలిగే అవకాశాలున్నవి. మీ మాటలలో పూర్వాపర విరుద్ధాలు లేకుండా జాగ్రత్తపడవలసిన సమయం. ఆదాయం మామూలుగా ఉంటుంది. గౌరవస్థితి బాగుంటుంది. 9, 10 తేదీలలో ఇష్టవస్తు లాభం, శుభవార్తలు.

మీనం:

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

సౌమ్యంగా కాలం జరుగుతుంది. శుభ సంతోషాలు కలసిరాగల సమయం. ప్రయాణాలు సుఖంగా సాగతగిన సమయం. విలువగల వస్తువులు కొంటారు. అప్రయత్నంగా వృత్తిలో అభివృద్ధి కనుపిస్తుంది. ఈ సమయంలో ఏపని తలపెట్టినా అవకాశం కలసివస్తుంది. రాజకీయాలలో పేరు ప్రతిష్ఠలు, మాట చలామణీ బాగుంటవి. వృత్తి ఉద్యోగాలలో దురుసుగా ప్రవర్తించే మనుష్యులను క్రమంగా మంచి మార్గానికి త్రిప్పుకొన గలుగుతారు. వ్యవహార కార్యక్రమాలలో చెప్పుకొనతగిన మంచి, చెడు మార్పులు ఏమీ ఉండవు. అనారోగ్యంగా ఉన్నామేమో మనే ఆందోళన కలుగుతుంది. అన్నివిధాలా విశ్రాంతి అవసరం. వారాంతంలో ధనలాభం, సంతోష వార్తలు తెలుస్తవి. ★

కొలంబా

27 వ పేజీ తరువాయి

ఉద్దేశం ఉన్నందుకు మరింతగా నీమీద నా ఆపేక్ష ఎక్కువవుతోంది. అలాగే ఆగుదాం. మంచిపని చేసినందుకు ఎప్పుడూ పశ్చాత్తాప పడక్కర లేదు.''

మిస్ లిడియాకి నిద్ర పట్టలేదు. ఏ శబ్దం విన్నా, అది ఆ ఇంటిమీద దాడి తీస్తున్న శబ్దమే అనిపించింది ఆమెకి. కొంత సేపటికి మనస్సు కుదుట పరచుకుంది కాని గాయపడ్డ వ్యక్తిమీదకి ఆలోచన పోయి, పాపం చలిలో కటిక నేలమీద ఎక్కడో పడుకుని ఉంటాడు కదా అనుకుంది. కేవలం ఒక బందిపోటు పరిచర్య మీద ఆధారపడుతూ ఉంటాడుకదా అని జాలి పడింది. ఆమె ఊహలు ఇంకా భయంకరంగా అయిపోయి పడుకున్న దల్లా లేచి ఇటూ, అటూ తిరగటం ప్రారంభించింది.

అది కొలంబా గది. ఒక గోడమీద 'క్రాస్' క్రింద, ఆర్సో బొమ్మ ఒకటి తగిలించి ఉంది. ఇది అతను 'అండర్—లెఫ్‌టినెంట్' దుస్తులలో ఉన్నప్పటిది. మిస్ నెవిల్ దానిని తీసి, కొంత సేపు దీక్షగా చూసి, తర్వాత మంచంమీద వెళ్ళి పడుకుంది.

ఆమెకి వెను వెంటనే నిద్ర పట్టింది. లేచేసరికి బాగా పొద్దు పొడిచింది. ఆమె మంచం ముందు నిశ్చలంగా నుంచునిఉన్న కొలంబా కనిపించింది. కళ్ళు తెరవగానే.

''మిస్ లిడియా మాది బీద ఇల్లు. బాగా నిద్ర పట్టి ఉండదు!'' అంది కొలంబా.

''విశేషాలేమిటి?'' అని అడిగింది మిస్ నెవిల్ లేచి కూర్చుంటూ.

చేతిలోనే ఉండిపోయిన ఆర్సో చిత్రపటం సంగతి గుర్తుకివచ్చి రుమాలుతో దానిని కప్పిపుచ్చటానికి ప్రయత్నించింది. ''చెప్తాగా'' అంది కొలంబా చిరు నవ్వుతో.

అని చిత్రపటం తీసుకుంటూ, ''పోలిక బాగా వచ్చిందంటారా?'' అని అడిగింది.

''అయ్యో!.....'' అంది మిస్ నెవిల్ కంగారు పడుతూ. ''ఏమిటో తెలీకుండా ఈ పటం తీశాను.. ఏదేదో సద్దేశాను ఇక్కడ.......నాకు తెలీకుండానే........మీ అన్నగారి సంగతేమిటి?''

''బాగానే ఉన్నాడు. జియకాంతో ఇక్కడికి తెల్లవారు జామునే వచ్చాడు. మీ కోసమని ఒక ఉత్తరం ఇచ్చాడు. ఆర్సో నాకు రాయనేలేదు. అయినా ఫరవాలేదు. చెల్లెళ్ళు ఈర్ష్య పడక్కర లేదు.......రాయటానికి బాధ పడ్డాడని జియకాంతో చెప్పాడు. జియకాంతో చేరాత చాలా బావుంటుంది—తను రాసిపెడతా నన్నాడుట కాని — మా అన్నయ్య ఒప్పుకోలేదు. పెన్సిల్‌తో రాశాడుట అంతా. ప్రతి కదలికతో విపరీతమయిన బాధ పడ్డాడుట.''

మిస్ నెవిల్ ఉత్తరం చదువుకుంది. ఇంకెవరూ చదవరాదని కాబోలు, ఇంగ్లీషులో వ్రాసి ఉంది.

''నా విధి వ్రాత బాగా లేదు. నా శత్రువులు ఏమంటున్నారో, నన్ను గురించి ఏమి అపవాదులు పెంచుతున్నారో నాకు తెలియదు. దానికి నేను బాధ పడను. మీరు అపార్థం చేసుకోకుండా ఉంటే చాలు. మిమ్మల్ని చూసినప్పటినుంచీ నా మనసు మనసులో లేదు. ఈ దారుణమయిన సంఘటన జరిగే వరకూ నా బుద్ధి తక్కువ తనాన్ని గ్రహించ లేకపోయాను. మీరు నా కొక చిన్న కానుక ఇచ్చారు. దానిని భద్రంగా ఉంచగలననే ధైర్యం నాకు లేదు.... నామీద మీకుండే నమ్మకం వ్యర్థం కాకూడదనే నా కోరిక. బహుశ, నేనెంత పిచ్చివాడినిగా ప్రవర్తించానో మీ కానుక జ్ఞాపకం చేస్తుందేమో..... కొలంబా మీకు తిరిగి ఇచ్చేస్తుంది. ఇక సెలవు! కార్సికా వదిలిపోతారు కదా.......ఇక తిరిగి కలవ మేమో........కాని మా చెల్లెలితో మాత్రం నేనంటే అల్ప భావం లేదని చెప్పండి. మీ సదభిప్రాయం కోసం నిత్యం పాటు పడతాను.

ఒ. డె. రె.

మిస్ లిడియా ఉత్తరం చదవటం ముగించిన తర్వాత కొలంబా ఆమెకి ఆర్సో తిరిగి ఇవ్వమని పంపిన ఈజిప్షియన్ 'కానుక'అందించింది. 'స్కారాబ్' పొదిగిన ఆ ఉంగరం మళ్లీ తన వేలికి తొడుక్కుని, తీసివేసి మళ్లీ తొడుక్కుని, తీసివేస్తూ కొంతకాలం అలాగే తలవంచి ఉండిపోయింది మిస్ నెవిల్.

''మిస్ నెవిల్'' అంది కొలంబా. ''మా అన్నయ్య ఏమి రాశాడో అడగవచ్చా? ఎలా ఉన్నాడో చెప్పాడా?''

''కాని........'' అంది మిస్ లిడియా, ముఖం ఎర్రపడగా, ''ఏమీ చెప్పలేదు......మా నాన్నగారికి చెప్పమన్నాడు.........గ్రామాధికారి ఏర్పాట్లు......''

కొలంబా వ్యంగ్యంగా నవ్వుతూ, మంచంమీద కూర్చుని ఆమె చేతులు తన చేతులలోకి తీసుకుని, తీక్షణంగా ఆమె వైపే చూసింది. ''జవాబు రాయరా? పాపం, సంతోషిస్తాడు! ఏమనుకుంటారో అని ఇంతకుముందే చెప్పలేదు.''

''నా వల్ల వీలయిందల్లా చేస్తాను......''

''ప్రస్తుతం ఉత్తరాలు పంపలేము మనం. గ్రామాధికారి తిరిగి వచ్చేశాడు. మిస్ నెవిల్, మీకే మా అన్నయ్య సంగతి బాగా తెలిస్తేఇంకా ఎంత ఇష్టపడేవారు! ఎంత మంచివాడు! ఎంత ధైర్యం! ఎంత పని చేశాడు! ఒంటరిగా ఇద్దర్ని

భారీ యెత్తున దేశరక్షణకు
ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి

కొలంబా

హతమార్చి తను కేవలం గాయంతో తప్పించుకున్నాడు.

గ్రామాధికారి తిరిగి వచ్చాడు. తనతోబాటు ప్రాసిక్యూటర్‌నీ తీసుకు వచ్చాడు. ప్రియత్రనెరాలో వైరాలని మళ్ళీ పెంచే ఈ దుస్సంఘటన తను ఎదురు చూసిన వాటన్నిటినీ తల్లక్రిందులు చేసింది. వచ్చిన త్వరలోనే కర్నల్ గారినీ, ఆయన కుమార్తెనీ కలుసుకున్నాడు. "ఈ పోట్లాటకి సాక్షులు లేదు. చూశారా! ఈ ఇద్దరూ తక్కువ వారేమీకాదు—అటువంటప్పుడు దెల్లారిబ్బియా వంటరిగా వీరిద్దరినీ చంపేశాడని నమ్మటం కష్టం. ఇతర బందిపోట్లు ఎవరో సాయపడి ఉంటారు."

"వీల్లేదు!" అని అరిచాడు కర్నల్‌గారు. "ఆర్సో దెల్లారెబ్బియా ఆత్మాభిమానం కలవాడు! అతని తరఫున జవాబు చెప్పగలను నేను!

"నిజమే" అన్నాడు గ్రామాధికారి. "కాని ప్రాసిక్యూటర్ అంత సుముఖంగాలేడు. ఆయన చేతుల్లో మరొక సాక్ష్యం ఉంది. అది దెల్లారెబ్బియా అర్సాందుచ్చియోని బెదిరిస్తూ రాసిన ఉత్తరం. ద్వంద్వయుద్ధానికి సవాలుచేసి దొంగతనంగా చంపివేశాడని ఆయన అనుమానం"

"ఈ అర్సాందుచ్చియో సవాలు పుచ్చుకోలేదు కదా!"

"ఇక్కడ పద్ధతే వేరు. దొంగ దాడి తియ్యటం, వెనకగా వచ్చి చంపెయ్యటం ఇక్కడవారి అలవాటు. అయితే ఒకటి దెల్లా రెబ్బియా పక్షంలో ఉంది. ఒక చిన్న పిల్లకి నాలుగు తుపాకి పేలుళ్ళు వినిపించాయట. మొదటివి రెండూ మామూలుగానూ తర్వాతవి రెండూ బాగా గట్టిగానూ వినిపించాయట. ఈ చివరివి రెండూ దెల్లా రెబ్బియా తుపాకివని చెప్పటానికి వీలుంది. కాని, దురదృష్టవశాత్తూ ఈ చిన్న పిల్ల ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఒక బందిపోటు తాలూకు."

"అయ్యో" అంది మిస్ లిడియా. ముఖం పూర్తిగా ఎర్రపడగా. "మేము ఇక్కడికి వస్తూ ఉండగా దారిలో పేలుళ్ళు విన్నాము. ఆ అమ్మాయి చెప్పినట్లుగానే ఉన్నాయి"

"నిజంగానా? ఇది చాలా ముఖ్యం. కర్నల్‌గారూ మీరూ అంతేనంటారా?"

"అవును" అన్నది మిస్ నెవిల్ ఉత్సాహంతో "మా నాన్నగారికీ ఈ ఆయుధాల విషయం బాగా తెలుసు. అప్పుడే అన్నాడు. నా తుపాకితో కాల్చేస్తున్నాడే దెల్లారెబ్బియా!"

"మీరు గుర్తు పట్టగలిగిన ఈ తుపాకి పేలుళ్ళు చివర వినిపించాయా?"

"చివరేకదు నాన్నగారూ?"

కర్నల్‌గారు మర్చిపోయారు. కాని ఈ సమయంలో కూతురు చెప్పిన దానిని సందేహించటానికి సాహసించలేదు.

"ఈ విషయం ప్రాసిక్యూటర్‌కి చెప్పటం అవసరం. కర్నల్‌గారూ, వైద్యుడు శవాలని పరీక్ష చేశాడు. గాయాలు ఏ తుపాకితో పడ్డవీ చెప్తాడు"

"ఆర్సోకి నేనే ఇచ్చానుదాన్ని! సముద్రంలో పారేసినా బావుండేది......కాదు......అంటే...... బలేవాడు! రెండు చేతులూ వాడకుండా ఎలా పేల్చాడో అర్థం కావటం లేదు......'!' (సశేషం)

వంచిత

15 వ పేజీ తరువాయి

దిగా మంచంమీద పడుకోబెట్టాం. నాకం చెయ్యాలో తోచటంలేదు. విజయ చన్నీటితో తండ్రి మొహం తుడిచింది. మెల్లిగా విసన కర్రతో విసర సాగింది. కాస్సేపటికి కళ్ళు తెరిచాడు మూర్తి.

"ఎలా ఉందన్నయ్యా" అన్నాను.

మరేం ఫరవాలేదమ్మా. అపుడపుడు ఇలా వస్తూనే ఉంటుంది" అన్నాడు విజయ బీరువాలోనుండి రెండు మాత్రలు తెచ్చి మింగించి నీళ్ళు తాగించింది. "ఇక కాస్సేపు మాట్లాడకుండా పడుకోనాన్నా" అంది.

ఇంతసేపయ్యాక విజయ నా వైపు చూసింది.

చూపుతో ఉన్న భావం గమనించి తప్పు చేసిన దానిలా తల వంచుకున్నాను. కొంపదీసి మూర్తితో నే నన్న మాటలు వినలేదుగదా అనుకున్నాను.

బయటికివచ్చి మూర్తి ఆరోగ్యం గురించి కాస్సేపు మాట్లాడి ధైర్యం చెప్పి 'ఏం అవసరమొచ్చినా నాకు కబురు చెయ్యటం మరవకు" అని చెప్పి వచ్చేశాను.

అలా వచ్చేశానేగాని నా మనసులో కలతగానే ఉంది. నేను యథాలాపంగా అన్నమాటలు విజయ విందా లేదా? సుమిత్ర గురించి విజయకు చెపితే పరిణామం ఎలా ఉంటుంది? అన్న ఆలోచనలతోనే యాంత్రికంగా ఇంటిపనులు చేసుకో సాగాను.

మరుసటిరోజు ఉదయం ఇంకా అప్పుడే తెల్లవారింది. నిద్రలేచి కాఫీ నీళ్ళ పడేస్తున్నా. బయట విజయ గొంతు వినపడింది. పనిపిల్ల గాబోలు తలుపు తీసినట్టుంది. ఇంకో నిమిషంలో "పిన్నీ" అంటూ లోపలకు అడుగు పెట్టింది. విజయ. భయాన్ని అణచుకుంటూ విజయవైపు చూశాను.

"నాన్న కులాసాగానే ఉన్నారు" అంది అమ్మయ్య అనుకుంటూ.

"రా కూర్చో. ఏం తూర్పు తెల్లారకముందే ఇలా వచ్చావ్?" అన్నాను.

"మరేం లేదు. నీతో ఒక్కమాట చెప్పాలని..."

"అదేమిటే, నిన్ననేగదా వచ్చాను, అప్పుడే చెప్పలేక పోయావా? ఉదయమే పరిగెత్తుకుంటూ వచ్చావ్? ఇంతకూ ఏమిటా రహస్యం?" అన్నాను. తలెత్తి నా వైపు చూసింది. మహా చెడ్డపిల్ల విజయ. వాళ్ళమ్మలాగే మొహం చూసి, మనసులో భావాలు ఇట్టే చదివేయగలదు.

"ఈ మారు ప్రయాణంలో నీ కెక్కడో ఆమె తటస్థ పడినట్టనిపించింది నాకు."

గతుక్కుమన్నాను. ఇంత తెలివైన పిల్ల. అంతా చెప్తే అర్థం చేసుకోలేక పోతుందా అనుకుంటూ ఉత్సాహంగాతలెత్తి చూశాను. నా వైపే. చూస్తోంది విజయ. ఆ పిల్ల మొహంలోని కాఠిన్యాన్ని చూసి నా నోట్లో మాట నోట్లోనే ఉండిపోయింది

"నిజంకాదూ?" అంది.

"అబ్బే మాట వరసకేదో అన్నాను. అది విన్నటున్నావు. అంతేనా?" అన్నాను. నవ్వటానికి ప్రయత్నిస్తూ.

"నువ్వేదో దాస్తున్నావు పిన్నీ"

సూటిగా తన వైపు చూడలేక మరిగిన నీరు ఫిల్టర్లోపోసే నెపంతో అటు తిరిగి.

"నీ దగ్గర నాకు దాపరిక మేమిటే పిచ్చితల్లీ" అన్నాను. పాలు కుంపటిమీద పెట్టి ఇటు తిరిగాను.

"అలా అయితే మంచిదే పిన్నీ. అయినా నీతో ఓ మాట చెప్పిపోదామని వచ్చాను. ఆమె అంటే నాన్నకెంత అభిమానమో నాకంత అసహ్యం. ఎలాంటి పరిస్థితుల్లోనూ దాన్ని చెరిపేసుకోలేను నేను. ఆమె నా చిన్నప్పుడే చనిపోయినా నా కింత బాధా, మనోక్లేశం ఉండేవికావు. నాన్న ఇప్పటికే ఆ బెంగతోనే కృశించి పోతున్నాడన్న విషయం నీకూ తెలిసిందే. నాన్న అనుకుంటున్నట్టు ఆమె చనిపోయి ఉంటే మంచిదే. కాని అలా కాక......" అంటూ నా వైపు చూసింది.

"అంతే, అంతే మీ నాన్న అనుకుంటున్నదే నిజమయ్యుంటుంది" అన్నాను. ఆ నిమిషంలో సుమిత్రని కలుసుకున్న నా దురదృష్టానికి నిందించుకున్నాను. సుమిత్ర నిజంగానే చనిపోయిఉంటే ఎంత బావుండేది అని కూడా అనుకోకపోలేదు.

"అది సరే. అలా కాకపోయినప్పటి మాట నేను చెబుతున్నది. ఆమెను చూడాలన్న వాంఛ ఏమాత్రమూ లేదు నాకు. చూస్తే భరించ లేనేమో కూడా. నాన్న పరిస్థితి ఏమి బాగా లేదని నీకూ తెలుసు. ఏమాత్రం షాక్ తగలకూడదని డాక్టర్ హెచ్చరించారు. నిన్న నువ్వన్న మాటలకే నాన్న ఎలా అయిపోయాడో నువ్వే చూశావుగా. ఇక ఇపుడు ఎక్కువ సంతోషాన్నిగాని, దుఃఖాన్నిగాని భరించే స్థితిలో లేడు నాన్న. ఎలాంటి పరిస్థితుల్లోనూ మా ఉనికి ఆమెకు తెలియపర్చవద్దు".

కొంతసేపు నిశ్శబ్దం ఆవరించింది. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చాయి విజయ మాటలు.

"నాన్నను కూడా నాకు లేకుండా చెయ్యకు పిన్నీ"

విజయ ఇంతవరకూ ఆపుకున్న కన్నీరు ఇక లోపల ఉండలేనని మారాం చేస్తూ బయటికి రాసాగింది. ముత్యాల్లా బుగ్గలమీద ప్రవహిస్తున్న కన్నీటిని నా కొంగుతో తుడిచాను. ఆ పిల్ల కన్నీటికి, ఎలాగైతేనేం కారకురాలనయిన నా మీద నాకే కోపం వచ్చింది. ఇపుడు పరిస్థితిని చక్కబెట్టవలసిన బాధ్యత కూడా నామీదే పడింది.

"విజయ నోమారు చూడాలని ఉంది" అన్న సుమిత్ర దీన వదనాన్ని నా మనోఫలకం మీదనుంచి తుడిచి వేయటానికే నిశ్చయించుకున్నాను. అంతకన్నా ముఖ్యమయింది విజయ భవిష్యత్తు.

విజయ చుబుకాన్ని పట్టుకుని కళ్ళనీరు తుడుస్తూ,

"అలాంటిదేం జరగదు. నన్ను నమ్ము. నువ్వు నిశ్చింతగా ఉండు. జీవితంలో ఆమెను కలుసుకుంటానేమో నన్న బెంగపెట్టుకోకు" అన్నాను ప్రేమగా, దృఢంగా.

"నమ్మమంటావా"అన్నట్టు నా వైపు చూసింది విజయ.

"నన్ను నమ్ము తల్లీ. నీతో అబద్ధా లెందుకు చెబుతాను నేను......"

సమాధానంగా ఓ నిట్టూర్పు విడిచి లేచి నిల్చుంది విజయ. మొహం ప్రశాంతంగా ఉంది. అది చూసి నా మనసు కుదుట బడింది.


"కాఫీ కలుపుతున్నా విజ్జీ. తాగి వెడుదువుగానిలే" అంటున్న నా మాటలు వినిపించుకోకుండా,

"ఇక టైం లేదు పిన్నీ. నాన్న నిద్రలేచేసరికల్లా నే నక్కడ ఉండాలి" అంటూ ఎలా వచ్చిందో అలాగే చకచకా వెళ్ళిపోయింది.

* * *

కోర్కెలకు బానిసయి, పరిస్థితులకు లొంగిపోయి, భవిష్యత్తు గురించి ఆలోచించకుండా తన బిడ్డను తల్లి ప్రేమనుండి వంచితురాలిగా చేసుకున్న సుమిత్ర ఈనాడు కూతురినుండి ప్రేమను పొందాలని కోరుకోవటంలో అర్థం లేదనిపించిందా క్షణంలో. ఆ కారణంగానే ఈ రోజు తనూ, తన బిడ్డ ప్రేమనుండి దూరమయింది.

అయినా.....అయినా....ఇప్పుడప్పుడూ నా ఉత్తరానికోసం ఆత్రుతతో ఎదురుచూసే, మాతృప్రేమతో జ్వలించే సుమిత్ర దీనవదనం నన్ను కలత పెడుతూనే ఉంటుంది. కాని అలాంటప్పుడు 'నాన్నను కూడా నాకు దూరం చెయ్యకు పిన్నీ' అన్న విజయ దీనమైన మొహం నా ముందు నిలచి, నేను చేసింది మంచిపనే నన్న సంతృప్తిని కలగ చేస్తుంది నాకు. ★



"మీరేకదండీ డైరక్టరుగారూ ! పాత్రలో లీనమై నటించాలని చెప్పింది ?"



రావణ వృత్తాంతము

ఓ భరద్వాజా ! అట్లు బ్రాహ్మణ శాప వశంబున ప్రతాపభానుడు, అతని తమ్ముడు అరిమర్దనుడు. మంత్రి ధర్మరుచి కాలాంతరమున పులస్త్య బ్రహ్మ వంశంలో రావణ, కుంభకర్ణ, విభీషణులై పుట్టిరి. ప్రతాపభానుని పుత్రుడు, సేవకులు, తదితర బంధువులు రాక్షసులుగా అవతరించిరి.

ఇరువది చేతులు పదితలలు గలిగిన రావణుడు అతుల బలపరాక్రమముచే లోక భీకరుడుగా నుండెను. కొండంత శరీరముతో కుంభకర్ణుడు అరిభయంకరుడై కన్పట్టు చుండెను. వీరు పులస్త్య బ్రహ్మ వంశ సంజాతులైనప్పటికీ బ్రాహ్మణ శాపము వలన తమోగుణ ప్రధానులై రాక్షసులుగా వర్తించిరి.

రావణ కుంభకర్ణ విభీషణులు ముగ్గురు అడవులకు పోయి వేలాది సంవత్సరములు ఘోరమైన తపస్సు చేసిరి.

బ్రహ్మాది దేవతలు దుష్కరమైన వారి ఉగ్ర తపస్సుకు ప్రసన్నులై వారిని సమీపించి వరము లడుగుమని కోరిరి. అంతట రావణుడు నరవానరులు తప్ప మరి యే ప్రాణిచేతను చావు లేకుండునట్లు వరము ప్రసాదింపుమని పరమేష్ఠిని ప్రార్థించెను. సరస్వతి ప్రేరణచే కుంభ కర్ణుడు మతి దప్పి దీర్ఘ నిద్రకోరెను. విభీషణుడు సవినయ మనస్కుడై తాపస మైత్రి శ్రీపతిపై భక్తి అనుగ్రహించమని పద్మభవుని వేడెను. పార్వతీ ! అప్పుడు నేనూ, బ్రహ్మ ఆ ముగ్గురికి వారివారి అభీష్ట ప్రకారము వరము లిచ్చివచ్చితిమి.

సముద్రము మధ్య త్రికూట పర్వతముపై అతిలోక సుందరమగు లంకా పట్టణ ముండెను. కోటి మంది కుబేరుని యక్షులు నిరంతరమా లంకను కాచుచుండిరి. వర గర్వితుడగు రావణుడు రాక్షస సైన్యములతో దాడిచేసి లంకాపురిని ఆక్రమించెను. లంక శత్రు దుర్భేద్యమై యుండుట గమనించి దనుజాధికుడు దానిని తనకు రాజధానిగా చేసుకొనెను. ఆపైన రావణుడు మయుని కూతురు మండోదరిని వివాహమాడి తన తమ్ములకు కూడ పెండ్లిండ్లు చేసెను.

వరగర్వితుడు, బలదర్పితుడగు లంకేశుడు ఒకప్పుడు కుబేరునిపై దాడి వెడలి, అతని పుష్పక విమానము లాక్కొనెను. మరొకప్పుడు అహంకారంతో వినోదార్థమై కైలాసగిరిని కదలించి తన భుజ బలమును పరీక్షించు కొనెను.

ఇవ్విధముగ వరబలోద్ధతుడైన రావణుడు వీర విహారము చేయుచూ అజేయుడయ్యెను. రావణుని రాజ్యము నిత్యము విస్తరించుకొనుచు, సుఖ సంపదలతో దినదిన ప్రవర్ధమాన మగుచుండెను.

అరిభయంకరుడగు కుంభకర్ణుడు మహా బలశాలి. యుద్ధమున వాని నెదుర్కొన గలిగిన యోధుడే లేడని చెప్పవచ్చు. కానీ త్రాగుట తినుట నిద్రించుట ఈ మూటి యందు వానికి మమకార మెక్కువ. దశగ్రీవుని తనయుడు మేఘనాథుడు అమేయధైర్య సాహసములు గల ధీశాలి. విహారార్థము వానికి తరచు దేవతల పైకి దండెత్తి పోవుటయన్న సరదా. వీరుగాక కాలాంతకుకైన అతికాయు, అకంపన, ధూమకేతు, వజ్రదంతు దాది దనుజవీరుల బలపరాక్రమములు వర్ణింప నలవికాదు. ఈ రాక్షసులందరు మాయోపాయులు, కామరూపులు, దయా దాక్షిణ్యములెరుగని దుర్మదాంధులు.

దనుజేశుని దుండగములు

వరోద్ధతి దానికితోడు రాక్షస రాజ్యము ప్రాప్తించగనే దశకందరుడు దురహంకార పూరితుడయ్యెను. ఒకనాడతడు నిండు పేరోలగమందు తనవారి కిట్లు ఉద్బోధించెను.—

"ఓ రాక్షస వీరులారా ! దేవతలు మనకు ఆగర్భ శత్రువులు. వారిని వేయి విధములు వేధించి బాధించి వధించుట మనకు విద్యుక్త ధర్మమై యున్నది. కానీ వారు మన చేతికందక, కంటికి కనబడక తప్పించుక తిరుగుచున్నారు. వారిని నిర్జించుట బహు కష్టముగా నున్నది. కనుక మీరు నేటినుండీ నిర్దయులై బ్రాహ్మణులు చేయు యజ్ఞము, యాగాది క్రతువులు ఎక్కడ బడితే అక్కడ నిర్దాక్షిణ్యముగ ధ్వంసము చేయవలసినది. దానివలన అమరులు అన్నాహారములు చిక్కక దుర్బలులై నీరసించి మన ఎదుట బడెదరు. అపుడు మనమా సురాధిపులను చంపుటో, సాధించుటో సుకర మగును." అని బోధించి దనుజాధిపుడు తన బలమును లోకములపై ఉసి కొల్పెను. తదుపరి పంక్తి కంధరుడు తన పుత్రుడగు మేఘనాథుని బిలిచి, వానిని నిర్జరులను నిర్జించి రమ్మని ఆజ్ఞాపించి పంపెను.

ఇవ్విధముగ లోక విరావణుడగు రావణుడు దనుజయోధులను దివిజులపైకి బంపి తాను స్వయముగ గదబుచ్చుకొని విజిగీషుడై లోకములపై విరుచుక పడెను. అతి బలోద్ధతుడు దశకంధరుని పద ఘట్టనలకు భూమి కంపించెను. వాని ఘన గర్జనలకు దేవాంగనల గర్భస్థ పిండములు జారిపడెను. వాని ధాటికు ముల్లోకములు గడగడ లాడిపోయెను. దుర్ధర్షుడగు దశాస్యుని దౌష్ట్యమునకు వెరచి స్వర్లోకవాసులు పరుగులెత్తి మేరుపర్వత గుహలలోనికి వెళ్ళి దాక్కొనిరి.

విజయోత్సాహి దశగ్రీవుని దండయాత్ర దశదిశల నిరాటంకముగ జరిగెను. వాని భయంకర హుంకారధ్వనికి దిక్కులు దద్దరిల్లెను. దిక్పాలురు ధృతిచెడి భయకంపితులై దిక్కుల కొక్కరు పరుగులెత్తిరి. అమరావతి అలకాపురి మున్నగు దిక్పాలుర పట్టణములు ధ్వంసము చేయబడి నిర్మానుష్యములై పోయెను. భండన భీముడగు దశకంఠుని ఢీకొని నిర్జరులు నిర్వీర్యులైరి, యక్షులు పక్షులవలె పారిపోయిరి, కిన్నరుల పీచమడగెను. సిద్ధులు బద్ధులై బాధింప బడిరి. మునులు, బ్రాహ్మణులు నిస్తేజులై నింగికి చూడసాగిరి.

యుద్ధోన్మాది దశగ్రీవుడు విజయోత్సాహియై తన్నెదిరించు వీరునికై ముల్లోకములు గాలించెను. కానీ దుర్ధర్షుడు దశకంధరుని ధర్షింపు యోధుడు ఒక్కడు కూడ లేకపోయెను. తన్నెదుర్కొను ధైర్యము లేక భీరువులై పారిపోవుచున్న వేల్పు దొరలనువాడు ధిక్కరించి తూలనాడెను. అవక్రపరాక్రమోపేతుడగు రావణుని ధాటికి దిక్చక్ర మంతయు దాసోహమనెను. విశ్వములోని వివిధ

ప్రాణికోటి వాని పీరత్వమునకు వశమయ్యెను. దేవగరుడ గంధర్వ నాగాంగన లెందరో బలాత్కరించి వారిని తన భార్యలుగా చేసుకొనెను. తండ్రి ఆజ్ఞ ప్రకారము మేఘనాథుడింతకు మునుపే దేవలోకముపై దాడివెడలి దేవతలను ధర్షించి దేవేంద్రుని చెరబట్టెను. విర్జరేసుడు నిర్బంధింపబడుట తెలుసుకొని పరమేష్ఠి పరుగెత్తుకొని వచ్చెను. బ్రహ్మ మేఘనాధుని కనేక వరములిచ్చి వేల్పుదొరను విడిపించెను. నాటినుండీ రావణ పుత్రుడు మేఘనాధుడు ఇంద్రజిత్తుడను పేరుతో జగద్విఖ్యాతి నొందెను.

భరద్వాజా! అసురేశుడు వాని అనుచర బృందము చేసిన ఘోర కృత్యములు వర్ణింప శక్యముగాదు. పాపాత్ములు, మాయోపాయులైన దైత్యులు వీరవిహారము చేసి లోకత్రయమునకు గగ్గోలు పరచిరి. గోదేవతా బ్రాహ్మణులు యమ యాతనలకు లోనైరి. జపములు, తపములు వేదాధ్యయనములు, పూజలు సదాచారములు మంటగలిసెను. ధర్మము నశించి అధర్మము ప్రబలెను. జారులు జూదరులు స్వైర విహారము చేయుచూ లోక మర్యాదలను మట్టు పెట్టసాగిరి.

భూదేవి ఆక్రందన

దైత్యుల్ల దౌష్ట్యములక వారి దుశ్చేష్టలకు ధరణీతల మంతయు తల్లడిల్లి పోయెను. 'పర్వతములు, సముద్రములు, వనములు, నదులు మున్నగు వాని కంటే ఒక్క పాపాత్ముడు భారము గదా! ఇంతమంది పాపాత్ములను నేనెట్లు భరించ గల'నని భూదేవి ఆక్రదించెను. లంకేశుని భయముచే భూదేవి గోప్యముగా గోరూపమెత్తి దేవతలున్న చోటికి వెళ్ళెను. నిస్సహాయులగు నిర్జరులు ఋషులు భూదేవిని వెంటబెట్టుకొని బ్రహ్మ వద్దకు వచ్చిరి. భూదేవి పరమేష్ఠికి తన బాధలు వర్ణించి చెప్పి వలవల యేడ్చెను. పద్మ భవుడు వారి ఆర్తనల నాలంచి, విచార స్వరమున వారికి తన అసమర్థతను తెలియజేసెను. తదుపరి, 'ఆ శ్రీహరిని స్మరింపుడు, అతడొక్కడే మీ బాధలను నివారింపగల సమర్థుడు' అని సలహా ఇచ్చెను.

అపుడు అమరాదులు విష్ణువు వైకుంఠము నందున్నాడో లేక క్షీరసాగర మందున్నాడో యని తమలో తాము తర్కించుకొనసాగిరి. పార్వతీ! అపుడు నేను వారికి శ్రీమన్నారాయణుడు సర్వ వ్యాపకుడనీ, భక్తిచే భజించిన పరమాత్ముడు ప్రసన్నుడు కాగలడని బోధించితిని.

అంతట బ్రహ్మముకళిత హస్తుడై— "హే ఆర్తత్రాణ పరాయణా! అవాఙ్మానస గోచరా! భక్త కల్పద్రుమా! రాక్షసాంతకా! సురనాయకా! సచ్చిదానందా ఓ కృపానిధీ! జగద్బాంధవా! నీవు సృజించిన లోకములకు భయము కలిగిన నపుడు నీవే దానిని నివారించ గలవు. ఓ జగన్నాధా! త్రింశత్కోటి దేవతలు, వసుంధర, మునులు, సిద్ధులు, భయాతురులై రక్షించమని నిన్ను వేడుచున్నారు. కరుణించి లోకములను కాపాడు దేవా!" యని వైకుంఠ వాసుని స్తుతించెను. వారి దీనాలాపములకు దైవ హృదయము ద్రవించి పోయెను. అప్పుడు వేల్పులకు వినబడునట్లు అంతరిక్షము నుండీ భగవద్వాణి ఇట్లు వినవచ్చెను.—

"ఓ బ్రహ్మ మహేశాది వేల్పులారా! మీరు భయపడకుడు. త్వరలోనే మీకు వాటిల్లిన ఇక్కట్టులు తొలగి పోగలవు. నా వర ప్రభావమున ఇప్పటికే అయోధ్యలో అదితి కశ్యపులు కౌసల్యా దశరధులుగా అవతరించి యున్నారు. వారదుని వచనముల ప్రకారము నేను వారి గర్భమున మానవునిగా జన్మింతును. నా సర్వాంశములతో రఘుకులమున జన్మించి భూభారమును హరించెద. మీరు మీ నిజనివాసములకు పోయి నిర్భయులై యుండుడు."

దేవవాణి దివ్య సందేశము వినిభూదేవి, బ్రహ్మాది దేవతలు పరమానంద భరితులైరి. అంతట నలువ నాకవాసులనుద్దేశించి—మీరు వెంటనే భూలోకమున వానరులై పుట్టవలసి—నదని సూచించెను. అనంతరము సర్వులు సంతోషముతో తమతమ నివాసములకు చనిరి. దేవతలు పరమేష్ఠి సూచన కనుగుణ్యముగ భూలోకము వానరులై పుట్టి స్వామి రాకకై నిరీక్షించుచుండిరి.


భరద్వాజా! రామావతారమునకు గల కారణములు ఇంతవరకు పేర్కొంటిని. ఇక ముందు జరుగబోవు కథ చెప్పబోవుచున్నాను సావధానమనస్కుడవై ఆకర్ణించ వలసినది— అని యాజ్ఞవల్క్య ఋషి మిగత వృత్తాంతము చెప్ప నారంభించెను.

శ్రీరామ జననము

సరయూ తీరమున గల కోసల దేశమునకు అయోధ్య రాజధాని.

"అవధపురీ రఘుకుల మనిరావ్
బేద బిదిత తేహి దశరథ నావ్
ధర్మ ధురంధర గుననిధి గ్యానీ,
హృదయ భగతి మతి సారంగ పానీ,

సకలగుణ సంపన్నుడు, ధర్మధురంధరుడు, జ్ఞాన సంపన్నుడగు ఇక్ష్వాకు వంశరాజా దశరధుడు కోసల రాజ్యము వేలుచుండెను. దశరథ



రామచరితమానస్

నికి కౌసల్య, కైక, సుమిత్రయను ముగ్గురు భార్యలుండిరి. దశరథునికి బహుకాలము నుండి సంతాన ప్రాప్తి లేనందున చింతా క్రాంతుడై యుండెను.

ఒక దినము నృపాలుడు తన కుల గురువగు వసిష్ఠ మహర్షిని దర్శించి తనకు సంతాన ప్రాప్తి కల్గుటకు మార్గోపాయము సూచించమని వేడుకొనెను. అందుమీదట వసిష్ఠుడు — రాజా విశ్వ విఖ్యాతులగు నల్వురు పుత్రులు నీకు పుట్ట గలరు, దుఃఖించకుమని— దశరథుని ఓదార్చి పంపెను.

ఇది జరిగిన కొద్ది కాలమునకు వసిష్ఠ మహర్షి ఋష్య శృంగుని రావించి, అతని అధ్వర్య మున పవిత్రమగు పుత్ర కామేష్ఠి యజ్ఞము చేయించెను. ఆ మహోమ గుండము నుండి అగ్ని దేవుడు ప్రత్యక్షమై రాజున కొక పాయస ముంచిన పాత్ర ఇచ్చి— "దశరథ భూపాలా! వసిష్ఠుడు ఊహించిన ప్రకారము నీ కోరిక నెరవేరగలదు. నీవు ఈ పాయసమును నీ ముగ్వురి భార్యలకు యథోచితముగ పంచి పెట్టుము." అని చెప్పి—వీతిహోత్రుడు అంతర్హితుడయ్యెను.

తదుపరి క్ష్మాపాలుడు ఒకానొక శుభ ముహూర్తమున శుచియై తన ముగ్వురు పత్ను లకు పాయసాన్న మిచ్చెను.

రాజా పాయసమును రెండు భాగములు చేసి ఒక భాగమును పెద్ద భార్య కౌసల్య కిచ్చెను. మిగిలిన భాగమును రెండుగ విభజించి ఒక భాగము కైకకిచ్చెను. శేషించిన పాయసమును మరల రెండు భాగములు చేసి ఒకదానిని కౌసల్యకు, మరొకదానిని కైకకు ఇచ్చెను. వారా భాగము లను తమ హస్తద్వయముతో స్పర్శించి సుమిత్ర కిచ్చిరి.

ముగ్వురు రాణులు పాయసము సేవించి తేజో విలసితులై కాలక్రమమున గర్భములు ధరించిరి. కౌసల్య గర్భము ధరించిన క్షణముందే భగవంతుడామె గర్భమున ప్రవేశించెను. నాటి నుండి లోకము లన్నియూ సుఖసంపదలచే కళ కళలాడెను.

తేజోవంతులగు ముగ్వురు రాణులకు నవ మాసములు నిండి ప్రసవకాలము సమీపించెను. శ్రీరాముడు జన్మించబోవు శుభముహూర్తము నకు వారము, తిధి, యోగ, లగ్నము లన్నియూ మంగళకరముగ కూడెను. ప్రభువు భువికి రానున్నాడని చరాచర జగత్తంతయూ సంతోషము ను ప్రకటించెను.

నవమీ తిథి మధు మాస పునీతా,
సుకల పచ్ఛ అభిజిత హరిప్రీతా!
మధ్య దివస అతి సీతన ఘామా,
పావన కాల లోక విశ్రామా!

వసంత కాలము, చైత్రమాసము, శుద్ధనవమి భగవంతునికి ప్రీతికరమైన అభిజిత్ ముహూర్త మున, సమశీతోష్ణముగ నుండి లోకమునకు విశ్రాంతినిచ్చు మధ్యాహ్నవేళ, శీతల సుగంధ మంద పవనములు వీచుచుండ జగన్నాధుడు శ్రీహరి కౌసల్య గర్భము నుండి అవతరించెను,

ఆ శుభవార్తకు దేవతలు సంతోషించిరి. మునులు మోద మందిరి. కిన్నరులు ఆడిరి, గంధర్వులు పాడిరి. దేవ దుందుభులు మ్రోగెను పుష్ప వృష్టి జరిగెను. వనములు పుష్పించి ఫలించెను. నదీ నదములు మధుర జల పూరితము లయ్యెను, పర్వతములు రత్నరాజిచే ప్రకాశిం ప్రకాశించెను. హర్షోత్సాహితులగు దేవతలు దివి నుండి శ్రీరాముని నానా విధముల స్తుతించి దీవించిరి.

తల్లి గర్భము నుండి భూమిపై అవతరించగనే అవాఙ్మనస గోచరుడగు దేవ దేవుడు తల్లికి తన స్వస్వరూపము ప్రదర్శించెను. కౌసల్యకు తన పూర్వ చరిత్ర స్మరణకు వచ్చి దేహము గగుర్పాటు జెందెను.

శంఖచక్ర గదాధారి, ధనుర్బాణ తూణీరయుతుడు, చతుర్భుజుడు, కమలాక్షుడు, పీతాంబరుడు, మేఘశ్యాముడు, సర్వ లక్షణ లక్షితుడగు దేవదేవుని దివ్య సుందర విగ్రహము చూచి విభ్రమముతో కౌసల్య ఒడలు పులకరించెను. ఆమె తన రెండు చేతులు జోడించి స్వామిని అనేక విధముల స్తుతించెను.

కౌసల్య ఒక్కమారు తన పూర్వ వృత్తాంతము స్మరించుకొని, కనుదోయి నుండి ఆనందాశ్రువులు స్రవించుచుండ, ప్రేమోత్కంఠయై "విరాట స్వరూపుడవైన ఓ స్వామీ ! నీ ఈ అలౌకిక రూపము చాలించి యథాప్రకారము బాల రూపము ధరించుము. నీవు నోటితో "అమ్మా !" యని పిలుచుటే నా కభీష్టకరము, ఆనంద దాయకము." అని ప్రార్థించెను. తక్షణమే ఆ దివ్యమూర్తి బాల మూర్తిగా మారి ఏడువసాగెను.

బిడ్డ ఏడ్పు విని రాణులు పురిటింటికి పరుగెత్తుకొని వచ్చిరి. దాసదాసీ జనము సంతోషముతో అటు ఇటు పరుగులెత్తెను. పుత్రోదయ వార్త నిముసంలో నగర మంతటా వ్యాపించెను. ఈ శుభవార్తకు దశరథుని హృదయము ఆనందార్ణవమై కెట్టులు త్రెంచుకొనెను. పరమాత్ముడే నా గృహము పావనము చేసినాడని తలంచుకొని రాజా పరవశుడయ్యెను. హర్షోత్సాహితుడైన రాజు నగరమంతటా శుభసూచకముగ మంగళ వాద్యములు మ్రోగించవలసినదిగా సూచించి, వెంటనే వసిష్ఠునికి వర్తమాన మంపెను.

వసిష్ఠుడు వచ్చి బాలకుని దివ్యసుందర రూపము చూచి నిమేషమాత్రము నిశ్చేష్టుడై పోయెను. దశరథుడు— పుత్రోదయానంతరము చేయవలసిన— నాందీ ముఖ, జాతక సంస్కారాదులు పూర్తిచేసి గోదాన, వస్త్రదాన, సువర్ణ దానాదులచే విప్రులను ప్రజలను సత్కరించెను.

కైకేయి ఒక సుపుత్రుని, సుమిత్ర కవల పుత్రులను కనిరి. రాజమందిరము యొక్క ఆనందోత్సాహము అవర్ణనీయము. ధ్వజతోరణ పతాకములతో నగర మంతయు అలంకరింపబడెను. ఇంటింటా ఉత్సాహము వెల్లివిరిసెను. అయోధ్యలోని ఆబాలగోపాలము వినోద వేడ్కలలో మునిగి తేలెను. సహజ సుందరులగు సాకేత స్త్రీలు బంగారు కలశములలో మంగళ ద్రవ్యములు తీసుకొని పురిటింటికి గుంపులు గుంపులుగా రాసాగిరి. కస్తూరి, గంధము, పన్నీరు మొదలైన పరిమళ ద్రవ్యములతో వీధులన్నీ తడిసి పోయెను. అగరు ధూపముల పొగ చారలు దట్టముగ అల్లుకొని చిరుచీకట్లేర్పడెను. భవనోపరిభాగముల నుండి పైకి జల్లబడిన గుగ్గిలపు రేణువులు యెర్రని కాంతితో సంధ్యారాగమై తోచెను. మేడలపై ఉంచబడిన బంగారు కలశములు చందురుని వలెను, మణికాంతులు నక్షత్రముల వలెను ప్రకాశించెను. నానా విధ నాదస్వరములు పక్షుల కలకలారావములై భాసించెను. ఇది చూచువారికి భూమిపై అవతరించిన ప్రభువును దర్శించుటకు పట్టపగలే రజనీ రాణి భువికి దిగవచ్చినదా యన్నట్లుండెను. అట్లు దిగి వచ్చిన రాత్రి అక్కడ సూర్యుడుండుట చూచి సిగ్గుతో తలవంచుకొని సంధ్య రాగమై నిలిచినట్లగుపడు చుండెను. ఈ కౌతుకము చూచే కుతూహలముతో సూర్యడచ్చటనే ఒకనెల నిలిచి పోయెను. ఈ ప్రకారం అయోధ్యావాసులు వేడ్కలతో, వినోదములతో, విందులతో ఒక నెల కాలము ఒక దినముగ గడుపుకొనిరి.

"పార్వతీ ! అయోధ్యా నగరి అందచందము ఆ సమయంలో చూడ నుత్సహించి నేనూ, కాకభుశుండి మానవ రూపములతో అచటికి వెళ్లి యుంటిమి. నేత్ర పర్వముగ ఆ సంబరము చూచి వచ్చితిమి. ఈ రహస్యము నీకు మాత్రమే చెప్పుచున్నాను." అని భర్గుడనెను.

నా మ క ర ణ ము:

ఈ ప్రకారము ఆమోద ప్రమోదములతో కొంత కాలము గడచెను. ఒక దినము మహారాజా వసిష్ఠాదులను రావించి నలుగురు బిడ్డలకు నామ కరణములు చేయవలసినదని ప్రార్థించెను.

అనేక నామములు గల జగభిరామునియే నామముతో వ్యవహరింపవలెనో వసిష్ఠునికే తోచ లేదు. కానీ వారికి తత్కాలమున ఉచితమని తోచిన పేర్లను నిర్ణయించిరి.

"రాజా ! ఆనందమూర్తి, సుఖరాశి, లోక త్రయమునకు విశ్రాంతి నిచ్చువాడు నీ పెద్ద కుమారుడు, కనుక అతని పేరు రామమూర్తి ప్రజల భారమును భరించువాడై యున్నందున కైక తనయుని పేరు భరతుడు. సర్వలక్షణ లక్షితుడగు సుమిత్ర పుత్రుడు లక్ష్మణుడు. ఈ చిన్నవానిపేరు స్మరించినమాత్రమున శత్రు క్షయమగును కావున సుమిత్ర చిన్నకొడుకు పేరు శత్రుఘ్నుడు."

అని గురువులు నలుగురికి తగు రీతిన నామ కరణములుచేసి — "భూవరా ! నీ పుత్రులు నలుగురు నాల్గు వేదముల వంటివారు, వీరు మునులకు, శివునికి, కాకభుశుండికి ప్రాణ ప్రియులు." అని బిడ్డల గుణగణములను వసిష్ఠుడు వక్కాణించెను. ప్రీతి పూర్వకమైన గురువచనములు విని పుత్రోత్సాహముతో రాజు పితృ హృదయము ప్రేమపూరిత మయ్యెను. (సశేషం)

రోడ్ వైపు కారు పోనిచ్చాడు. ఇదేమిటయ్యా మహానుభావా అని అడుగుతే, 'సినిమాకి వెళ్ళాలని లేదూ, నీతో కబుర్లు చెప్పాలని ఉందీ'' అన్నాడు. సరే నీ ఇష్టం అన్నాను. కాసేపు ఆరోడ్డు చివర కూర్చుని, కబుర్లు చెప్పుకుని, టవున్లో భోంచేసి ఇంటికి ఇప్పుడు చేరుకున్నాం. రాంబాబు చాలా చిత్రమైన మనిషి—ఇప్పుడున్నమాట మరో క్షణానికి ఉండదు''

రాంబాబు గురించి తనకి వినాలనిపించలేదు. అది తెలియజేయటానికే అతను పుస్తకంలో తలదూర్చి, సీరియస్‌గా చదవడం నటించాడు దాంతో ఆవిడ ఇంకా చెప్పబోయే ఉపన్యాసానికి బ్రేక్ పడింది.

ఎంతకీ ఆవిడమాట వినిపించకపోవడంతో, శంకరం పుస్తకంలోంచి తల తిప్పి ఆవిడ నుంచున్న వైపు చూశాడు. ఆవిడ అక్కడలేదు.

ఇంత గాలి పీల్చుకున్నాడు. బట్టలు మార్చుకుని హోల్డాలు సర్ది నడుం వాల్చాడు. ఇందాక అశ్రద్ధగా వదిలేసిన 'రేజర్స్ ఎడ్జి' పేజీలు ఇప్పుడు శ్రద్ధగా చదవడం ప్రారంభించాడు. పావుగంటలో సుజాత తన గదికి వచ్చింది వీధి తలుపులేసి.

గది గుమ్మంమీద ఆవిడ కూర్చోడంతో శంకరం తప్పనిసరిగా పుస్తకం మూసేయవలసి వచ్చింది. లోలోన విసుక్కుని లేచి కూర్చున్నాడు.

''మిమ్మల్ని ఇబ్బంది చేస్తున్నాను కాబోలు——అయినా రాంబాబు గురించి మీకు కొంత చెప్పాలని నా ఉద్దేశ్యం.'' అన్నది సుజాత.

''మళ్ళా రాంబాబు గురించి వినాలి కాబోలు ఖర్మ'' అనుకున్నాడు రాంబాబు.

''అతని మాటలు చాలా మందిని నొప్పించవచ్చు. కానీ—అతని హృదయం చాలా మంచిది'' అన్నది సుజాత.

''ఇప్పుడు కాదని ఎవరన్నారు చెప్పండి''

''మీ మాటకాదు నే చెప్తోంట. రాంబాబుని చాలామంది అపార్థం చేసుకున్నారు. కుంటున్నారు. చివరికి మా వారిగ్గూడా అతనిపైన సదభిప్రాయం లేనేలేదు. రాంబాబూ నేనూ కలిసి చదువుకున్న మాట, అప్పట్లోనే పెళ్ళి చేసుకుందామనుకున్న మాటా రెండూ నిజమే. కాని పెద్దవాళ్ళు కాదనడం వల్ల, వాళ్ళమీద మాకు గౌరవం చావనందువల్ల మా పెళ్ళి జరగలేదు. ఈ విషయం పూర్తిగా తెలిసే వారు నన్ను పెళ్ళాడారు. ఇప్పుడు రాంబాబు మా ఇంటికి నన్ను చూచి పోదామని వస్తొంటే సహించలేక పోతున్నారు. ఐతే — అంతమాత్రాన బాధపడిపోయి మా స్నేహం మానుకునేంత ఘోరాన్నేకాము? పెల రోజులక్రితం రాంబాబు భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. అతను నాతో మాటాడటం ఆమెకీ బొత్తిగా నచ్చలేదుట. అలా అని చెప్పి చూచిందిట గూడాను. అతను నవ్వి వూరుకున్నాడు. దాంతో ఆవిడగారు పెద్ద రగడచేస, మరీ పుట్టింటికి వెళ్ళిపోయింది. పాపం—అప్పట్నుండీ రాంబాబు మనసు పాడై పోయింది. హు.....ఆవిడకి ఎంత చదువూ, ఎంత అంతస్థూ ఉండిమాత్రం లాభం ఏమిటి చెప్పండి. సంస్కారమంటూ లేకపోయిన తర్వాత'' అన్నదామె నిష్ఠూరంగా.

ఆవిడ చదువూ, సంస్కారమూ గురించి పాఠాలు

మనిషి - మిథ్యా

28 వ పేజీ తరువాయి

చెప్పడం అతని కిష్టంలేదు. అయినా వినక తప్పడం లేదు.

ఆ తర్వాత రాంబాబుకీ, తనకూగల స్నేహాన్ని చూచి ఎవరెవరు ఎన్ని నిందలు వేస్తున్నారో తాము వాటి నెలా ఎదుర్కొంటున్నారో సవివరంగా చెప్పుకున్నది. ఈ భాగం కూడా శంకరానికి నచ్చలేదు.

కానీ— ఆమె తన ఉపన్యాసానికి కొస మెరుపు అన్నట్టు ఒక మాట చెప్పడంతో శంకరం ఉలిక్కిపడక తప్పిందికాదు.

''ఆయనంటారూ—'నువ్వూ రాంబాబూ కలిసి నన్ను అన్యాయంచేసే రోజు దగ్గర పడుతుంది సుజీ'' అని'' అని ఫకాలున నవ్వేసింది సుజాత.

ఈ మాట చెప్పి నవ్వటంతో ఆవిడ ఉద్దేశ్యం తనకి అర్థం కాలేదు. పైపెచ్చు ఆవిడమీద కోపమూ కలిగింది. మళ్ళా సుజాతే అన్నది.

''అలా అనుకుంటే మా శ్రీవారిమీద నాకెంత అనుమానం ఉండాలి చెప్పండి? శ్రీవారి శృంగార లీలలు నాకు తెలీక పోలేదు. ఆయనకి వాళ్ళ ఆఫీసరుగారి శ్రీమతితోగల చనువు నా కళ్ళని మూసి, నన్నూ అన్యాయం చేయవచ్చుగా. నిన్న మనతో కేంప్ కెడుతున్నానని చెప్పారేగాని, నాకు నమ్మకం చాలడం లేదు.''

ఈ ముక్కతో శంకరం బుర్ర గిర్రున తిరిగింది.

ఈ దంపతుల మధ్య ఇంత ఇరుకు వాతావరణం. అతను కలలోనైనా వూహించలేదు. ఇప్పుడు అసహ్యమనిపించింది. రంగారావ్ సుజాతల పట్ల విపరీతమైన కోపమూ కలిగింది.

ఆవిడ రంగారావ్ గురించి ఇంకా చాలా వివరాలు తెలియచేసి, చివరికి వస్తానంటూ సెలవు తీసుకుని తన గదికి వెళ్ళిపోయింది.

అప్పుడు శంకరాని కనిపించింది—తాను వచ్చిందీ ఆతిథ్యం పొందుతున్నదీ రెండు మహా భయంకరమైన మనస్తత్వాలు కాపురం చేస్తున్న ఇంట్లోననీ, వాళ్ళు తానూహించినంత అన్యోన్యాను రాగాల్లో తేలిపోవడం లేదనీ, అనుక్షణం ఒకరిమీద ఒకరు ద్వేషం, పగ, ఈర్ష్యల్తో సతమతమై పోతూన్నారనీను.

అతని మనసు కలత చెందింది. ఆ ఇంట్లో మరో క్షణమైనా ఉండ బుద్ధి పుట్టలేదు. ఆ

'అలా బట్టతలో చ్చేస్తోందే మయ్యా!' రామారావుని రంగధాం పరామర్శించాడు.

''దిగులువల్ల''

'దిగులు దేనికయ్యా' రంగధాం ప్రశ్న

'బట్టతల వస్తోందే అని' రామారావు సమాధానం.

రమనాథం (కస్తూరివారిపల్లి)

రాత్రికి రాత్రే పెట్టె బేడా తీసుకుని బయట పడ్డాడు.

రైలెక్కుతూ అనుకున్నాడు.

'నే చేసింది తప్పా?'

జవాబూ చెప్పుకున్నాడు.

'నా మనసు కిష్టంలేని పని ప్రతిదీ తప్పే దాన్నుండి తప్పించుకుని బయట పడటం ఒప్పే'.

* * *

ఇంట్లోంచి బయటకి రావడం ఆలస్యం పగబట్టినట్టు ఈ ఎండ తన ప్రాణం తీస్తోంది.

జానకిరామయ్యగారు విసుక్కున్నారు. ఆయనకీ రోజంతా చికాగ్గా ఉంది. ఉదయం ఆ సంబంధం గురించి మాటాడిన లగాయతూ ఇప్పటి వరకూ చిరాగ్గానే ఉంది మనసు.

పిల్లాడి స్వగ్రామం నాప పాములు. అతను బి. ఎ. వరకూ చదువుకున్నాట్టగానీ పొరపాటున పరీక్ష కాలేక అదృష్టం పండి రైల్వేలో ఉద్యోగం సంపాయించుకున్నాట్ట. అందమైన మనిషిట గూడాను. వెనక ఆస్థి ఉందిట. దానికి తగ్గట్టు భాగస్థులూ ఉన్నారుట. మంచి సాంప్రదాయం.

అవుతే వచ్చిన చిక్కల్లా కట్నం దగ్గరే!

వాళ్ళు పదివేలకి దమ్మిడీ తగ్గరట. లాంఛనాలన్నీ సక్రమంగా ఉండాలిట. పిల్లకి మాత్రం నాలుగు సవర్ల బంగారం పెడతారుట.

జానకి రామయ్యగారు జవాబు చెప్పలేదు.

పదివేల రూపాయలంటే మాటలా? ఈ మిగిలున్న అయిదెకరాలూ సుశీల పెళ్ళికే అయిపోతే ముందెలా జరుగుతుంది? అసలు ఆ భూమిని చూచే తాను ధైర్యంగా ఉంటుంది. ఆ ఉన్నది కరిగిపోతే ఎవడినో ఒకడిని ఆశ్రయించి బతకాల్సి వస్తుంది. కొడుకు లిద్దరూ రత్నాలే—, అయినా ఏమిటో ఆశ్రయించడమనే మాట తలుచుకుంటె ఆయనకి చిన్నతనంగా ఉంది.

సుశీల అదృష్టం బాగుండాలేగాని ఈ సంబంధం కాపోతే దీని తల తన్నిన జేజెమ్మలాటి సంబంధం మరొకటి వస్తుంది. ఆ పిల్లని ఒక గొప్పింట్లో వేసే బాధ్యత తనకుంది. సుశీల అదృష్టంపట్ల తనకి నమ్మకమూ ఉంది.

పెళ్ళి వందేళ్ల పంటన్నారు. బాగా ఆలోచించి కాని ఒక నిర్ణయానికి రాకూడదన్నారు. పోనీ—ఈ అయిదెకరాలూ అమ్మి సుశీలకి ఆ నాసపాముల సంబంధమే నిశ్చయిస్తే రేపు సుశీల ఆ ఇంట్లో సుఖ పడుతుందని గ్యారంటీ ఏమిటి? ఆ ఇల్లు పెద్ద ధర్మ సత్రం గాటిదని వచ్చిన పెద్ద మనిషి చెప్పనే చెప్పాడు. ఆ ఇంట్లో అంతమంది జనాభాకీ చాకిరీ చెయ్యలేక పిచ్చితల్లి కుమిలిపోతే?...... వీల్లేదు. సుశీల కంట తడిపెడితే తాను చూడలేరు. ఆ పిల్లని తన గుండెలమీద పెట్టుకుని పెంచారు.

ఆలస్యమైనా సరే అన్ని విధాలా యోగ్యమైన సంబంధాన్నే తీసుకు రావాలి. సుశీల ఈ తరం పిల్ల కాదు. గర్వం, అహం మచ్చుకైనా లేవు. తనేవిటో తన ఇల్లేమిటోగాని మరో విషయం ఆలోచించదు. ఇరుగింటి ఎల్లమ్మా, పొరుగింటి పుల్లమ్మల్తో బాతాఖానీ సుశీలకు ఇష్టం లేదు. ఇంటావిడ కూడా సరిగ్గా ఇలాగే ఉండేది. తన పిచ్చిగాని ఆ తల్లి కుతూరేగా ఈ పిల్ల!

తన మాటకిగాని, అన్నయ్యల మాటకిగాని ఏనాడు — ఎదురు చెప్పి ఎరుగదు. కోపం

కొద్ది తామేదైనా అంటే తనలో తనే బాధపడి పోయి చాటుగా ఏడుస్తుందేగాని మాటకి మాట చెప్పే పద్ధతి లేనే లేదు.

ఇలాంటి అమాయకురాలిని ఏ విర్ణయమూ లేకుండా ఎవరో అడిగారు కదాని ఏ అయ్య చేతి లోనో పెట్టేయడమేనా?

జానకిరామయ్యగారు కళ్లు తుడుచుకున్నారు. తనెదురుగావున్న కూల్ డ్రింక్ షాపులో సోడా తాగి కాసేపు అక్కడే కూర్చుని, లేచి నెమ్మదిగా పార్కు వైపు నడిచారు. ఆయనలా రెండడుగులు వేశారో లేదో ఎవరో తనని పిలిచారు. వెనుక చప్పట్లూ వినిపించాయి. ఆగిపోయారు. ఆ వ్యక్తి తనని చేరుకున్న తర్వాత మందహాసం చేస్తూ 'నువ్వట్రా బంధూ! ఇంకా ఎవరో అనుకున్నాను' అన్నారు.

దీనబంధు అసలు పేరు దీక్షితులు. ఆయన గూడా జానకిరామయ్యగారితో పాటు మాస్టరు పని చేసి రిటైరయ్యాడు. ఆయన సోషల్‌స్టడీస్ అసిస్టెంట్‌గా మంచిపేరు సంపాయించుకున్నాడు. ఆయన క్లాసంటే గడుగ్గాయి విద్యార్థులైనా నెవాగ్గి శ్రద్ధగా వినేవారు. విద్యార్థులను మంత్రించడం ఆయనకున్న చాక చక్యాల్లో ముఖ్యమైనది మొదటిదీను. ఏ విషయమైనా వినేవారికి ఇంపుగా చెప్పడం ఆయన సొత్తు.

తోటి మాస్టర్లు దీక్షితులుగార్ని దీనబంధూ అని పిలిచేవారు. ఆ రోజుల్లో దీక్షితులు చాలా మందికి అప్పు లిస్తుండేవారు. అడగని వాడిది పాపమన్నట్టు ఎంత అడిగినా లేదనకుండా ఇచ్చేస్తుండేవారు. మళ్లా ఆ పైకాన్ని తనకై తాను వసూలు చేసుకునేవారుకాదు-- అవతలివాడు గుర్తుపెట్టుకుని ఇస్తేనే తప్ప.

ఇలా ఆర్థిక ఇబ్బందుల్లో ఇరుక్కున్న మాష్టర్ల బృందానికి తన చాతనైన సాయంచేసి వాళ్ల పాలిటి దేవుడై కూర్చున్న దీక్షితులుగారిని 'దీనబంధూ' అని పిలవడంలో తప్పేముంటుంది? ఆయన పేరు దీనబంధుగానే నిలచిపోయింది.

అంత మంచి మాస్టారికి గూడా విద్యార్థులు ముద్దు పేరు పెట్టకుండా వూరుకోలేదు. 'గొడుగు' అని నామకరణం చేశారు.


ఆయన చేతిలో గొడుగు లేనిదే ఒక్క అడుగు కూడా బయట పెట్టేవారు కాదు. ఎండా, వాన, చలి, చీకటి—ఇలాటివి పట్టించుకోకుండానే గొడుగు వెంట బెట్టుకొచ్చేవారు.


క్లాసులోకి వచ్చిన తర్వాత, వెంట తెచ్చిన గొడుగు గోడ వారగా ఉంచి పాఠం చెప్పేవారు. మధ్య మధ్య గొడుగు వంక చూస్తూ ఇంపుగా పాఠం చెప్పడం ఆయన సర్దా.

ఇది గమనించిన ఓ కొంటె కుర్రాడు ఆ గొడుగుని దొంగిలించి స్నేగ్రౌండులో తుమ్మచెట్ల మధ్య ఉంచి ఏమీ తెలీనట్టు వచ్చి క్లాసులో కూర్చున్నాడు.

దీక్షితులుగార్కి ఆ రోజు పాఠం సాగలేదు. అయితే వారు మోసుకోడం మాస్టారి అలవాట్లు వారు పెగల్లేదు. తనెదురుగున్న ప్రతి కుర్రాడిని కుర్రాళ్లకి సరదాగా ఉంది. సభ శిఖ పర్యంతం అనుమానంగా పరీక్షించడం,


(సశేషం)





ఆడంబరాలను విడనాడండి
దేశసంపదను వృధా కానీయకండి





వీరాజీ

జరిగిన కథ

సురేఖను భాస్కరానికీ భాస్కరాన్ని సురేఖకు పరిచయం చేస్తుంది, పద్మావతి. భాస్కరం సవతి తల్లి జానకమ్మగారు అతన్ని కన్నబిడ్డ కంటె ఎక్కువగా ప్రేమిస్తుంది. భాస్కరానికీ, కూతురు వసంతకూ ఒకేసారి వివాహం చేయాలని ఆమె ఆరాట పడుతుంది. తత్ఫలితంగా భాస్కరాన్ని పెళ్లిచూపులకు బలవంతంగా ఒప్పించి తీసుకెళ్తుంది. పెళ్లికూతురు సురేఖ అని తెలియగానే భాస్కరం మనస్సులో కల్లోలం చెలరేగుతుంది. సురేఖ దొడ్డమ్మ అయిన ధనమ్మకు మాత్రం భాస్కరంలో అన్నీ మంచి గుణాలే కన్పించి ఎలాగైనా భాస్కరాన్ని తన అల్లుడుగా చేసుకోవాలని పట్టుదల పెరుగుతుంది. భాస్కరం పద్మావతిని ప్రేమించడం నిజమా, కాదా అనే సందేహం కూడా సురేఖకి కలుగుతుంది. ధనమ్మకు దూరపు బంధువు ముకుందరావును వసంతకు ఇచ్చేటట్లు కూడా అప్పుడే ఏర్పాటు జరుగుతుంది. తను సురేఖను వద్దంటే ధనమ్మ తన కూతురుకే ముకుందరావును ఇచ్చి చేస్తానంటోంది. చెల్లెలి సంబంధం తన మూలంగా చెడిపోతుందని భాస్కరం; ముకుందరావుని వివాహం చేసుకుందామని కల్లో కూడా అనుకోని సురేఖకు తను భాస్కరాన్ని వద్దంటే ధనమ్మ తనను ముకుందరావు కిచ్చి చేస్తుందేమో అన్న భయంతో సురేఖా ఎటూ మాట్లాడలేకపోతారు. చివరకి భాస్కరం తన పెళ్లి ఏడాది వాయిదా వేస్తాడు. ఇంతలో యూనివర్సిటీ తెరుస్తారు. సురేఖ, పద్మ యిద్దరూ ఎం. ఏ లో చేర్తారు. భాస్కరం కూడా ఫైనలియర్ పూర్తి చేయటానికి వస్తాడు. సురేఖ అంతా చెప్పిఉంటుందని భాస్కరం అనుకొని పద్మతో ఏమీ చెప్పలేకపోతాడు. ఎగ్జిబిషన్‌లో కూడా పద్మావతిని కల్సుకొని ఎలాగైనా జరిగింది చెప్పాలని చాలా ప్రయత్నించాడు. భాస్కరం కాని చెప్పలేక పోయాడు. వసంత పెళ్లి జరుగుతోంది. అక్కడ సురేఖను ధనమ్మగారు జానికమ్మగారి కోడలు అని చెప్తుంది పద్మావతి హతాశయై వెళ్లిపోతుంది. మనస్సులోని చికాకువలన సురేఖకు సుస్తీ చేస్తుంది. పద్మావతికి ఆమె వరస అన్న రాజా వేరే సంబంధాలు చూస్తుంటాడు. భాస్కరం సురేఖను వద్దని పిన్నితో చెప్పేస్తాడు. సురేఖధనమ్మగారికి భాస్కరానికి వివాహమాడనని చెప్పేస్తుంది.

49

భాస్కరం కాలేజీకి వెళ్లనేలేదు. కోర్సులన్నీ ఒకసారి చదివేయాలనుకున్నాడు. పద్మావతికి ఉత్తరం రాద్దామనుకున్నాడు. "పద్మావతీ! నువ్వు నన్ను అనవసరంగా అనుమానించావు, నేను నిన్ను దగా చేద్దామనుకోలేదని"— కాని రాయలేదు. ఆమె చిరునామా తెలియదనడం ఒక నెపం మాత్రమే !

మూర్తి వచ్చాడు. నోట్సులు ఇచ్చాడు. ఇద్దరూ పాఠాలు తిరగేశారు.— మూర్తి చెప్పాడు. "పద్మావతిగారిని శైలజ నిన్న 'సురేఖ' గురించి అడిగిందట."

"సురేఖకు ఒంట్లో బాగులేదురా !" అన్నాడు భాస్కరం.

"కాని పద్మావతి అలా చెప్పలేదు. బహుశా ఆమెకు ఆ సంగతి తెలియదేమో...." నన్నాడు మూర్తి భాస్కరాన్ని పరిస్థితిని చూస్తున్నట్లు చూసి.

"ఏ మందిటా ?" కుతూహలంగా అడిగాడు భాస్కరం.

"ఏదో అన్నదిగాని.... చూడు భాస్కరం ఇఫ్ యూ డోంట్ మైండ్ ఎక్స్‌క్యూజ్ మీ.... నువ్వు క్షమిస్తే నేనో మాట చెప్పనా ?"

"చెప్పు మూర్తి ! నీకూ నాకూ దాపరికం లేదు గదా" బాధగా మూలిగాడు భాస్కరం.

"నీ పిరికితనం వల్ల ఎందరం ఇబ్బంది పడుతున్నామో తెలుసా ? తలదించుకునే మాట్లాడుతున్నాడు స్నేహితుని కళ్లల్లోకి చూడకుండా మూర్తి.

భాస్కరం నొచ్చుకున్నాడు. ఏమీ అనలేదు.

"నన్ను నీ ఆత్మీయుడిగా భావించు భాస్కరా? నీవు మాకు చెప్పేవాడివే కాని చెప్పించుకునే వాడివి కాదు నాకు తెల్సు" నన్నాడు మూర్తి.

మూర్తి బాధకు ఆత్మీయతకు కూడా చలించి భాస్కరం "పిన్నికి చెప్పేశాను మూర్తి" అన్నాడు.

మూర్తికి ఆదుర్దా పెరిగింది. ఆందోళన తరిగింది. "ఏమంది ?" అన్నాడు.

"తనకు ఇన్నాళ్లు సురేఖ అంటే నాకు ఇష్టం లేదు అని చెప్పలేదుగా.... అందుకని తను తిట్టింది తిట్టుకుంది.... అంతే"

విరుత్సాహంగా మూర్తి నిట్టూర్చాడు.

"పిరికివాళ్లి అనికదూ అంటావునువ్వు ?" భాస్కరమే అన్నాడు మళ్లీ.... "కాదు మూర్తి.... వసంత పెళ్లి ధనమ్మ చేతిలో ఉంది. ధనమ్మ పద్మావతి సంప్రదాయానికి, వంకపెట్టి, మా పిన్ని మనస్సూ, వసంత పెళ్లి రెండూ పాడు చేస్తుందనే భయంతోనే మానేశాను.' అన్నాడు భాస్కరం.

మూర్తి తలఎత్తి "నన్ను క్షమించు భాస్కరా! నీకు గల బాధ్యతను నీ అంత బాగా మేం వూహించలేంగా ?" అన్నాడు.

"కాని మూర్తి జ్ఞాపకం ఉందా ? ఒక నాడు బీచ్‌లో నువ్వే సురేఖనూ, పద్మావతినీ కూడా శంకించావు ! అందుకే నేను ఎవ్వరికీ ఏ విషయమూ చెప్పలేదు. ఆఖరికి సురేఖకు కూడా.... హాలాహలమంతా మింగి, అందరి దృష్టిలో నీచుణ్ణియ్యాను.... సరే.... గత జలసేతు బంధనమెందుకులే నా కర్మకి నన్ను వదిలేయ్ !"

భాస్కరం కనుకొలకుల నీటి బిందువులను చూసి మూర్తి విచలితుడై పోయాడు.

"ఛా ! ఏంమాటల్రా అవి.... నిన్ను మేం ప్రేమిస్తున్నాం గనుకనేగా ఇంత పీడిస్తున్నాం .... ఇంతకీ ఇప్పుడు సురేఖకు అంతా చెప్పావా ?" మూర్తి భాస్కరం చెయ్యి తన చేతిలోకి తీసుకుని విశ్వాసంగా నొక్కాడు.

"ఒక్క పద్మావతికే తెలియదు" భాస్కరం నిట్టూర్చాడు.

"శైలజతో కబురు పెడతామకాని...." మూర్తి మధ్యలోనే తటపటాయిస్తూ ఆగిపోడంతో భాస్కరం అనుమానంగా "ఇంకా అనుమానం ఎందుకురా ? పిన్నిని ఎలాగైనా ఒప్పించి తీరుతానూ" అన్నాడు.

"అదికాదు.... అహాఁ ఏం లేదులే.... ఇంకేం లేదు. నువ్వూ పద్మావతి కలిసి నాకూ శైలజకూ దంపతులుగా ఆశీర్వచనం ఇవ్వండి ఇస్తారుగా" అంటూ మాట మార్చాడు.

మాట మార్చినట్లు గ్రహించిన భాస్కరం "మూర్తి ! నా దగ్గర ఏం దాచకురా ?" అన్నాడు. అంతలో అవతలినించి, "బాబూ ! భాస్కరం అనే అబ్బాయి.... ఇక్కడ ఎమ్మెస్సీ చదువుతున్నాడు.... తెలుసా ? కాస్త చెప్తారా...." అంటూ రాఘవేంద్రంగారు వచ్చి.... భాస్కరాన్ని చూస్తూనే.. నేను భాస్కరం గారూ కులాసానా ?" అంటూ పలకరించాడు.

ప్రేమకు పగ్గాలు

భాస్కరం స్తంభించిపోయా డొక్కక్షణం. తేరుకుని "రండి! రండి" అంటూలేచి రాఘవేంద్రాన్ని లోపలికి తీసుకునివచ్చి...." "ఎక్కణ్నించి బెజవాడనించేనా ? ఎలావచ్చారూ ? ఏం కథ ?" అన్నాడు. కూచోమని మంచం చూపుతూ.

"కాస్త పని ఉండే వచ్చాను.... చెల్లాయ్ వసంతనడిగి నీ దగ్గరకే వెళ్లమంటేనూ నేరుగా వచ్చాను"— మూర్తి ననుమానంగా పరికిస్తూ అన్నాడు రాఘవేంద్రరావు.

"అతను మా స్నేహితుడు మూర్తి, ఈయన మా చెల్లాయ్ మామగారు" అంటూ భాస్కరం పరిచయం చేశాడు.

"రాఘవేంద్రం మూర్తి నమస్కారానికి చిరునవ్వు అందించి "మీ ఇద్దరూనా ? ఇందులో?" అన్నాడు గది నాలుగు వేపులా కలియజూస్తూ, మంచంమీద కూచోడానికి సంకోచించాడు.

"కాదండీ ! మూర్తి సద్ధర్మ సదనమని మరో చోట ఉంటున్నాడు" అని చెబుతూనే "మీరు బాగా అలిసి పోయినట్లున్నారు.... కూచోండి కాఫీ తెప్పిస్తాను... స్నానం చేద్దురుగాని...." అన్నాడు భాస్కరం లేచి అతనికి కుర్చీవేసి, అవతలికి వెళ్లాడు.

మూర్తి కూడా భాస్కరాన్ని అనుసరించి ఇవతలికి వచ్చి "ఏమిరా ? ఇతగాడు వచ్చాడు" అన్నాడు.

"ఏమోరా నా కర్మ...." భాస్కరం విసుక్కున్నాడు. "మళ్లీ కలుస్తాను.... నే పోతాను నీ తంటాలు నువ్వు పడు నీ గోస్పటోను" అని వెళ్లిపోయాడు. మూర్తి. బరువుగా రెండుమూడుసార్లు వెనుతిరిగి చూస్తూ....

* * *

రాఘవేంద్రం గారికి అన్ని సౌకర్యాలు అమర్చాడు భాస్కరం. అతను వేసే అనవసరమైన వచ్చు ప్రశ్నలన్నింటికీ సమాధానాలు బుద్ధిగా ఇచ్చాడు.

"ధనమ్మగారి సంగతి నీకు తెలుసు కదా ?'



అడిగాడు రాత్రి ఆరుబయట మంచంమీద పడుక్కుని.... రాఘవేంద్రం.

తతిమ్మా తన మిత్ర బృందానికి రాఘవేంద్రం వల్ల ఇబ్బందీ రాఘవేంద్రానికి వాళ్లవల్ల సంకోచమూ రాకండా ఏర్పాటు చేయడంలో భాస్కరానికి ఆ రోజు తలప్రాణం తోకకి వచ్చింది!

నీర్సంగా తలకాయ మాత్రం వూపాడు.

రాఘవేంద్రంగారు చెప్పాడు.

"ఆమెది భల్లూకం పట్టు— నీకు తెలుసునో లేదో.... నా కొడుక్కి అప్పుడో పదీ అప్పుడో పరకాఇచ్చి,— అప్పుగా జమచేసి, చివరికి నా ఇంటిమీద అప్పు ఇచ్చినట్లు పత్రం రాసుకుంది" బాధగా, ధనమ్మమీద భాస్కరానికి దురభిప్రాయం కలిగించడానికా? అన్నట్లు నిట్టూర్చాడు అతగాడు.

"మీరు చింతించకండి ముకుందరావు బావ మీ ఇంటిమీద అప్పు తీర్చే రోజు రాకపోదు" భాస్కరం ధైర్యం పలికేడు.

"అంతవరకూ ఆగదుకదా ? ఆ ధనమ్మ...!" నిట్టూర్చాడు రాఘవేంద్రంగారు.

"నువ్వు నా మాట విను...." అన్నాడు చుట్ట ముట్టించుకుంటూ.

భాస్కరానికి గుండెల్లో రాయిపడింది. మరో "ఐదువేలు ఇమ్మనడుకదా ఈ దుర్మార్గుడు!" అనుకున్నాడు లోపల లోపలే.

"నువ్వు సురేఖను కాదనకూడదయ్యా ?" రాఘవేంద్రంగారు ఆపేక్ష ఒలకపోస్తూ చెప్పాడు.

భాస్కరానికి ఒళ్లు మండిపోయింది !

మనసులో రకరకాలు తిట్టుకున్నాడు.

కాని చెల్లెలి మామగారవడంతో కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గారికన్నా ఎక్కువ భయపడాలి అనుకుని బయటికి ఏమీ అనకండా వూరుకున్నాడు.

"సురేఖకు ఏం తక్కువ ?" రాఘవేంద్రంగారు అడిగాడు.

"తక్కువ అని ఎవ్వరనగలరు ?"

భాస్కరం మొహం చిట్లించాడు.

"మరి ?"

". . . . . . ."

"అదిగాక చూడు బాబూ ! పెద్దవాణ్ని ఐనవాణ్ని.... నువ్వేమీ అనుకోకపోతే నేను నాలుగు మాటలు చెప్పనా ?" రాఘవేంద్రంగా రడిగాడు.

"చెప్పండి" పొడిగా అన్నాడు భాస్కరం.

"సురేఖను నువ్వు ఇవాళ కాదనడానికి కారణం ఏదైనా అది మన కుటుంబ గౌరవాలకు సంబంధించిన విషయం.... మీ పిన్ని ఎంత సవత్తల్లి అయినా నిన్ను పెంచి పెద్ద చేసింది. ఇప్పుడీ మాట ఆమెకు తలవంపులు తెస్తుంది...."

భాస్కరం రాఘవేంద్రం పీక పిసికి సముద్రంలో పారేద్దామనుకున్నాడు. లేచి నిగ్రహించుకుని నిలబడి "మా పిన్నికి అన్నీ తెలుసులెండి" అన్నాడు. వెనక్కి తిరిగాడు. "ఇక నోరు మూసుకోమ"న్నట్లు—

"కాని ఆ నాడు మాట ఇవ్వడం...." రాఘవేంద్రం తెగేవరకూ లాగడం తప్పదనుకున్నాడు.

"నేను మాట గట్రా ఏమీ ఇవ్వలేదు. ఆ సంగతి ఆ సురేఖగారికీ దేవుడికీ ఇద్దరికీ తెలుసు" కసిగా అన్నాడు భాస్కరం.

రాఘవేంద్రంగారు లేచి జాలిగా దీనంగా మొహంపెట్టి భాస్కరం భుజంమీద చెయ్యివేసి "మరొక్కసారి ఆలోచించు, నా కొంప వేలం వేయించకు, నీ చెల్లెలి కాపురం నడివీధి పాలు జేసుకోకు.... ఎంతైనా సవతి చెల్లెలు కూడా చెల్లెలే...." అన్నాడు.

భాస్కరాన్ని ఎవరో ఇనప మరలలో పెట్టి నలిపేసినట్లైంది.

కాని రాఘవేంద్రంగారిసేం చేయడం ?

'సవత్తల్లి', 'సవతి చెల్లెలు' అనే మాటలు జీవితంలో తొలిసారి వినపడుతున్నాయి భాస్కరానికి. అవి చెవుల్లో మరిగించి పోసిన సీసంలాగ పడుతున్నాయి.

"ఇంతకీ మీరు.... మీరు నన్ను బెదిరిస్తున్నారా ?" తోక తొక్కిన తాచులా కస్సుమని అడిగాడు.

నవ్వాడు రాఘవేంద్రంగారు. ఆ నవ్వుకి వేదాంతి పోలికలు, విలన్ లక్షణాలు ఉన్నాయి.

"నిన్ను మన కుటుంబ ప్రతిపత్తి కాపాడమని కోరుతున్నాను...." రాఘవేంద్రంగారు మరి మాటాడను అన్నట్లు గోడ దగ్గిరికి వెళ్లి చుట్ట "హాయిగా" కాల్చుకో సాగాడు.

ఇద్దరు సైనికులు మాట్లాడుకుంటున్నారు.

'మీ రెందుకు సైన్యంలో చేరినట్టు?'

'నాకేం పెళ్ళామా బిడ్డలా, ఒంటరిగాణ్ణి, మరి మీరో?'

'నాకు భార్యవుంది. శాంతి కోసం వెదుతున్నాను?' మొదటి వ్యక్తి నిట్టూర్చాను.

సి. రా. (రామరాజుపల్లె)

భాస్కరం ఇవతలికి వచ్చాడు. తనమీదకే గురిపెట్టి దూసిన వెండికత్తి "మొనల్లా"గ నీలాకాశంలో మెరుస్తున్నాయి నక్షత్రాలు.

"సవతి కొడుకువు నువ్వు.... చెల్లెలి కాపురం యేలా ఐతే నీకేం"? అన్నట్లు విరగబడి వికటాట్టహాసం చేస్తోంది సముద్రం దూరంగా.

"కాదు....కాదు....పిన్నికి తెలుసు.... వసంతకు తెలుసు.... నేను నేను పిన్ని కొడుకునే.... పిన్నీ.... పిన్నీ...." మని ఆక్రోశించింది భాస్కరం హృదయం.

మనిషి వ్యక్తిత్వాన్ని కాదనే సమాజంచేసే గోలలా భాస్కరం ఒంటరితనాన్ని చీలుస్తూ సముద్రం హోయి హోరు మంటోంది.

"నేను పద్మావతికి మాట ఇచ్చాను గాని సురేఖకు గాదు.... నేను పద్మావతికి మాట ఇచ్చాను గాని సురేఖకుగాదు." ఒంటరిగా చీకటిలో ఇసికెలో కూచుని తల కాళ్లలో దూర్చికుని కన్నీళ్లు పెట్టుకున్నాడు భాస్కరం.

భాస్కరానికి రాఘవేంద్రం మాటలు పూర్తిగా అర్థమయ్యాయి వసంతను పుట్టినింటికి పంపేస్తానన్నదే అతని బెదిరింపు.

"హే ! భగవాన్"......

కాని మొట్టమొదటిసారి దేవుడున్నాడా ?" అన్న సందేహం కలిగింది.

"లేడు లేడు" అనుకున్నాడు.

"సరే ! దేవుడు మనుషులు ఇవన్నీ మిధ్య.... నేనే నేనే అన్నింటికీ కారణం. నేనే నిజం.... అందుకే.... చూస్తాను నా చెల్లెలి కాపురం ఎలా నడివీధి పాలవుతుందో" - ననుకుంటూ బరువుగా అడుగులు వేసుకుంటూ హోస్టలుకు చేరుకున్నాడు.

గడియారం పదకొండున్నర గంటల దగ్గర "టిక్కు టిక్కు" మంటోంది! భాస్కరం అటూ యిటూ పచార్లు చేస్తూన్నాడు అంచేత.

రాఘవేంద్రంగారి గుర్రు భాస్కరం గుండెల్లో ఆ తెల్లవార్లూ దేవినట్టు మెదులుతూనే ఉంది. ఎట్టకేలకు తెల్లవారింది.

50

రాఘవేంద్రంగారు స్నానం, ధ్యానం అన్నీ నిస్సంకోచంగా ముగించుకున్నాడు. భాస్కరం కాఫీ హొటలుకు తీసుకువెళ్లి టిఫినూ కాఫీ ఇప్పించాడు. చుట్టలు కూడా కొని ఇచ్చాడు.

"మీరు ఈ వూరికి కొత్తేమో.... మీకు ఇక్కడగల పనులేవైనా నాతో చెప్పండి నేను చేయగల సాయం చేస్తాను" అన్నాడు.

"ఏమీ వద్దు బాబూ ! నాకు ఈ వూరు మరీ అంత కొత్తగాదు.... నా పని చూసుకుని నేను స్వయంగా సాయంకాలం వేళకి వచ్చేయగలను" అన్నాడు ముసిముసి నవ్వులు నవ్వుతూ రాఘవేంద్రంగారు.

"సరే ?" నన్నాడు భాస్కరం.

* * *

రాఘవేంద్ర రావుగారు అవలిస్తే పేగులు లెక్క పెట్టగల వ్యక్తి ! అతనికి వూరు కొత్త చేసి దారి తెలియకపోవడం, నీరు కొత్తచేసి ముక్కు శైత్యం చేయుడం జరగవు.

నేరుగా అప్‌లాండ్స్ వాల్తేరు వెళ్లాడు. జయమ్మగారి యిల్లు కనుక్కున్నాడు.

ధైర్యంగా తలుపు కొట్టాడు.

కండువా రెండుమూడుసార్లు మెడలో అటూ ఇటూ తిప్పి వేసుకుంటూ మరోసారి "తలుపు తడుదునా ?" అనుకుంటూ ఉండగానే జయమ్మగారు తలుపుతీసి కొత్త వ్యక్తిని చూస్తూనే నివ్వెరపోయింది.

"ఎవరు కావాలి?" అన్నది జంకుగా సంకోచంగా - బహుశా తప్పు తలుపు కొట్టి ఉంటాడనుకున్నది.


"నన్ను రాఘవేంద్రరావు అంటారు భాస్కరం వాళ్లూ" — భాస్కరం అన్న మాటలు జయమ్మ మొహంలో ఏ మాత్రం రంగులను మార్చగలవూ అన్నట్లు చూశాడు.

కాని ఆమె బిడియపడుతూ

"మీ రెవరికోసం వచ్చారో.... ఇది మీకు కావల్సిన ఇల్లుకాదు"— అన్నది.

"మీ పేరు జయమ్మగారేనా ? మీ అమ్మాయి పద్మావతికదూ ?" రాఘవేంద్రంగారు లోపలికి రానిస్తావా ? లేదా ? అన్నట్లు ధీమాగా చూశాడు.

"అవును !" అన్నదామె సంభ్రమాశ్చర్యా


ఆటంకములేని
పనితనానికి
మర్ఫీ పోర్టబుల్ ట్రాన్సిస్టర్
మోడల్ టీవి 0583
ట్రాన్సిస్టర్ అండ్ డయోడ్స్
murphy radio
మర్ఫీ రేడియో మీ గృహానికి ఆనందాన్నిస్తుంది!
NAS 1400

తతో ఏంచెయ్యాలో తోచక రెండుగులువెనక్కి వేసింది.

"నేను మీతోకాస్త మాట్లాడాలి ... ఇలాంటి విషయాలు మరీ ఇలా రోడ్డుమీద నిలబడి మాట్లాడుకోడం అంత భావ్యంకాదు గదా !" అంటూన్న రాఘవేంద్రాన్ని ఆమె లోపలికి రానిచ్చి కుర్చీ చూపించింది. ఆమె మొహంలోని ఆందోళన రాఘవేంద్రంగారిని కలవరచకపోగా మరింత ఉత్సాహాన్ని పుంజుకోనిచ్చింది.

"చూడండి ! మీరు మీ వాళ్ళూ..."

"వారూ నేనూ అన్నీ నేనే.... మీపనేమిటో చెప్పండి" కటువుగా అన్నది జయమ్మగారు. "లేదుకదూ ! నలుగుర్ని పిలిచి....మీ..."

"అమ్మమ్మ ! మర్యాదస్తుణ్ణి పిల్లల వాణ్ణి తల్లీ! అంతంత మాటలనవద్దు" నొచ్చుకున్నాడు రాఘవేంద్రం.

రాఘవేంద్రం తనను పూర్తిగా పరిచయం చేసుకున్నాడు. సురేఖ "మా మేన కోడలవుతుంది" అన్నాడు.

"సురేఖ మామయ్యా మీరూ ?" కాస్త తేరుకున్నది జయమ్మగారు.

రాఘవేంద్రం అంతా చెప్పాడు. వసంతకి పెళ్ళైంది. వసంత అన్నయ్యకూ సురేఖకూ పెళ్లి కావల్సి ఉన్నది అని బోధపరిచాడు.

చివరికి అన్నాడు "మీ అమ్మాయి పద్మావతికి సాధ్యమైనంత తొందరలో పెళ్లి చేయండి ఇది నా సలహా" అన్నాడు.

"ఎవరి సలహాలు సహాయాలు మాకు అక్కర లేదు. అలాగే చేస్తాం"జయమ్మగారు మండిపడ్డది.

"మరే, మరే ! కాని.... మీ అమ్మాయి, ఈ భాస్కరం అనే అబ్బాయిని వలలో వేసుకో జూడటం...." నసిగాడు రాఘవేంద్రం.

"నోర్మూయ్యవయ్యా ! మర్యాదా మప్పితం తెలియకుండా మాట్లాడుతావ్ ?" — దెబ్బతిన్న పాములా కస్సుమన్నదామె.

"నా నోరు మూయొచ్చుగాని.... లోకం నోరు

ప్రేమకు పగ్గాలు

మూయడం మనతరం కాదుకదా?....అందుకనే నేను ఇంత దూరం వచ్చాను. ధనమ్మగారు అనే ఆవిడ చాలా తెలివైనది డబ్బున్నది. పద్మావతి కావా లంటే వెయ్యో.... రెండూవేలో...."

"ఛీ ! ఫో అవతలికి...." అందామనుకున్నది జయమ్మగారు కాని బయటకు అహంకారం దుఃఖం రాకుండా నిలదొక్కుకుని "బాబూ ? మీరూ మీ ధనమ్మగారూ ధనం అన్ని కలిసి కృష్ణలో దూకండి? మీమాత్రం మాన మర్యాదలు, డబ్బూ, ఇల్లూ నాకూ ఉన్నాయి. నీలాంటి దుర్మార్గుడు మర్యాద తెలిసి వాడు నా ఇంటికి వచ్చి అడిగినా నా కూతుర్ని నేను ఆ భాస్కరం ఎవడో అతగాడికి ఇవ్వను. ఇక నువ్వు నడూ...."

"ఖాయమేనా ?...." రాఘవేంద్రం గారు ఇక నా పని అయింది అన్నట్లు నిలబడ్డాడు.

"ఆహా!"

"సరే చెల్లెమ్మగారూ ?" మెత్తబడిపోయి సంతోషంతో మొహం వికసించగా అన్నాడు రాఘవేంద్రం. "నన్ను మన్నించండి. అమ్మాయికి చెప్పండి. ఆ భాస్కరం అనేవాడు నా కోడలికి అన్నయ్యకదా అని చెప్పకపోడమే గాని చెబితే అతని గ్రంథం చాలా ఉంది.... చూడగా మీ అమ్మాయి చాలా అమాయకురాలల్లే ఉంది .... అందుకే దీపం ఉండగానే ఇల్లూ అన్నట్లు .... కొంపలు మునిగి పోకండానే...."

"చూడండి ! మీరు మనుష్యులే అయితే అవతలికి నడిచిపొండి ! దయచేసి .... నీకూ నీ పెద్ద లకూ పదివేల దండాలు...."

ఆమె దుఃఖం ఆపుకుని ఆవేశంగా చేతులెత్తి మొక్కింది. అటు మొహం తిప్పేసుకుంది.

రాఘవేంద్రంగారు....

"క్షమించుతల్లీ ! క్షమించుతల్లీ ? నీ కూతు రొకటీ నా కూతురొకటీ కదూ.... మచ్చ పడ్డదో మాయదు...." అంటూ నిష్క్రమించాడు.

దభేలున తలుపు వేసుకున్నది. జయమ్మగారు. ఆవేశం పట్టలేక గోడకేసి తల బాదుకున్నది. అక్కడే కూలబడి వెక్కివెక్కి ఏడ్చింది. కుంకుమలేని ఆమె నుదుట ఎర్రని నెత్తురు చిమ్మింది !

"పద్మావతిని పీక పిసికేసి పారేసి తాను కూడా సముద్రంలో పడిపోతే తీరిపోతుంది." అనుకుంది పదేపది.

"చివరికి ఇలా ఐంది నా బ్రతుకు.... వాడే తప్పు ఈడొచ్చిన ఆడపిల్లని విచ్చలవిడిగా పోనివ్వ డం ఇకచాలు"అని బాధ పడ్డది.

* * *

రాఘవేంద్రరావుకి తన పన్నాగం పారింది తన ఇల్లు దక్కింది అన్న సంతోషం కలిగిన రెండో వేపు గుండెల్లో దేవినట్లయింది. జయమ్మను చూసిన తర్వాత ఆమెలో మాట్లాడిన తర్వాత తనొక సంస్కార హీనుణ్ని అన్న బాధ ప్రవేశించింది అతనిలో

"ఛీ ! ఛీ ! ఇంత నీచమైన పని చేశాను పిల్లలవాణ్ని" అనుకున్నాడు.

"ఈ పీడ వదిలింది. దీనికి ఒక వెయ్యి అయిం దని ధనమ్మగారికి చెబుదునా" అనుకున్న రాఘవేంద్రరావు.

జయమ్మ మొహంలోకి ఆమె కళ్లల్లోకి చూసిన తర్వాత తప్పు చేసినట్లు బాధ పడి పోయాడు.

"కాని తప్పదు" అనుకున్నాడు.

తిన్నగా భాస్కరం దగ్గరికి వెళ్లి "నాకు ఈ వూళ్లో పని అయిపోయింది వెళ్లిపోతాను" అని చెప్పేసి వెళ్లిపోవాలి. ఇక ఇక్కడ ఉండడం శ్రేయస్కరంకాదు...." అనుకున్నాడు.

దొంగతనమో, మరోటో అలాంటిదే నేరం చేసిన వాడిలా గబగబా వెళ్లిపోయాడు. **(ఇంకా ఉంది)**

అంటారు. (3) న్యూరానులను, ఏగ్జానులను కలిపి ఉంచే న్యూరోగ్లియా అనే అనుబంధ ధాతువు. న్యూరానులన్నీ కలిసి ఏర్పడిన నైరిక ధాతువుగా గౌర వర్ణం కలదై ఉంటుంది. ఏగ్జానులు కలిసి ఏర్పడిన ధాతువు ధవళ వర్ణం కలదై ఉంటుంది. మెదడులో గౌరభాగము, వెలుపలి వైపునా, ధవళ భాగము, లోపలి ప్రక్కనా ఉంటుంది. కాని వెన్నుపాము దగ్గరకు వచ్చేసరికి, ధవళ భాగము వెలుపలివైపునా గౌరభాగము కేంద్రగతమూ అవుతుంది. దీనికి కారణం తెలియదు.

మెదడులో చాలా భాగములున్నవి. అందులో పార్శ్వ వైఖరిలో ఒక గాడి ఉంటుంది. ఆ గాడి ముందున్న గౌరభాగము, మోటారు భాగము. అంటే అది కండరముల చలనమునకూ, గ్రంథుల స్యందనమునకూ కావలసిన ఆదేశాలు పంపే భాగము. ఆ గాడికి వెనుక ఉండే గౌరభాగము, సెన్సరీ భాగము. అది శరీరంలో ఇంద్రియముల నుండి వచ్చే వార్తలను సేకరించి, మోటారు భాగమునకు అందజేస్తుంది. ఆ వార్తలను బట్టి మోటారు భాగము ఏం చేయాలో నిర్ణయిస్తుంది. అంటే శరీరంలో వివిధ భాగములనుండి వార్తలను మెదడుకు తీసుకుపోయే నరములు కొన్ని.

మనము-మనదేహస్థితి

11 వ పేజీ తరువాయి

ఊర్ధ్వగామి నరములు (Afferent Nerves) అంటారు. మెదడు నుంచి వార్తలను తీసుకుపోయేవి అధోగామి నరములు (Efferent Nerves). అనిచ్ఛాధీన కండరములకు పోయే నరముల సముదాయమును 'స్వచ్ఛందనరాశయము' అంటారు.

స్వచ్ఛంద నరాశయ భాగములలోనూ ఈ రెండు రకముల నరములూ ఉంటవి. చిత్రంలో చూపబడినట్లు వెన్నుపాముకు ఒక వైపున సింపతెటిక్ దండ వున్నది. ఇటివంటిదే రెండవ ప్రక్కనా ఉంటుంది. ఇది, అనేక న్యూరాను గుంపులు కలిగి ఏర్పడిన దండవంటి నిర్మితి. ఈ న్యూరానుల గుంపును గేంగ్లియాన్ అంటారు.

ఈ రెండు వర్టెబ్రాల మధ్యన ఉండే రంధ్రముల ద్వారా రెండు వైపులా రెండు వెన్ను నరములు బయటికి వస్తవి. సింపతెటిక్ దండలో గేంగ్లియానులకూ ఈ నరములకూ సంబంధం ఉంటుంది. వెన్ను కంఠ భాగములో 7 వర్టెబ్రాలు, వక్షభాగంలో 12వర్టెబ్రాలు, ఉదర భాగంలో 5 లంబారు వర్టెబ్రాలు జఘర భాగంలో 5 సేక్రల్ వర్టెబ్రాలు, వాల భాగంలో 4 వర్టెబ్రాలు, మొత్తం 33 వర్టెబ్రాలు (వెన్ను పూసలు) ఉన్నవి. ఇందులో సింపతెటిక్ దండలో గేంగ్లియానులు, 1వ వక్ష వర్టెబ్రాకు మూడవ లంబారు వర్టెబ్రాకు మధ్య ఉండే సెగ్మెంట్ల ననుసరించి ఏర్పడతవి. అంటే 12 వక్షభాగపు నరములనూ లంబారు నరములనూ అనుసరించి, సింపతెటిక్ దండ ఏర్పడింది. ఈ 15 భాగాలలో వుండే న్యూరానులనుండిసాగి ఏగ్జానులు కట్టలుగాకూడి కూడి వెన్నుపాము పార్శ్వ భాగములో క్రిందికి దిగుతవి. ఎందుకు సింపతెటిక్ దండ కాండమునకు సంబంధించిన వక్ష ఉదర భాగపు సెగ్మెంటులను మాత్రమే అనుసరించి పరిమితమై ఉన్నదో విజ్ఞానం వెలువరించలేకుండా ఉన్నది. ఎన్ని వెన్ను నరములు ఉంటే అన్ని సింపతెటిక్ గేంగ్లియానులు ఉండాలని లేదు. చాలామందిలో 22 లేక 23 గేంగ్లియానులే ఉంటవి. 33 వర్టెబ్రాలుంటే 31 వెన్ను నరములే ఉన్నవి. ఈ 31 వెన్ను నరములకు సమానంగా 31 సింపతెటిక్ గేంగ్లియానులున్నా, అందులో కొన్ని ఒకదానిలో ఒకటి


కలిసిపోయి 21 లేక 22 గేంగ్లియానులై పోయి వి.

స్వచ్ఛంద నరాశయంలో రెండవ భాగము పేరా సింపతెటిక్ సిస్టము. ఈ సింపతెటిక్ పేరా సింపతెటిక్ నరములు అనే విచక్షణ మూడు కారణముల వల్ల జరిగింది. (1) వాటిలో ఊర్ధ్వగామి అధో

మనమూ-మన దేహస్థితి

గామి నరములు ప్రారంభ గమ్యస్థానములకు సంబంధించిన కేంద్రములు, కేంద్ర నరాశయంలో వేరువేరు స్థానములలో ఉండడం. (2) అవి నిర్వర్తించే ధర్మములు కూడా వేరుగా ఉండడం, (3) కొన్ని ఔషధముల ప్రభావము స్వచ్ఛంద నరాశయపు రెండు శాఖలమీద వేరువేరుగా ఉండడం.

చిత్రంలో పేరా సింపతెటిక్ నరములు 'X' మార్కుతోనూ సింపతెటిక్ నరములు 'O' మార్కుతోనూ సూచింపబడ్డవి. కంటిలో ఐరిస్ (Iris) అనే రంగు భాగానికి పోయ్యే



మూడవ శిరోనరము, ముఖానికి పోయే 7 వ శిరోనరము, నోటికిపోయే 9 వ శిరోనరము కేంద్ర నరాశయంలోనే ఆరంభమైనవి. 7 వ శిరోనరము రెండు కుదుళ్లనుండి రెండు శాఖలుగా ఆరంభమైనది. ఒక శాఖకంటిలో నల్లగుడ్డుకు పోతే మరొక శాఖ బాష్పగ్రంధికీ ముక్కుకూ పోయింది. 3, 7, 9 శిరోనరముల శాఖా విస్తరణము శిరస్సులోనే అంతమొందింది, 10 వ శిరోనరమైన వేగస్ (Vagus), మెడుల్లా అంబ్లాంగేటాలో అన్నిటికన్నా క్రింద ఆరంభించి హృదయంనుంచి మూలస్థానం వరకూ ఉండే సర్వ అవయవములకూ పోయింది. ఒక్క ఎడ్రినల్ గ్రంధికి మాత్రం పోదు. ఇది గమనించవలసిన విషయం. మళ్లీ పేరా సింపతెటిక్ నరములు సేక్రం 2, 3, 4 సెగ్మెంటుల నుంచి ఆరంభమైనవి. అవన్నీ కలిసి ఒకే కట్టగా ఏర్పడి వాటి శాఖలు స్థూలాంత్రపు అవరోహతిర్యగ్భాలకు, కిడ్నీలకూ, మూత్రాశయానికీ, జాత్యాంగములకూ (Sex-organs) పోతవి. ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయం. స్థూలాంత్రం ఆరోహభాగం (Ascending Colon) తిర్యగ్భాగంలో (Transverse Colon) ఎడమవైపు సగం వేగస్ శాఖలతో ప్రేరేపిత మౌతున్నది. మిగతా భాగములు సేక్రమునుండి వచ్చే పేరా సింపతెటిక్ నరములతో ప్రేరేపిత మౌతున్నవి. స్థూలాంత్రము, మొదటి భాగము, రెండవ భాగము, పిండ శరీరంలో రెండు స్థానముల నుంచి ప్రవృద్ధి చెందినవి. ఈ వివిధ భాగములు కలిసే చోటును కేనన్ పాయింటు (Cannon point) అంటారు. కేనన్ అనే శాస్త్రజ్ఞుడు, దీనిని వివరించాడు గనుక ఆపేరు వచ్చింది. ఎడ్రినల్ గ్రంధికి వేగస్ నరంలో పేరా సింపతెటిక్ తంతువులు పోవు. అదేవిధంగా అవి లివరుకూపోవు. కాని పిత్తరసం నిలవవుండే పిత్తాశయానికి పోతవి. ఇదీ గమనించవలసిన విషయమే. ఉదరాంగములు రోగగ్రస్తములై బాధ కలిగినప్పుడు, ఈ విచక్షణ వివరములు తెలియకపోతే ఆ బాధ ఎక్కడ ఆరంభమైందో ఎందుకు కలుగుతున్నదో అర్థంకాదు.

పై విషయములు గమనిస్తే పేరా సింపతెటిక్ నరములు కేంద్ర నరాశయంలో ఆద్యంత భాగముల నుండి ఆరంభిస్తున్నవనీ, వక్షభాగములో 12, ఉదరభాగంలో 3, మొత్తం 15 సెగ్మెంటుల నుండి సింపతెటిక్ గేంగ్లియానులు ఏర్పడుతున్నవనీ తెలుస్తున్నది. ఈ శరీర నిర్మితి రహస్యం యోగశాస్త్రంలోనూ, మంత్రశాస్త్రంలోనూ అతి ముఖ్యమైనది.

ఒకప్పుడు శేక్రము అనే శల్యముతో యూరప్ దేశీయులు దేవతాపూజలు చేస్తూవుండేవారట. శేక్రెడ్ (Sacred) అంటే పవిత్రమైనది. అని అర్థము. పవిత్ర కార్యములకు వినియోగింపబడే శల్యము గనక శేక్రమునకు ఆ పేరు వచ్చింది. అందులో మొదటి సెగ్మెంటు వదలితే మిగతా మూడు సెగ్మెంటుల నుంచీ వచ్చే నరములే మల మూత్ర విసర్జన, వీర్యస్ఖలనాది కార్యములను శాసించేవి. పశువులు ఎక్కడబడితే అక్కడ మల మూత్ర విసర్జనాదులు సాగిస్తవి. మనం అట్లా చేయము. ఆ యిచ్ఛ కలిగినా, అవకాశం ఉన్నా నలుగురిలో కొన్ని పనులను నాగరికులయిన మానవులు చేయలేరు. ఇందుకు కారణం యీ ప్రదేశం నుంచి పోయే సింపతెటిక్ నరములద్వారా పోయే ఆదేశములే. అనేక అంగములమీద సింపతెటిక్ నరముల ప్రభావము పరస్పర విరుద్ధముగానే ఉంటుంది. ఔషధ శాస్త్రరీత్యా పేరా సింపతెటిక్ నరములను స్తబ్ధములు (Paralyse) చేసే ఔషధములు సింపతెటిక్ నరములలో ఏ మార్పునూ తేలేవు. అదేవిధంగా సింపతెటిక్ నరములలో మార్పులు కలిగించే ఔషధములు పేరా సింపతెటిక్ నరములపై ఏ ప్రభావమును ప్రదర్శించవు. సింపతెటిక్ సిస్టము నరాశయంలో విశిష్టమైన భాగము. పేరా సింపతెటిక్ నరతంతువులు యితర నరములలో భాగములుగా ఉంటవి.

జీర్ణకోశాంగములకు సంబంధించినంతవరకు పేరా సింపతెటిక్ నరము, వేగస్ నరము వక్ష, ఉదరభాగములలో ఉన్న అవయవములకు సంబంధించిన బాధలను మెదడుకు తెలియజేసే నరతంత్రాలు. సింపతెటిక్ నరములద్వారా వెన్నుపాములోకి ప్రవేశించి దానిలో బాధానుభూతికి మాత్రమే సంబంధించిన మార్గములగుండా మెదడును చేరుకొంటవి. ఈ బాధావాహిక నరములు, సెగ్మెంటువారీగా బాధను మెదడుకు చేరుస్తవి. ఈ సెగ్మెంటులకే, చర్మము, కండరములలో నుండి ప్రారంభమయిన బాధావాహిక నరములు కూడా చేరుతవి. ఇవన్నీ కలిసి కట్టగా ఏర్ప . వెన్నుపాములో ఇతర బాధావాహిక నరములతో పాటు ఒక విశిష్టమార్గములో మెదడుకు పోతవి. ఈ కారణంచేతనే వక్ష, ఉదరాంతర్భాగములో ఉన్న అంగములు ఇన్‌ఫ్లేం అయినప్పుడు ఆ అంగము ఉన్న స్థానంతోనూ దాని సన్నిహిత ప్రదేశములతోనూ మాత్రమే నొప్పి తెలియదు. ఏ వెన్నుపాము భాగములో సింపతెటిక్ నరము ప్రవేశిస్తుందో ఆ భాగమునకు సంబంధించిన చర్మము, కండరములు మొదలైన ఇచ్ఛాధీన శరీర ప్రదేశములలో కూడా బాధ ఆరంభమౌతుంది. ఈవిధంగా వక్ష, ఉదరకుహరాంతరాళంలో ఉన్న అంగములో ఏర్పడే నొప్పి, వాటితో సంబంధం లేనివి, వాటికి దూరములుగా ఉన్నవి అయిన ప్రదేశములలో పరావర్తించడమును 'రిఫర్డ్ పెయిన్' (Reffered Pain) అంటారు. 'పరావర్తబాధ' అని దానిని వర్ణించవచ్చును. మరొక విశేషం—అటువంటి పరావర్త ప్రదేశములలో చర్మమును ఇరిటేట్ చేసి, అందులో రక్తాధిక్యతను కలిగించే పట్టీలు, పట్లు, ఆయింటుమెంట్లూ ఉపయోగించినప్పుడూ ఆ లోపలి అంగములలో రక్తాధిక్యత (Congestion) తగ్గి బాధ ఉపసయిస్తుంది. మాడులో వచ్చే పోటు, కణతలమీద అమృతాంజనం రుద్దితే పోవడం ఇందువల్లనే. మూత్రబంధం జరిగినప్పుడు నాభిమీద పట్టీ వేస్తే మూత్రం రావడమూ ఇందువల్లనే. ఈవిధంగా ఇచ్ఛాధీన అనిచ్ఛాధీన నరములు, వెన్నుపాములో ఒకే ప్రదేశంలో ప్రయాణించినందున అంతర్గతమైన బాధ బహిర్గతమై, దేహాపరి భాగములలో ప్రదర్శింపబడుతున్నది.

రెండు వర్టెబ్రాల మధ్య ఉన్న వెన్నుపాము భాగము ఒక సెగ్మెంటు అనుకోరాదు. కొన్ని భాగాలలో 5 వర్టెబ్రాలు ఉన్నది ఒక సెగ్మెంటు కావచ్చు. మరికొన్నిచోట్ల రెండు, మూడు వర్టెబ్రాల మధ్య ఉండే భాగము ఒక సెగ్మెంటు కావచ్చును. హృదయానికి సంబంధించిన బాధ 11వ వక్ష వెర్టెబ్రానుండి 5వ వక్ష వర్టెబ్రా వరకు ఉన్న వెన్ను భాగముల నుండి పైకిపోయే ఊర్ధ్వగామి సింపతెటిక్ నరముల ద్వారా అనుభూతమవుతుంది. జఠరాశయం బాధ 6 నుండి 10 వరకు ఉండే వక్ష వర్టెబ్రాల ద్వారా పోతుంది. చిన్న ప్రేగులలో బాధ 9—10 వర్టెబ్రాల ద్వారానూ, పెద్ద ప్రేగు అవరోహ, తిర్యగ్భాగములకు సంబంధించినంతవరకు 11 వ వక్ష వర్టెబ్రాకు 1 వ ఉదర వర్టెబ్రాకు మధ్య ఉండే భాగమునుండి, అవరోహభాగము, రెక్టము 1—2 ఉదర వర్టెబాల మధ్య ప్రదేశమునుండి 2—4 జఘన వర్టెబ్రాల నుండీ మెదడులో ఉన్న సెన్సరీ భాగానికి పోతవి. లివరు పిత్తాశయ బాధ 7—9 వక్ష వర్టెబ్రాలు మధ్య ఖండమునుండి పైకి పోతుంది. వెన్నుపాములో ఈ యీ ప్రదేశములలో ఏదైనా వ్యాధి ఏర్పడి, వెన్నుపాముకు వత్తిడి ఏర్పడితే విపరీతమైన బాధ ఉదరంలో అనుభూతమవుతుంది (సశేషం)

సరాగమాల

9 వ పేజీ తరువాయి

భిలాయ్‌నుంచి ఎస్. లక్ష్మణాచారి వ్రాశారు. అందరు పాటకుల గురించి వ్రాస్తారు. ప్రఖ్యాత గాయకి ఆర్. బాలసరస్వతిని గురించి వ్రాయరేమని.

ఆమె గురించి వ్రాయటానికి యేముంది ఇప్పట్లో? ఆమె సినిమాలో పాడటంలేదు. ఆరేళ్ల క్రిందట పాండురంగానికి పాడిన భజన గీతం ఇటీవలి "దేవసుందరి"లో ఒక వారంపాటు వినిపించింది. చాలా బాగున్నది. ఒక మాదిరిగా ఉన్నది. అదే చిత్రంలో రాజాతో పాడిన యుగళగీతం. ప్రైవేటుగా విడుదలచేయటానికి హెచెంవి వారు రెండు పాటలు, వేణు ఆధ్వర్యాన వడ్డాది వ్రాసినవి ఆర్నెల్ల క్రిందట రికార్డు చేశారు. కాని ఇంకా విడుదల చేయలేదు. ఆ కంపెనీ అధినేతల నడిగితే అసలు విషయం ఒకటనిచెప్పి, అందరికీ తెల్పవలసిన విషయం 'మా ఇష్టం వచ్చినప్పుడు విడుదల చేస్తాం' అని పంజం చూపించారు. బాలసరస్వతిని అడిగితే లోపాలు కారణాలు వేరే ఉన్నవి. అవి కాంట్రాక్టు గొడవలని ఆమె అన్నారు. విజం ఆ పెరుమాళ్ల (గ్రామఫోను కంపెనీ పెరుమాళ్లు కాదు: దేవుడు) కెరుక.

బాలసరస్వతి అడపా దడపా రేడియోలో పాడుతూనే ఉన్నారు. వారి అడ్రసు పత్రికాముఖంగా తెల్పటం సాధ్యంకాదు. నాకు వ్రాస్తే వారికి ఉత్తరం త్రిప్పి పంపగలను. ★

ఆడంబరాలను విడనాడండి
దేశసంపదను వృధా కానీయకండి

కాల్గేట్‌తో నోటినించి దుర్వాసన రాకుండా చేసుకోండి
రోజంతా **దంతక్షయం**
కాకుండాకూడా కాపాడుకోండి!




ఎందుకంటే: ఒక్కసారి తోముకొంటేనే కాల్గేట్ డెంటల్ క్రీమ్ నోటిలో దుర్వాసన మరియు దంతక్షయమునకు కారణమైన సూక్ష్మ క్రిములను 85% వరకు తొలగించును. కాల్గేట్ 10 మందిలో 7 గురికి నోటి దుర్గంధమును వెంటనే ఆపుతుందని మరియు భోజనము అవగానే కాల్గేట్ పద్ధతిలో పళ్లు తోముకొనుట ద్వారా ఎక్కువ మందికి ఎక్కువ దంతక్షయము అరికట్టిందని దంత శాస్త్ర చరిత్రలో పూర్వము ఎన్నడూ తెలియ చేయనంతలా శాస్త్ర పరిశోధనల ఫలితముగా నిరూపించబడినది. ఊరికే నోటిలో నీళ్లు పోసుకొని పుక్కిలించుట చాలదు. భోజనము అయిన వెంటనే క్రమంతప్పకుండా కాల్గేట్‌తో పళ్లు తోముకోండి. దాని పచేతనమైన నురుగు పళ్ల మధ్య కనపడకుండా ఉండే సందులలోనికి వెళ్లి నోటి దుర్వాసనకు మరియు దంతక్షయమునకు కారణమైన కుళ్లి పోతున్న ఆహారపు తునకలను తీసివేస్తుంది. పిల్లలు కాల్గేట్‌తో పళ్లు తోముకొనుటకు యిష్టపడతారు ఎందుకంటే దాని రుచి ఉండే దాని పిప్పరమెంట్ వంటి రుచి అంటే వారికి ప్రీతి.

మీకు పొడరు కావాలంటే, ఈ లాభములన్నిటినీ మీరు కాల్గేట్ టూత్ పౌడరు ద్వారా పొందగలరు...ఒక డబ్బా చాలా వస్తుంది.

కాల్గేట్‌తో క్రమం తప్పకుండా పళ్లు తోముకొంటే

- నోటి దుర్వాసనను పోగొట్టును
- దంతక్షయమును నిరోధించును
- పళ్లను మెరుస్తూ ఉండేలా ఉంచును



వారు ఎక్కువ శుభ్రముగా, తాజాగా ఉండుటకు మరియు పళ్లు ఎక్కువ తెల్లగా ఉండుటకు ప్రపంచములో ఏ యితర పళ్లు తోముకొనే క్రీమ్ కన్నా కాల్గేట్‌నే ఎక్కువ మంది వాడుతున్నారు


DO.6.33,TEL.)

చేనేత చీరె



"కాశ్మీర్ బ్యూటీ" చేనేత చీరె రు. 8/— మాత్రమే. 2 చీరెలు రు. 15/—3 చీరెలు రు. 21/—4 చీరెలు రు. 27/—డీలక్స్ క్వాలిటీ. రు. 12 లు 2 చీరెలు రు. 22 లు 3 లేక 4 చీరెలు కొనువారికి కొత్త సం: త్సరం డైరీ, ఒక శిల్కు బ్లౌజ్ ఉచితము. ప్యాకింగ్ పోస్టేజికూడా ఉచితము.

ROSHAL LAL & SONS,
(D.A.M) Ajmal Khan Road,
New Delhi-5



పెప్స్
లోక ప్రసిద్ధయిన గొంతు మరియు గుండె బిళ్లలలో రొమ్ము పడిశెము

త్వరితంగా నివారించ బడినది

గొంతు నొప్పి, రొమ్ము పడిశెము దగ్గులు, జలుబులు, గొంతు మరియు గుండె బిళ్లలైన పెప్స్‌తో త్వరితంగా నివారణ యగును. పెప్స్‌ను చప్పరించి, నొప్పిని నివారించి క్రిములను నిర్మూలించే చర్యను జరుపునట్టి... అందరికమనకర ఆవిరులను ఆస్వాదించండి.



పెప్స్
గొంతు మరియు గుండె బిళ్లలు

మందుల వ్యాపారు అందరి వద్దనూ దొరకును

వి. ఇ. ఫుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లి

FPY.56-TEL

సోల్ ఏజంట్లు: దాదా & కిం లి., 86, నైనప్పనాయకన్‌వీధి, మద్రాసు-3.

అవీ - ఇవీ - అన్నీ

గుడిగంటలు

"నీ కనుదోయిని నిద్దురనై .....
మనసున పూచే శాంతినై
ఎడబాయని నీడగ తోడౌతా
నీ కనులకు వేనే జోడౌతా ....."

పై పాటను వార్ల చిరంజీవి వ్రాయగా జానకి పాడింది. ఈ పాటను రాజలక్ష్మీవారు "గుడి గంటలు" చిత్రంలో జగ్గయ్య, కృష్ణకుమారి, వానంతి మొదలగువారితో చిత్రీకరించారు. సంగీతం : ఘంటసాల, మాటలు : ముళ్లపూడి వెంకటరమణ, దర్శకుడు : వి. మధుసూధన్‌రావు, నిర్మాతలు : సుందరలాల్ నహతా, అండ్ డూండీ. ఈ చిత్రంలో రామారావు కథానాయకుడు. రేలంగి, రమణారెడ్డి, గిరిజ, శాంతకుమారి, మిక్కిలినేని మొదలగువారు కూడ నటిస్తున్నారు.

దేశద్రోహులు రీరికార్డింగ్

"ఓ రంగుల గువ్వా! రవ్వల మువ్వా! బంగరు సింగారి! అహ! వయ్యారం ఓహో సింగారం, నీ రంగే బంగారం. ఓరయ్యో! ఓరయ్యో! బలే!



నటి జయంతి.

బలే! బలే బడాయి యీ చినదాని మనసేలే— కథే లడాయి! ...." పై పాటను మల్లాది రామ కృష్ణశాస్త్రిగారు వ్రాశారు. పిఠాపురం నాగేశ్వరరావు, స్వర్ణలతలు పాడగా శ్రీ రాజేశ్వరరావు కూర్చిన చక్కటి సంగీతంతో వాహినీ స్టూడియోలో రికార్డు చేయబడింది.

"ఈ పాటను వల్లం నరసింహారావు గీతాంజలితో చిత్రీకరిస్తారు. రేలంగి, గిరిజలు కూడ ఉంటారు.

"చిక్కావులే దొరా—దొరికావులే దొరా ....
షోకైనా చిన్నదానిచేత చిక్కావోయ్ ...."

ఈ పాట కూడా మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు వ్రాసిందే. శ్రీమతి జానకి పాడగా వాహినీ స్టూడియో 3 వ థియేటరులో రికార్డు చేయబడింది.

ఈ పాటను రాజనాల ఎదుట గిరిజతో చిత్రీకరిస్తారు. రామారావు, రేలంగి వగైరా మారు వేషాలలో ఉంటారు. ఈ పాట క్లైమాక్సుకు సంబంధించింది. "భాంగ్రా" నృత్యంగా చిత్రీకరిస్తారు సంగీత దర్శకుడు : రాజేశ్వరరావు. ఛాయాగ్రహ పర్యవేక్షణ, నిర్మాత, దర్శకుడు : బోళ్ల సుబ్బారావు.

ఫిలిం డివిజన్‌లో

సాహితీవేత్త, సంఘ సంస్కర్త అయిన కీ. శే. కందుకూరి వీరేశలింగంగారి జీవితచరిత్ర సుమారు 2000 అ. మించకుండా, డాక్యుమెంటరీ చిత్రం

15 రోజులకు మా ...



మేలురకం అందమైన శాలువల క్లియరెన్స్ అమ్మకం. ఒక శాలువధర రు. 7 రెండు శాలువలు ధర రు. 13/-. మూడుశాలువలు రు. 18/-. ప్రతి శాలువతో ఒక జత ఇయర్ టాప్స్ ఉచితముగా పంపబడును. కొద్దిస్టాకుగలదు వెంటనేమీఆర్డరుపంపండి.

PARIS COMMERCIAL CO.,
(WAM) P.B No. 1804, DELHI-




ఉత్తమ చికిత్స

ఏ కారణాలచేత నైనా ధాతునష్టం చెంది, దాంపత్య సౌఖ్యం అనుభవించలేనివారు వెంటనే 15 నయా పైసల స్టాంపుతో సంప్రదించండి.

డా॥ ఎ. పూర్ణచంద్రరావు,
N.D.F.N.F.U.(Ceylon) సెక్సు స్పెషలిస్టు.
నాగేశ్వరరావు పంతులు రోడ్డు,
పూర్ణా పిక్చర్స్ వద్ద
గాంధీనగరం :: విజయవాడ-3.

నాణ్యత మరియు పొదుపు కుటుంబం అంతటికి



కాల్గేట్

బహుళ వినియోగ టాల్కు

అపురూపమైన పువ్వుల శాశ్వత సువాసనగలది!

CAPT. 6. 1 TEL.



సర్వ గర్భాశయ వ్యాధులను పోగొట్టి, ఆరోగ్యముగ సంతాన సమర్థులుగ చేయును. అన్నిచోట్ల దొరకును. వెల 2.8.0

కృష్ణా లేబొరెటరి బెజవాడ



ఐటెక్స్ (కాటుక)

శాస్త్రీయంగా తయారైనది
చిన్నపిల్లలకు కూడా వాడవచ్చును.
ఐటెక్స్ బింది
అనేక రంగులలో లభించును

అరవింద్ లేబరేటరీస్

పి. బి. 1415, మద్రాసు-17.

తెలంగాణా జిల్లాలకు, హైదరాబాద్ మినహా ఆంధ్రప్రదేశ్‌కు ఏజెంట్లు
ప్రగతి ఏజెన్సీస్,
పులిపాటివారి వీధి, విజయవాడ-1.

ఒకటి తయారుచేసి యివ్వవలసిందిగా ఛాయా గ్రాహకుడు, నిర్మాత, దర్శకుడు అయిన శ్రీ బోళ్ల సుబ్బారావుకు ఫిలిం డివిజన్‌వారు ఆఫర్ చేశారు.

1963 సం. డిశంబరు వరకు తమ స్వంత చిత్రం "దేశద్రోహులు" నిర్మాణం సరిపోతుంది. ఆ తర్వాత పై డాక్యుమెంటరీ చిత్రం వెంటనే ప్రొడ్యూస్ చేసి యివ్వనున్నట్లు ఫిలిం డివిజన్ వారికి శ్రీ సుబ్బారావు తెలియజేశారు.

సి. ధర్మారావు. ★

"నర్తనశాల" సమీక్ష

భారతంలోని విరాటపర్వం ఆధారంగా ఈ చిత్రం తయారైంది. భారతగాథ, ప్రత్యేకించి పాండవుల అజ్ఞాతవాసానికి సంబంధించిన విరాట పర్వం కథ తెలియనివారు ఉండరు. ఈ చిత్రం అర్జునుడు ఊర్వశియొక్క శాపం పొందటంతో ప్రారంభమై, ఉత్తరాభిమన్యుల వివాహంతో సమాప్తమవుతుంది. ఎక్కడా విసుగు జనింపజేయకుండా కథను ఝురీవేగంతో నడిపిన దర్శకుడు కామేశ్వరరావు, కవి సముద్రాల అభినందనీయులయ్యారు. హాస్యం అనే నెపంమీద ముతక శృంగారానికి స్థానం ఇవ్వకపోవటం విశేషం. అయితే విరటుని పాత్ర విషయంలో కొంత అన్యాయం జరిగిందేమోనని పిస్తుంది. ఉత్తరుని పాత్ర హాస్యరసానికి అవకాశమిచ్చినా, అతని తండ్రిని కూడా అందుకు వినియోగించటంలో ఔచిత్యం ఏమిటో బోధపడదు. విరటుడు సింహబలుని భుజశక్తిమీద ఎంతగా ఆధారపడినా, వట్టి చవట మాత్రం కాడు. అతడు స్వయంగా గొప్ప వీరుడు. ఉత్తరుడైనా అంతకుపూర్వం ఎలాంటి వాడైనప్పటికీ బృహన్నలే అర్జునుడని తెలుసుకున్నది. లగాయతూ ధీరుడేగాని భీరువుకాదు. మహావీరుడైన అర్జునునకు అతడు సారథ్యం నిర్వహించటమే ఇందుకు నిదర్శనం. కేవలం హాస్య రసపోషణకై ఈ పాత్రలను మార్చినట్లు కనిపిస్తుంది. ఏది ఏమైనా ఈ హాస్యం వెర్రితలలు వేయ పోవటం విశేషం.

కీచకుడుగా ఎస్. వి. రంగారావు నటన ఉన్నత శిఖరాలను అందుకున్నది. దుర్మదాంధుడైన సింహబలునియొక్క పరస్త్రీ వ్యామోహాన్ని, దురహంకారాన్ని ఆయన అతి సహజంగా ప్రదర్శించారు. బృహన్నలగాను, సమరోత్సాహియైన అర్జునుడుగాను ఎన్. టి. రామారావు నటన ప్రశంసనీయంగా ఉంది. తెరకు కొత్తవాడైనా సుప్రసిద్ధ మల్లుడు దండమూడి రాజగోపాల్ వలలుని పాత్రను నిగ్రహంతో నిర్వహించారు. ధర్మరాజుగా మిక్కిలినేని, కృష్ణుడుగా కాంతారావు, దుర్యోధనుడుగా ధూళిపాళ, విరటుడుగా ముక్కామల, ఉత్తర కుమారుడుగా రేలంగి పాత్రోచితంగా నటించారు. శోభన్ బాబు (అభిమన్యుడు), గోపాలరాజు (నకులుడు), నాగరాజరావు (సహదేవుడు), వంగర, అల్లు రామలింగయ్య మొదలైనవారు ఉన్నంతలో తమ తమ పాత్రలను బాగానే పోషించారు.

ఈ చిత్రంలో స్త్రీ పాత్రలకు అంతగా ప్రాధాన్యంలేదు. అసలు ఉన్న స్త్రీ పాత్రలే తక్కువ. సైరంధ్రిగా సావిత్రి ప్రేక్షకుల సానుభూతి చూరగొన్నారు. పద్మినీప్రియదర్శిని (ఊర్వశి) నాట్యం మనోహరంగానే ఉన్నా, ఉచ్చారణ ఇంపుగాలేదు. విజయలక్ష్మి (ఉత్తర), సంధ్య (సుధేష్ణ) లక్ష్మీరాజ్యం (సుభద్ర) సూర్యకాంతం పాత్రోచితంగా నటించారు. తెలుగు చిత్రసీమలో ఒకప్పుడు అత్యున్నత స్థానం ఆక్రమించి, దాదాపు 20 ఏళ్ళపాటు మరుగున పడిపోయిన తార కాంచనమాల కనీసం రెండు నిముషాలైనా ఈ చిత్రంలో కనిపించటం ఒక ప్రత్యేక ఆకర్షణ. ★

హైదరాబాద్ సినిమా

పద్మశ్రీ వారి చిత్రం 3

"రక్షించు డాక్టరు బాబూ ! నా భార్య నిండు మూలాలు. అటో, ఇటో తేలిపోతుంది."

"ఏం ఫరవాలేదు. ఎక్కడ మీ ఇల్లు ?"

"దగ్గరనే బాబూ, పూరింట్లో ఉంటున్నాం."

"సరే, పద. ఇప్పుడే వస్తున్నా .... ఏయ్ ! బాయ్! సైకిలు సిద్ధంచెయ్యి."

డాక్టరు కృష్ణ, ప్రజాసేవయే పరమావధిగా ఎంచుకొని, పల్లెటూళ్ల ప్రాంతానికి వెళ్లి, అక్కడే పేదసాదలను ఆదుకొంటూ ఉంటాడు. పై సంభాషణ డాక్టరు కృష్ణ, మరో పేదరైతు మధ్య జరిగినవి. ఈ దృశ్యాన్ని సారధీ స్టూడియోస్‌లో గతవారం చిత్రించారు. ఈ చిత్రం పద్మశ్రీ వారి "ప్రొడక్షన్ నంబరు 3."

దర్శకత్వంలో కాకలుతీరిన శ్రీ పి. పుల్లయ్య గారే యీ చిత్రానికి దర్శకులు. శ్రీ వి. వెంకటేశ్వర్లు నిర్మాత.

కథానాయకుడు డాక్టరు కృష్ణగా నటిస్తున్న శ్రీ అక్కినేని నాగేశ్వరరావు శక్తివంచన లేకుండా చేస్తున్న నటన, చిత్రానికి నూతనమైన వన్నెలను చేకూర్చే అవకాశం ఉన్నది. కథానాయిక పాత్రను పోషిస్తున్న కుమారి జమున చలాకీగా, హుషారుగా నటించవచ్చును.

వీరుగాక, ఎస్. వి. రంగారావు, రమణారెడ్డి, గుమ్మడి, హరనాథ్, శారద, సూర్యకాంతం, క్రొత్త నటి గీతాంజలి ప్రభృతులు నటిస్తున్నారు. సంభాషణలు : శ్రీ ఆత్రేయ, పాటలు : శ్రీయుతులు సి. నారాయణరెడ్డి, ఆత్రేయ, దాశరథి.

సెప్టెంబరు ఒకటవ తేదీన ప్రారంభమయిన చిత్రం శరవేగంతో నిర్మింపబడుతున్నది. ఇంత వరకు ఆరు రీళ్లకు పైగా చిత్రీకరించటం జరిగింది. ఆరు పాటలను రికార్డు చేశారు.

'పద్మశ్రీవారు' ఆమధ్య కలకత్తాలో కొన్ని ఔట్‌—డోర్ చిత్రాలను షూటింగు చేశారు. కలకత్తాలో (సినిమా కథ ప్రకారం) జరిగిన 'మెడికల్ కాన్ఫరెన్సు'లో కథానాయకుడైనా డాక్టరు కృష్ణ పాల్గొంటాడు. అక్కడే అకస్మాత్తుగా తన పాత స్నేహితుణ్ణి (హరనాథ్) కలుసుకొంటాడు. ఇరువురూ కొన్ని మధురస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకొంటారు కూడా.

ఎక్కడిదీ వారి స్నేహం? ఏమిటా మధుర స్మృతులు? వేచి చూదాం.

* * *

రాజధానిలో ఉన్న ఒకేఒక్క స్టూడియో 'సారధి' ని ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి గతవారం దర్శించడంతో 'చిత్రపరిశ్రమ ప్రభుత్వ సహాయం' విషయమై నగరంలో వూహాగానాలు బయలుదేరాయి.

పద్మశ్రీవారి 'ప్రొడక్షను నంబరు 3' షూటింగు జరుగుతుండగా శ్రీ సంజీవరెడ్డి సారథి స్టూడియోస్‌కు విచ్చేసి, దాదాపు ఒక గంటసేపు అక్కడే ఉన్నారు. షూటింగులో ఉన్న శ్రీ అక్కినేని నాగేశ్వరరావు ప్రభృతులతో కొంతసేపు ముచ్చటించారు.


శ్రీ సంజీవరెడ్డి చిత్రపరిశ్రమకు సంబంధించిన కొన్ని సాంకేతిక వివరాలను స్టూడియోస్‌లో తెలుసుకొన్నారు. స్టూడియో నిర్మించాలంటే ఎంతవుతుందో చిత్రం తీయాలంటే ఎంత కావాలో మొదలైన వివరాలన్నీ కూడా ముఖ్యమంత్రి తెలుసుకొన్నారు.

శ్రీ సంజీవరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో 'స్టూడియోస్'కు అనుకోకుండా రావటం, నిజంగా అందరినీ చకితుల్ని చేసింది. ప్రభుత్వం సినిమా పరిశ్రమకు చేసే సహాయానికి, శ్రీ సంజీవరెడ్డిగారి సారథి స్టూడియోస్ సందర్శనానికి అవినాభావ సంబంధం ఉండి ఉండక పోదని అభిజ్ఞుల భావన.



నర్తనశాలలో ఒక దృశ్యం.

వాశిరాజు ప్రకాశం.



Edited, Printed and Published by S. Radhakrishna at the AndhraPatrika Press; 6 &7 Thambuchetty Stree
Madras-1. Chief Editor S. Sambhu Prasad.



వర్ధమాన నటి గీతాంజలి. (ఫొటో: ప్రభాకర్)

Regd No. 4479 . ANDHRA SACHITRA VARA PATRIKA.

